“బ్రహ్మమొక్కటే” గ్రంథమాల

# నాయన్మారులు

## (అరువది ముగ్గురు శివభక్తుల చరిత్ర)

**ఆచార్య శ్రీపాద జయప్రకాశ్**

**తిరుమల తిరుపతి దేవస్థానములు**

**తిరుపతి - 517 502**

**2013**

# NAYANMARULU

by
**Prof. Sripada Jayaprakash**

T.T.D. Religious Publications Series No.1007
© All Rights Reserved

*First Edition : 2013*

Copies :

*Published by :*
**L.V. SUBRAHMANYAM**, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

***D.T.P:***
Office of the Editor-in-Chief
T.T.D, Tirupati.

*Printed at :*
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati - 517 507

# ముందుమాట

భారతదేశంలో అనాదిగా ఆ యా కాలాల్లో, ఆ యా కులాల్లో, ఆ యా ప్రాంతాల్లో అవతరించిన మహనీయులు ఎందరో మనకు దర్శనమిస్తారు. ఆ మహాపురుషులు అందరు వారి వారి కాలాల్లోని వివిధ పరిస్థితుల్లో కేవలం మనుగడ సాగించడం మాత్రమేగాక మానవోద్ధరణకు కృషి చేశారు. తద్వారా ప్రజల్లో సామాజిక చైతన్యంతోపాటు ఆధ్యాత్మిక వికాసానికి కూడా ఆ మహామనీషులు ఎంతగానో తోడ్పడ్డారు.

అలాంటి మహాత్ముల జీవితగాథలను, వారు ప్రబోధించిన జీవన సత్యాలను, ఆధ్యాత్మిక సందేశాలను భక్తులకు అందించాలన్న తలంపుతో తిరుమల తిరుపతి దేవస్థానం **"బ్రహ్మమొక్కటే"** అనే శీర్షిక క్రింద ఒక గ్రంథమాలను ప్రారంభించింది. అందు కనుగుణంగా కొందరు పండితుల చేత అలాంటి మహాపురుషుల జీవనరేఖను చిత్రించే గ్రంథాలను రాయించి ప్రచురించాలని సంకల్పించింది.

అందులో భాగంగా ప్రస్తుతం ఆచార్య శ్రీపాద జయప్రకాశ్‌గారు రచించిన **"నాయన్మారులు"** అన్న పుస్తకాన్ని అందజేస్తున్నాము. ఈ గ్రంథ పఠనం ద్వారా, పిల్లలు, పెద్దలు ఆధ్యాత్మికచైతన్యవంతులు కావాలని ఆకాంక్షిస్తూ..

*సదా శ్రీవారి సేవలో....*


లంక వెంకట సుబ్రహ్మణ్యం
కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

# విషయసూచిక


| | | పుట సంఖ్య |
|---|---|---|
| 1. | తిరు నీలకంఠ నాయనారు | 1 |
| 2. | ఇయర్ పగై నాయనారు | 2 |
| 3. | ఇళైయాంగుడి మార నాయనారు | 4 |
| 4. | మెయ్ పొరుళ్ నాయనారు | 6 |
| 5. | విఱన్మిండ నాయనారు | 8 |
| 6. | అమర్నీతి నాయనారు | 9 |
| 7. | ఎరిబత్త నాయనారు | 11 |
| 8. | ఏనాది నాథ నాయనారు | 13 |
| 9. | కణ్ణప్ప నాయనారు | 15 |
| 10. | గుంగులియ కలైయ నాయనారు | 18 |
| 11. | మానక్కంజార నాయనారు | 20 |
| 12. | అరివాట్టాయ నాయనారు | 21 |
| 13. | ఆనాయ నాయనారు | 22 |
| 14. | మూర్తి నాయనారు | 23 |
| 15. | మురుగ నాయనారు | 25 |
| 16. | రుద్ర పశుపతి నాయనారు | 25 |
| 17. | తిరునాళై పోవార్ నాయనారు | 26 |

| | | |
|---|---|---|
| 18. | తిరుకురిప్పు తొండ నాయనారు | 28 |
| 19. | చండేశ్వర నాయనారు | 29 |
| 20. | తిరునావుక్కరసు నాయనారు | 32 |
| 21. | కులచ్చిరై నాయనారు | 36 |
| 22. | కురుంబ నాయనారు | 36 |
| 23. | కారైకాల్ అమ్మైయార్ | 37 |
| 24. | అప్పూది యడిగళు నాయనారు | 41 |
| 25. | తిరు నీల నక్క నాయనారు | 43 |
| 26. | నమి నంది యడిగళు నాయనారు | 45 |
| 27. | తిరుజ్ఞాన సంబంధరు నాయనారు | 46 |
| 28. | ఏయర్‌కోన్ కలిక్కామ నాయనారు | 52 |
| 29. | తిరుమూల నాయనారు | 54 |
| 30. | దండి యడిగళు నాయనారు | 56 |
| 31. | మూర్ఖ నాయనారు | 58 |
| 32. | సోమాసి మార నాయనారు | 59 |
| 33. | సాక్కియ నాయనారు | 60 |
| 34. | సిరప్పులియారు నాయనారు | 61 |
| 35. | చిరుతొండ నాయనారు | 62 |
| 36. | కళఱ్రటిటివార్ నాయనారు | 66 |
| 37. | గణనాథ నాయనారు | 69 |
| 38. | కూఱ్రువ నాయనారు | 70 |
| 39. | పుగళ్ చోళ నాయనారు | 71 |
| 40. | నరసింగ మునైయరైయ నాయనారు | 72 |
| 41. | అతిపత్త నాయనారు | 73 |
| 42. | కలిక్కంబ నాయనారు | 74 |
| 43. | కలియ నాయనారు | 74 |
| 44. | సత్తి నాయనారు | 75 |
| 45. | ఐయడిగళ్ కాడవర్ కోన్ నాయనారు | 76 |
| 46. | కణం పుల్లార్ నాయనారు | 76 |
| 47. | కారి నాయనారు | 77 |
| 48. | నిన్హసీర్ నెడుమార నాయనారు | 77 |
| 49. | వాయిలార్ నాయనారు | 78 |
| 50. | మునైయడువార్ నాయనారు | 78 |
| 51. | కళర్ సింగ నాయనారు | 79 |
| 52. | ఇడంగళి నాయనారు | 80 |
| 53. | సెరుత్తుణై నాయనారు | 81 |
| 54. | పుగళ్ తుణై నాయనారు | 82 |
| 55. | కోట్పులి నాయనారు | 83 |
| 56. | పూసలార్ నాయనారు | 84 |
| 57. | మంగయర్ క్కరసి అమ్మైయార్ | 87 |
| 58. | నేస నాయనారు | 87 |
| 59. | కోచ్చెంగ చోళ నాయనారు | 87 |

60. తిరునీల కంఠ యాళ్ పాణ నాయనారు 89
61. శడైయ నాయనారు 90
62. ఇసై జానియర్ 90
63. సుందర మూర్తి నాయనారు 90





# 1. తిరు నీలకంఠ నాయనారు

**వే**ద బ్రాహ్మణులకు ఆవాసమైన చిదంబరంలో ఒక కుమ్మర కులంలో తిరునీలకంఠ నాయనారు జన్మించాడు. అతడు పరమేశ్వరునిపై అచంచల భక్తి తత్పరతలు కలిగినవాడు.

ఒక పర్యాయం తిరు నీలకంఠ నాయనారు ఒక వేశ్య ఇంటికి వెళ్లి తిరిగివచ్చాడు. తిరు నీలకంఠుని భార్య ఇది సహించలేకపోయింది. తన భార్య అలుకను పోగొట్టడానికై నీలకంఠనాయనారు మృదు మధురంగా మాట్లాడుతూ ఆమెను కౌగలించుకోవడానికి ప్రయత్నించాడు. "మీరు మమ్మల్ని తాకినట్లయితే తిరు నీలకంఠేశ్వరుని మీద ఆన" అంటూ ఆమె తన భర్తను వారించింది. తిరు నీలకంఠ నాయనారు తన భార్యను చూసి "నీవు మమ్మల్ని అని చెప్పడం వలన ఇక మీదట నిన్నే కాదు ఇతర స్త్రీలను కూడ మాతృమూర్తులుగా భావించి తాకను కూడ తాకను" అంటూ ప్రతిజ్ఞ చేసి అప్పటి నుండి బ్రహ్మచర్య వ్రతాన్ని పాటించాడు. యౌవనప్రాయాన్ని దాటి వారు ముసలివారయ్యారు. వారి భక్తి శ్రద్ధలను లోకానికి తెలియజేయాలనే ఉద్దేశంతో పరమేశ్వరుడు జంగమ వేషంతో అతని ఇంటికి వచ్చాడు.

మాయాశివుడు తన చేతిలో ఉన్న భిక్షాపాత్రను నీలకంఠుని చేతికి ఇచ్చి "ఇది చాలా అపూర్వమైంది. దీనిని నీ దగ్గర దాచి ఉంచు. మాకు అవసరమైనపుడు తీసుకుంటాను" అని చెప్పి వెళ్లిపోయాడు. తిరు నీలకంఠుడు దానిని తన ఇంటిలో ఒకచోట భద్రంగా దాచాడు. శివుడు నీలకంఠుని వద్దనున్న భిక్షాపాత్రను అదృశ్యమయ్యేలాగా చేశాడు.

కొంతకాలమైన తరువాత శివయోగి నీలకంఠుని దగ్గరికి వచ్చి "పూర్వం నేను నీదగ్గర దాచి ఉంచిన భిక్షాపాత్రను నాకు తిరిగి ఇవ్వవలసింద"ని

కోరాడు. నీలకంఠుడు ఇల్లంతా వెతికినా భిక్షాపాత్ర కనిపించలేదు. శివయోగితో "స్వామీ! మీరిచ్చిన భిక్షాపాత్రకు బదులుగా వేరొక అందమైన భిక్షాపాత్రను ఇస్తాను" అని చెప్పాడు. శివయోగి కోపంతో "నీవు నా భిక్షాపాత్రను దొంగలించావు. నీవు దానిని దొంగలించి ఉండకపోతే నీ భార్య చేతిని పట్టుకొని ఈ కొలనులో మునిగి శపథం చేయమని కట్టడిచేశాడు. తిరు నీలకంఠుడు తనకు తన భార్యతోగల శపథాన్ని వివరించి చెప్పి ఆమెతో కలసి కొలనులో మునగడం సాధ్యం కాదని చెప్పాడు. శివయోగి ఆ మాటలకు కోపావేశుడై తిల్లైలోని బ్రాహ్మణులతో ఫిర్యాదు చేశాడు. వాళ్లు తిరు నీలకంఠుని పిలిచి "ఈ యోగి చెప్పిన విధంగా నీవు నీ భార్యతో కలిసి ఈ కొలనులో మునగడం న్యాయమే" అని తీర్పిచ్చారు. వారు చెప్పిన ప్రకారం భార్యాభర్త లిరువురూ తమ శపథానికి భంగం రాకుండా ఒక కర్రను చెరొకవైపు పట్టుకొని కొలనులో మునిగారు. మునిగి లేచిన భార్యభర్త లిరువురూ తమ ముదిమిని పోగొట్టుకొని యౌవనవంతులై విరాజిల్లారు. శివగామీ సుందరీ సమేతుడై పరమేశ్వరుడు వారికి దర్శనమిచ్చి "మీరిరువురూ మా సన్నిధిలో నిత్య యౌవనంతో శాశ్వతంగా ఉండగలరు" అని దంపతులిరువురినీ ఆశీర్వదించాడు.

## 2. ఇయర్ పగై నాయనారు

**పూ**ంబుహార్ నగరంలో ఇయర్ పగై నాయనారు అనే పేరుగల వర్తకుడు నివసిస్తూ ఉండేవాడు. అతడు గొప్ప శివభక్తుడు. శివభక్తులు ఏది అడిగినా లేదనకుండా ఇచ్చే దాన స్వభావి. ఆ విధంగా భక్తులు అడిగినది లేదనకుండా ఇవ్వడం లోక స్వభావానికి విరుద్ధం కాబట్టి అందరూ అతనిని ఇయర్ పగై (లోక ప్రవృత్తికి విరుద్ధమైన) నాయనారు అని పిలుస్తుండే



వారు. తన భక్తుని దాన గుణాన్ని అందరికీ తెలియజేయాలనే ఉద్దేశంతో శివుడు ఒక ధూర్త బ్రాహ్మణ వేషధారియై ఇయర్ పగై నాయనార్ ఇంటికి వచ్చాడు. నాయనార్ ఆ బ్రాహ్మణ శివభక్తుని భక్తి పూర్వకంగా సముచిత సత్కారాలతో గౌరవించాడు. తనముందు నిలబడిన ఇయర్ పగై నాయనారును చూసి వంచక బ్రాహ్మణుడు నీ భార్యను కావాలని కోరి నీ ఇంటికి వచ్చాను అని చెప్పగా నాయనారు ఏ మాత్రమూ కోపం చెందక తన భార్యను సంతోషంగా తాపసికి సమర్పించాడు. అప్పుడా బ్రాహ్మణుడు "నీ భార్యను నేను ఒంటరిగా పిలుచుకొని వెళ్తున్నపుడు నీ బంధువులు నాపై పగబట్టి నాకు అపకారం చేయవచ్చు. కాబట్టి నగరం పొలిమేరలు దాటేంతవరకు నీవు నాకు తోడుగా రావాలి" అని ఆజ్ఞాపించాడు. వెంటనే ఇయర్ పగై నాయనారు వాళ్ల వెనుకగా ఒకచేతిలో కరవాలము, మరొక చేతిలో డాలును ధరించి తనను ఎదిరించిన వాళ్లను కరవాలంతో నేలకూలుస్తానని ప్రతిజ్ఞ చేసి బయలుదేరాడు.

ఊహించిన విధంగానే నాయనారు బంధువులు ఆయుధాలతో ఆ ధూర్త బ్రాహ్మణుని చంపడానికి ఉద్యుక్తులయ్యారు. నాయనారు వాళ్లందరినీ తన కరవాలంతో నిర్దాక్షిణ్యంగా సంహరించాడు.

తన భార్యను వైదికోత్తమునికి సమర్పించి "స్వామీ! ఇక మీరు భయపడకుండా వెళ్లండి" అంటూ వాళ్లు సురక్షిత ప్రదేశానికి చేరుకున్న తరువాత తన అర్ధాంగిని శాశ్వతంగా వదిలిపెట్టి వెనుదిరిగి చూడక సంతోషంతో తన ఇంటికి బయలుదేరాడు. అన్యులు చేయడానికి అసాధ్యమైన కార్యాన్ని చేసినవాడునూ, శివభక్తుడునూ అయిన ఇయర్ పగై నాయనారును బ్రాహ్మణుడు ఎలుగెత్తి పిలిచాడు. ఆ శబ్దాన్ని విని "ఈ దాసుడు ఇదిగో వస్తున్నాడు. మీకు అపకారం తలపెట్టిన వారిని ఈ

కరవాలంతో ఖండిస్తాను" అని చెబుతూ ఇయర్ పగై నాయనారు బ్రాహ్మణుడున్న ప్రదేశానికి చేరుకున్నాడు. ఆ విధంగా పరిగెత్తుకుంటూ వచ్చిన ఇయర్ పగై నాయనారుకు బ్రాహ్మణుడు కనిపించలేదు. రత్నాభరణ భూషితురాలైన భార్య మాత్రం కనిపించింది. ఇంతలో శివగామవల్లీ సమేతుడై వృషభ వాహనం మీద కొలువు తీరిన నటరాజస్వామి అతని ముందు ప్రత్యక్షమయ్యాడు. నీవు నీ భార్య ఇరువురూ కైలాసానికి విచ్చేయండి" అని వారిని తన కరుణా కటాక్షాలచే అనుగ్రహించాడు. చనిపోయిన నాయనారు బంధువులను, కులపెద్దలను పునర్జీవితులను చేసి వాళ్లు కూడ శివలోక పదవిని అందుకొని సుఖ సంతోషాలను అనుభవించే వరాన్ని అనుగ్రహించాడు.

## 3. ఇళయాంగుడి మార నాయనారు

**ఇ**ళయాంగుడి అనే శైవక్షేత్రంలో మారన్ అనే పేరుతో ఒక శివభక్తుడు జన్మించాడు. అతడు తన ఇంటికి వచ్చిన శివభక్తులను సాదరంగా ఆహ్వానించి షడ్రసోపేత భోజనంతో వారిని సంతుష్టులను గావిస్తూ వచ్చాడు. మార నాయనారు పేదరికం వచ్చినపుడు కూడ భక్తులను సంతృప్తి పరచే దాన స్వభావి అని అందరికీ తెలియజేయడానికో అన్నట్లు పరమేశ్వరుడు అతన్ని నిరుపేదగా మార్చాడు. పేదరికంలోనూ అతడు శివభక్తులకు అతిథి సత్కారాలను కొనసాగిస్తూ వచ్చాడు. ఒకరోజు వర్షాకాలం రాత్రివేళలో అణచుకోలేని ఆకలిని ఎలాగో అణచుకొని మారనాయనారు, అతనిభార్య ఇరువురూ పడుకోనుండగా అతని భక్తిని పరీక్షించడానికై ఒక మునివరుని వేషంలో పరమేశ్వరుడు వచ్చాడు.

అతనికి ఏదైనా పెట్టాలనే ఉద్దేశంతో "ఈ శివభక్తునికి భోజనం పెట్టడానికి ఏదైనా మార్గముందా?" అని మార నాయనారు తన భార్యను



అడిగాడు. ఆమె తన భర్తను చూసి "ఇంట్లో ధాన్యపుగింజ ఒక్కటీ లేదు. ఇరుగుపొరుగువాళ్లు కూడ ఇచ్చేట్లుగా తోచలేదు. మీరు ఈరోజు పగలు పొలంలో విత్తిన సంబావరి గింజలను ఏరి తీసుకు వచ్చారంటే నేను ప్రయత్నించి అన్నం వండుతాను" అని చెప్పింది. భార్య ఈ మాటలను చెప్పగానే పెన్నిధి దొరికిన వాడివలె సంతోషించి మారనాయనారు తన పొలానికి బయలుదేరాడు. మెరుపులు నిండిన ఆకాశం నుండి వర్షం ధారలుగా కురుస్తోంది. అంతటా గాఢాంధకారం వ్యాపించి ఉంది. మారనాయనారు తన తలమీద ఒక తట్టను బోర్లించుకొని పొలం లోపలికి ప్రవేశించాడు. కాళ్లతో తడుముకుంటూ తన చేతులతో పొలంలో మొలకెత్తి నీటిలో తేలుతున్న వరి విత్తనాలను తట్టనిండుకూ ఎత్తుకొని ఇంటికి వచ్చాడు. మారన్ భార్య ఆ వరి విత్తనాలను నీళ్లలో బాగా కడిగింది. పొయ్యి అంటించడానికి కట్టెలు లేవని చెప్పగా నాయనారు తన ఇంటి పైకప్పులో ఎండిన పొడవాటి కర్రలను కత్తితో నరికి భార్యకు అందించాడు. ఆమె ఆ కట్టెలను పొయ్యిలో పెట్టి వరి విత్తనాలను పక్వంగా వేయించి వాటిని బియ్యంగా దంచి అన్నం వండింది. పొలంలో మొలకెత్తి ఉన్న ఆకుకూరలను కోసుకొని ఇంటికి వచ్చి భార్యకందించగా ఆమె దానిని కూరగా వండింది. తన ఇంటికి వచ్చిన అతిథి సత్తముని దగ్గరికి వెళ్లి ఆహారం స్వీకరించవలసిందిగా నాయనారు మునివరుని ప్రార్థించాడు. ఆ సమయంలో ఇళయాంగుడి మారనాయనారు దంపతులకు శివగామి వల్లీ సమేతుడైన పరమేశ్వరుడు ప్రత్యక్షమై "మీరు నా అనుగ్రహానికి పాత్రులయ్యారు. మీరిరువురూ శివలోక పదవిని అందుకొని సంతోషంగా ఉండగలరు" అంటూ వాళ్లను ఆశీర్వదించాడు.

# 4. మెయ్ పొరుళ్ నాయనారు

తిరుక్కోవలూరును రాజధానిగా చేసుకొని మెయ్‌పొరుళ్ నాయనారు చేదినాడును న్యాయవర్తనుడై పాలిస్తూ వచ్చాడు. శివాలయాలన్నింటిలోనూ రోజూ ఆరుకాలాల్లో పూజలు జరిగేలా కట్టడి చేశాడు.

అటువంటి మెయ్‌పొరుళ్ నాయనారును జయించి అతని రాజ్యాన్ని ఆక్రమించుకోవాలని ముత్తనాథుడనే శత్రురాజు చేదినాడుపై యుద్ధాన్ని ప్రకటించాడు. ఆ యుద్ధంలో ముత్తనాథుడు పరాజితుడై అవమానంతో పారిపోయాడు. ఈ విధంగా సర్వస్వమూ కోల్పోయిన ముత్తనాథుడు యుద్ధంలో మెయ్‌పొరుళ్ నాయనారును జయించడం అసాధ్యమని తెలుసుకొన్నాడు. నాయనారుకు శివ భక్తులపై గల ప్రీతిని తెలుసుకొని తాను ఒక శివ భక్తునివలె, మెయ్‌పొరుళ్ నాయనారును జయించాలనే ఆలోచనతో తిరుక్కోవలూరుకు వచ్చాడు. ముత్తనాథుడు మాయా తాపసి వేషంతో ఒక కరవాలాన్ని తాళపత్ర గ్రంథమున్న సంచిలో దాచుకొని నాయనారు భవనాన్ని సమీపించాడు. రాజుగారి పడక గదిముందున్న దత్తుడు అనే రక్షకభటుడు "ఇప్పుడు రాజుగారు నిద్రపోతున్నారు" అని చెప్పాడు. దానిని విన్న ముత్తనాథుడు "నేను రాజుగారికి జ్ఞానబోధ చేయడానికి వచ్చాను, నీ విక్కడే ఉండు" అని చెప్పి లోపలికి వెళ్లాడు. అక్కడ రాజుగారు నిద్ర పోతుండగా పక్కనే ఉన్న రాజుగారి భార్యను చూశాడు. నాయనారు భార్య మాయ తాపసిని చూసి తన భర్తను లేపగా రాజు మేలుకొని పరమేశ్వరుని భక్తుడితడు అంటూ లేచి ముత్తనాథునికి భక్తితో నమస్కరించాడు. ముత్తనాథుడు నాయనారుతో "ఈ భూమండలంలో మరెక్కడా లేనటువంటి ఒక శైవాగమశాస్త్రాన్ని మీకు చెప్పడానికి వచ్చాను. నీ భార్యను ఇక్కడినుండి వెళ్లమని చెప్పు. మనిద్దరం ఏకాంతంగా ఒకచోట



ఆసీనులం కావాలి" అని చెప్పాడు. నాయనారు తన భార్యను అంతః పురానికి వెళ్లమని ఆజ్ఞాపించి, తాను ప్రాంజలియై నేలమీద కూర్చొని ఇక శైవాగమ శాస్త్రాన్ని పఠించండి" అని ప్రార్థించాడు. ముత్తనాథుడు తాళపత్ర గ్రంథాన్ని విప్పే వాడిలాగ నటిస్తూ మెయ్‌పొరుళ్ నాయనారు తనకు నమస్కరిస్తున్న సమయంలో కరవాలాన్ని తీసుకొని నాయనారు శిరసును ఖండించాడు. ఆ సమయంలో రాజుగారి అంగ రక్షకుడైన దత్తుడు పడకగది లోనికి ప్రవేశించి తన కరవాలంతో ముత్తనాథుని ఎదుర్కొన్నాడు. అప్పుడు నాయనారు తన శరీరమంతా రక్తధారలు స్రవిస్తుండగా నేలకు వాలుతూ "దత్తుడా! పరమేశ్వరుని భక్తుడైన ఇతడు వెళ్లేటప్పుడు ఇతనిని ఎవరూ నిరోధించకుండా నీవు వీరిని జాగ్రత్తగా నగరం పొలిమేరల వరకు తీసుకు వెళ్లి వదలిపెట్టు" అని ఆజ్ఞాపించాడు. తన చేతిలో పొడవాటి కరవాలాన్ని ధరించిన దత్తుడు తాపసిని వెంట బెట్టుకొని తిరుక్కోవలూరు నగరం పొలిమేరలకు చేరుకొని అక్కడ శత్రురాజైన ముత్తనాథుని వదలిపెట్టి అంతఃపురానికి వచ్చాడు. శివభక్తునికి ఎలాంటి అపకారం రానీయక సురక్షిత ప్రాంతంలో వదిలాడన్న వార్తను వినాలనే ఆకాంక్షతో కొట్టుమిట్టాడుతున్న తన ప్రాణాలను పోనీయకుండా ఓర్చుకొని పడి ఉన్న మెయ్‌పొరుళ్ నాయనారు దగ్గరికి వెళ్లి దత్తుడు "ముత్తనాథునికి ఎలాంటి అపకారం లేకుండా పంపించాను" అని చెప్పాడు. మెయ్ పొరుళ్ నాయనారు సంతోషించి పరమేశ్వరునికి భక్తితో నమస్కరించారు.

తనను హృదయంలో నిలపుకొని ధ్యానిస్తున్న మెయ్‌పొరుళ్ నాయనారుకు శివగామవల్లీ సమేతుడై పరమేశ్వరుడు దర్శనమిచ్చాడు. దేవతలకు కూడ చేరరానిదైన తన తిరు చరణాల సన్నిధిలో తనను సదాసేవిస్తూ ఉండేలాగ నాయనారును అనుగ్రహించాడు.

# 5. విరన్మిండ నాయనారు

**తి**రుచెంగున్రూరు అనే గ్రామం ఒకటి ఉంది. వేలాళర్ కులాన్ని ప్రకాశింపజేయడానికో అన్నట్లు విరన్మిండ నాయనారు ఆ గ్రామంలో అవతరించాడు. బాల్యం మొదలుకొని అతడు శివ భక్తులపై అంతులేని ప్రేమాభిమానాలను కలిగి ఉండేవాడు. ఆయా పుణ్యక్షేత్రాలలోని శివాలయాలను దర్శించి నాయనారు శివుని భక్తితో సమర్చిస్తూ వచ్చాడు.

ఒక పర్యాయం తిరువారూరికి వెళ్లి వన్మీకనాథునికి విరన్మిండ నాయనారు ప్రణమిల్లాడు. ఆ సమయంలో సుందరమూర్తి నాయనారు తిరువారూరు దేవాలయంలో అడుగుపెట్టారు. అక్కడి దేవాసిరియ మండపంలో శివభక్తులు గుమికూడి ఉన్నారు. వారికి మొదట నమస్కరించక ఒక పక్కగా వైదొలగి పోతున్న సుందరులనుచూచి విరన్మిండ నాయనారు ఇతడు మాకు జన్మ విరోధి" అని ప్రకటించాడు. "ఈ విధంగా శివ భక్తులను అవమానించడం వలన ఇతడు శివునికి కూడ విరోధిగా పరిగణింపబడుతాడు" అని ఎలుగెత్తి పలికాడు. ఈ మాటలను సుందరులు విన్నారు. వెంటనే తన తప్పును తెలుసుకొన్నారు. శివభక్తుల మాహాత్మ్యాన్ని 'తిరు త్తొండ తొగై' అనే గ్రంథంగా రచించాడు. అప్పుడు పరమేశ్వరుడు సంతోషించి "మేము ఎల్లప్పుడూ భక్తుల హృదయాలను ఆవాసంగా చేసుకొని ఉంటాము" అని అందరూ వినేలా ఎలుగెత్తి ప్రకటించాడు. ఈ విధంగా పవిత్రమైన తిరు తొండ తొగై అనే గ్రంథాన్ని సుందరులచే రచింపజేయడానికి కారణమైన విరన్మిండ నాయనారు శివభక్తులకు సదా సేవచేస్తూ శివగణాలకు నాయకుడై పరమేశ్వరుని తిరు చరణాల సన్నిధిని సేవచేసే భాగ్యాన్ని పొందిన వాడయ్యాడు.



# 6. అమర్నీతి నాయనారు

**'ప**ళైయారై' అనే నగరంలో ఒక వైశ్య కుటుంబంలో అమర్నీతి నాయనారు అనే శివభక్తుడు జన్మించాడు. ఒక పర్యాయం పరమేశ్వరుడు కౌపీన మహిమను అమర్నీతి నాయనారుకు తెలియజేసి అతన్ని తన కరుణా కటాక్షాలచే అనుగ్రహించాలనే తలంపుతో బ్రాహ్మణ బ్రహ్మచారి వేషాన్ని ధరించి వచ్చాడు. బ్రహ్మచారి వేషధారిని చూడగానే అమర్నీతి నాయనారు వేగంగా వచ్చి బ్రహ్మచారికి నమస్కరించి అతన్ని తన మఠానికి ఆహ్వానించాడు. "మీరు ఈ రోజు మా మఠంలో భోజనం ఆరగించి మమ్మల్ని ధన్యులను చేయాలి" అని నాయనారు ఆ మాయాబ్రహ్మచారిని అర్థించాడు. బ్రహ్మచారి దానికి అంగీకరించి "నేను కావేరినదిలో స్నానం చేసివస్తాను. ఈ కౌపీనాన్ని మీరు భద్రంగా దాచి ఉంచి నేను స్నానం చేసి తిరిగి వచ్చినపుడు మీరు నాకు ఇవ్వండి" అని చెప్పి కౌపీనాన్ని నాయనారు చేతుల్లో పెట్టి స్నానానికి బయలుదేరాడు. నాయనారు ఆ కౌపీనాన్ని తీసుకొని దానిని ఒక భద్రమైన స్థలంలో జాగ్రత్తగా ఉంచాడు. మాయా బ్రాహ్మణుడు ఆ కౌపీనాన్ని మాయ మయ్యేటట్లుగా చేశాడు. కొంత సమయమైన తరువాత కావేరినదిలో స్నానంచేసి మాయా బ్రాహ్మణుడు మఠానికి తిరిగి వచ్చాడు. "నదిలో స్నానం చేయడం వలన నా శరీరం తడిసిపోయింది నేను నీ దగ్గర ఇచ్చిన కౌపీనాన్ని తెచ్చి ఇవ్వు" అని బ్రాహ్మణుడు నాయనారుతో చెప్పాడు. నాయనారు వేగంగా లోపలికి వెళ్లి తాను పూర్వం కౌపీనాన్ని భద్రపరిచిన స్థలంలో చూడగా అది కనిపించలేదు. ఎంత వెతికినా ఆ కౌపీనం వారికి దొరకలేదు. అప్పుడు నాయనారు బ్రాహ్మణుని దగ్గరికి వెళ్లి "స్వామీ! మీరు నాదగ్గర ఇచ్చి వెళ్లిన కౌపీనం నేను పెట్టిన చోటులో కనిపించలేదు. నేను వేరొక మంచి కౌపీనం తీసుకువచ్చాను. దానికి

బదులుగా మీరు దీనిని ధరించి నా తప్పులను క్షమించండి" అని ప్రార్థించాడు. బ్రాహ్మణుడు కోపంతో "నేను నీ దగ్గర ఇచ్చి వెళ్లిన కౌపీనాన్ని అపహరించి దానికి బదులుగా వేరొక కౌపీనాన్ని తీసుకోండి అని చెప్పడం న్యాయమా?" అంటూ కోపంతో ఎగసి పడ్డాడు. నాయనారు "స్వామీ! ఈ దాసుడు చేసిన అపరాధాన్ని క్షమించండి. ఈ కౌపీనానికి బదులుగా మీకు ఇష్టమైన పట్టువస్త్రాలను, మాణిక్యాలను తీసుకొని నన్ను అనుగ్రహించండి" అని ఆ బ్రాహ్మణుని తిరుచరణాలపై భక్తితో వాలిపోయాడు. బ్రాహ్మణుడు కోపాన్ని ఉపశమించుకొన్న వాడివలె "బంగారం, మాణిక్యాలు, నూతన వస్త్రాలు నాకెందుకు? కౌపీనం బరువుకు సమానంగా ఒక కౌపీనం నాకు ఇస్తే చాలు" అన్నాడు. నాయనారు త్రాసును తీసుకురాగా బ్రాహ్మణుడు తన కౌపీనాన్ని ఒక తట్టలో ఉంచాడు. నాయనారు శివభక్తులకు ఇవ్వడం కోసం తన దగ్గర ఉన్న కౌపీనాలన్నింటిని తట్టలో పెట్టినప్పటికీ అవి బ్రాహ్మణుని కౌపీనానికి సమానం కాలేక పోయాయి. నాయనారు తన దగ్గరున్న బంగారం, వెండి, అపూర్వములైన రత్నాలు, ధన ధాన్యరాశులు త్రాసుతట్టలో పెట్టినప్పటికీ ఆ త్రాసుపైనే నిలిచింది. అప్పుడు నాయనారు "స్వామీ! నా సిరి సంపదలన్నింటినీ ఏ ఒక్కటీ వదలక త్రాసులో పెట్టాను. ఈ దాసుడు, దాసుని భార్య, కుమారుడు అర్హులుగా భావిస్తే ఈ త్రాసులో ఎక్కడానికి అనుమతించండి" అని బ్రాహ్మణుని ప్రార్థించగా బ్రాహ్మణుడు దానికి సమ్మతించాడు. భగవంతుని విభూతికి నిజమైన దాస్యభక్తిని గల మేము భక్తిలోను, ప్రేమలోను కళంకం ఏదీ చేయనట్లైతే మేము ఎక్కిన వెంటనే ఈ త్రాసు సరిసమానంగా తూగాలి" అని తిరునల్లూరులో నెలకొని ఉన్న కళ్యాణ సుందరేశ్వర స్వామికి ప్రణమిల్లి పంచాక్షరీ మంత్రాన్ని పఠిస్తూ అందరితో కలసి త్రాసు ఎక్కాడు. ఆ బ్రాహ్మణుడు ధరించిన కౌపీనము,



అమర్నీతి నాయనారు శివునికి భక్తితో చేసిన దాస్యం-రెండూ సమానంగా ఉండడంవల్ల రెండూ తట్టలూ సరిసమానంగా తూగాయి.

ప్రజలందరూ అద్భుతాశ్చర్యాలతో నాయనారుకు నమస్కరించారు. కళ్యాణసుందరేశ్వరస్వామి జగన్మాత అయిన కళ్యాణసుందరితో కలసి ఆకాశంలో ప్రత్యక్షమై అమర్నీతి నాయనారుకు దర్శన భాగ్యంతో పాటు అక్షీణమైన శివలోక పదవిని అనుగ్రహించాడు.

## 7. ఎరిబత్త నాయనారు

కరువూరు నగరంలో ఎరిబత్తనాయనారు అనే భక్తుడు శివభక్తులకు సదా సేవ చేయడమే జీవితాశయంగా కలిగి జీవనం సాగిస్తూ వచ్చాడు.

కరువూరులోని ఆనిలై దేవాలయంలో వెలసిన పరమేశ్వరుని మీది అచంచల భక్తిప్రపత్తులను కలిగిన శివగామి యాండార్ అనే మునీశ్వరుడు రోజూ ఉదయాత్పూర్వమేలేని పుష్పాలను సేకరించి వాటిని మాలలుగా కట్టి స్వామికి అలంకరించి ఆనందిస్తూ ఉండేవాడు.

ఒకరోజు శివగామి యాండార్ పూలను కోసుకొని వస్తుండగా రాజుగారి పట్టపుటేనుగు కపోలంలో మదజలం స్రవిస్తుండగా వీధిలో నున్నవారు భయకంపితులై పరుగులు పెట్టగా పెద్దకొండవలె భీకరంగా వచ్చింది. ఆ ఏనుగు మావటీ వారికి లొంగక తనముందు వెళ్తున్న శివగామి యాండార్‌ను వెన్నంటి వెళ్లి ఆయన స్వామి కోసం తీసుకువెళ్తున్న పూలబుట్టను తొండంతో లాగి కింద పడవేసింది. శివగామి యాండార్ కిందపడి చేతులతో నేలను మోదుతూ "పరమేశ్వరా! నీ కోసం తీసుకువస్తున్న ఈ పుష్పాలు నేల పాలయ్యాయి కదా! నేనేం చేయగలను?" అని గట్టిగా రోదించాడు.

ఈ విధంగా శివగామి యాండార్ రోదిస్తుండగా ఎరిబత్తనాయనారు దానిని విన్నాడు. "శివభక్తులకు ఏనుగు కారణంగా ఎంతటి కష్టం సంభవించింది. ఎవరువచ్చి అడ్డగించినప్పటికీ నేను దానిని నరికి సంహరిస్తాను" అని భీకరంగా గర్జిస్తూ ఎరిబత్తనాయనారు గండ్రగొడ్డలి చేత ధరించి వేగంగా వెళ్లి ఆ ఏనుగు పైకి లంఘించాడు. పొడవైన దాని తొండం నేలమీద పడేలా దానిని రెండుగా నరికాడు. ఆ ఏనుగు నల్లని పర్వతం వలె నేలమీద వాలిపోయింది. ఏనుగు మీదున్న మావటీ వారు వెన్నంటి వస్తున్న సైనికులు తనను ఎదుర్కోగా ఎరిబత్త నాయనారు వారిని కూడ సంహరించాడు. మిగిలిన సైనికులు పరిగెత్తుకుంటూ వెళ్లి రాజుగారికి ఈ సంగతిని విన్నవించారు. రాజుగారు చతురంగ బలాలను సమీకరించుకొని ఏనుగు చనిపోయిపడి వున్న ప్రదేశానికి చేరుకున్నారు. అక్కడ గండ్రగొడ్డలిని ధరించి తన ముందు నిలబడి ఉన్న శివభక్తుడైన ఎరిబత్త నాయనారును చూశాడు. పరమేశ్వరుని భక్తుడైన ఇతడు ఈ ఏనుగును ఏ తప్పూ లేకుండా చంపి ఉండడు" అని మనసులో భావించి సైనికులందరినీ అక్కడే ఉండమని చెప్పి తాను ఒంటరిగా ఎరిబత్త నాయనారు దగ్గరికి వెళ్లి నమస్కరించాడు. చోళ చక్రవర్తిని చూసి శివభక్తుడైన ఎరిబత్త నాయనారు "చోళ రాజా! శివగామి యాండార్ అనే భక్తుడు పరమేశ్వరునికి సమర్పించడానికి తీసుకువెళ్తున్న పుష్పహారాలను ఈ ఏనుగు లాగి కింద పడవేయడం వలన నేను దానిని నేలమీద కూలేలా ఖండించివేశాను. ఏనుగు ఈ విధంగా తప్పుచేస్తుండగా మావటీవారు, కావలివారు దానిని నివారించని కారణంచే చంపబడ్డారు. ఇదే ఇక్కడ జరిగిన విషయం" అని చెప్పాడు. "శివభక్తులకు ఈ ఏనుగు చేసిన అపకారానికి ఇక్కడ మావటీ వారిని చేర్చి ఏనుగును చంపడంతో సరిపోదు.



ఈ దుండగం జరగడానికి కారణమైన నన్ను కూడ చంపాలి" అంటూ రాజు తన నడుముకు వేలాడుతున్న కరవాలాన్ని చేతితో పెకలించి దానిని ఎరిబత్త నాయనారు చేతికి ఇచ్చాడు. ప్రేమైకమూర్తి అయిన ఈ రాజుగారిని కూడా దుండగీడు అని నేను భావించాను. నా శరీరాన్ని కత్తితో పొడుచుకోవడమే ఈ దుష్కార్యానికి పరిహారమవుతుంది" అని భావించి ఎరిబత్త నాయనారు రాజుగారు ఇచ్చిన ఖడ్గంతో తన కంఠాన్ని ఉత్తరించుకోబోయాడు. ఆ సమయంలో ఆకాశంలో అందరికీ వినిపించేలా ఒక పెద్ద శబ్దం వినిపించింది. "మీ భక్తిని ప్రపంచానికి తెలియజేయడానికై పరమేశ్వరుని వలన ఈ సంఘటన జరిగింది" అనే మాటలు వినిపించాయి. చనిపోయిన మావటివారితో, సైనికులతో సహా ఏనుగు కూడ నిద్రనుండి లేచినట్లు అప్పుడే పైకి లేచింది. దేవతలు ఇరువురిమీద చల్లని పుష్పాలను కురిపించారు. ఈ అద్భుతాన్ని చూసి ఆనందించిన శివగామి యాండార్ అక్కడికి వచ్చి నిలబడ్డాడు.

ఎరిబత్త నాయనారు సదాచార వర్తనుడై జీవనం సాగించి ఆఖరున పవిత్రమైన కైలాస పర్వతంలో శివ గణాలకు నాయకుడయ్యే భాగ్యాన్ని పొందాడు.

## 8. ఏనాది నాథ నాయనారు

ఏనల్లూరు అనే అందమైన గ్రామంలో ఏనాది నాథుడు జన్మించాడు. ఇతడు గొప్ప శివభక్తుడు. ఖడ్గవిద్య శిక్షణలో నైపుణ్యాన్ని సంపాదించి ఆ వృత్తిలో తనకు తిరుగులేని నాయకుడుగా ప్రసిద్ధిచెందాడు. ఆ కాలంలో అతి శూరుడనే పేరుగల వాడు ఖడ్గవిద్యను నేర్పించే వృత్తిని అనుసరిస్తూ ఆ వృత్తిలో ఈ భూ ప్రపంచంలో తనకు మించినవారు ఎవరూ లేరని విర్రవీగుతూ ఉండేవాడు.

కొంత కాలానికి ఖడ్గ శిక్షణ ఇచ్చే అతిశూరుని ఆదాయం రోజురోజుకు తగ్గిపోతూ వచ్చింది. ఏనాది నాథుని ఆదాయం మాత్రం పెరుగుతూ వచ్చింది. దీనిని చూసి అతిశూరుడు ఏనాదినాథునిపై తీరని పగను పెంచుకున్నాడు. బంధుమిత్రులతో ఏనాదినాథుని ఇంటిముందుకు వెళ్లి యుద్ధానికి రమ్మని ఆహ్వానించాడు. ఏనాదినాథుడు కూడ ఒక చేతిలో కరవాలాన్ని, మరొక చేతిలో డాలును పట్టుకొని యుద్ధం చేయడానికి బయలుదేరాడు. "ఈ యుద్ధంలో ఎవరైతే విజయాన్ని సాధిస్తారో వారు మాత్రమే ఖడ్గవిద్యా శిక్షణ వృత్తి హక్కును పొందగలరు" అని ఇరువురూ ఒడంబడిక చేసుకున్నారు. ఇరువైపులకు చెందిన వీరులు ఎదురెదురుగా నిలిచి కత్తులను, బల్లెములను ధరించి భయంకరంగా యుద్ధం చేశారు. అతిశూరుడు ఏనాది నాథుని చేతిలో ఓడిపోయి వెన్నుచూపి యుద్ధరంగం నుండి పారిపోయాడు. ఓడిపోయిన అవమానాన్ని తలచుకొని అతడు నిద్రపోలేక పోయాడు. వంచనామార్గంతో ఏనాది నాథుని జయించాలని ఒక కుతంత్రాన్ని పన్నుతాడు.

"మనం ఇరువురం ఏకాంతంగా ద్వంద్వ యుద్ధం చేద్దాం. నీవు యుద్ధానికి రావలసింది" అని అతిశూరుడు ఏనాదినాథుని దగ్గరికి తన మనిషిని ఒకరిని పంపించాడు. ఏనాదినాథుడు దీనికి సమ్మతించాడు. నొసట విభూతి ధరించిన వారికి ఏనాదినాథుడు ఎలాంటి కీడు చేయడని తెలుసుకొన్న వాడై అంతకుపూర్వం విభూతి పూసుకోవడం తెలియని వాడైనప్పటికీ అతిశూరుడు తన ఫాలభాగమంతా విభూతిని పూసుకొన్నాడు. అది కనిపించకుండా తన చేతిడాలుతో మరుగు పరిచి ఏనాదినాథుని ముందుకు వెళ్లాడు. ఏనాదినాథుడు అతిశూరుని చంపడానికి కత్తి దూసినపుడు అతిశూరుడు తాను మరుగు పరుచుకొన్న కెడయాన్ని పక్కకు తీశాడు. అప్పుడు అతిశూరుని ఫాల భాగమందున్న విభూతిని ఏనాది



నాథుడు చూశాడు. "అయ్యో! నేనెంతటి పాపం చేశాను. ఇతడు శివభక్తుడని తెలియక ఇతనితో యుద్ధం చేశాను" అని తన చేతిలోని ఖడ్గాన్ని జారవిడవాలని అనుకున్నాడు. కాని ఆయుధాలు లేనివాడిని చంపాడనే అపకీర్తి ఇతనికి రాకుండా ఉండాలని భావించి చేతిలో పట్టుకొన్న వాడిలాగ కనిపిస్తూ ఎదురుగా నిలిచాడు. అతిశూరుడు ఆ సమయంలో తన ఖడ్గంచే ఏనాదినాథుని సంహరించాడు. ఏనాదినాథుని భక్తి తత్పరతకు పరవశుడైన పరమేశ్వరుడు ప్రత్యక్షమై ఎదురుగా నిలిచాడు. మహాభక్తుడైన ఏనాదినాథుని తనను ఎన్నడూ ఎడబాయకుండా శివగణాలలో ఒకడుగా తన సన్నిధిలోనే ఉండమని అనుగ్రహించి అంతర్ధానమయ్యాడు.

## 9. కణ్ణప్ప నాయనారు

'**పొ**త్తపినాడు' లో 'ఉడుప్పూరు' అనే పేరుతో ఒక ప్రాచీన గ్రామం ఉంది. ఆ గ్రామంలో నివసించేవారందరూ గిరిజనులే. వారికి రాజుగా 'నాగడు' అనే పేరుతో ఒక వేటగాడు ఉండేవాడు. అతనికి జీవన సహచరిగా దత్తై అనే యువతి తోడైంది. మురుగదేవుని అనుగ్రహం వలన వారికి ఒక కుమారుడు జన్మించాడు. ఆ పిల్లవాడికి తిన్నడు అనే పేరుపెట్టి అల్లారు ముద్దుగా పెంచారు. కొన్ని సంవత్సరాలు గడిచిన తరువాత విలువిద్య నేర్చుకునే పరువాన్ని తిన్నడు సమీపించాడు. కొద్దికాలంలోనే విలువిద్యను, ఇతర యుద్ధకళలకు సంబంధించిన విద్యనూ పూర్తిగా నేర్చుకుని తిన్నడు వాటిలో ప్రావీణ్యతను సంపాదించాడు.

ఆ సమయంలో అక్కడున్న కొండలలో పంటలు పండించే ప్రాంతాలలో పందులు, పులులు, ఎలుగుబంట్లు, అడవి పశువులు మొదలైన క్రూర మృగాలు వచ్చి పంటలకు ప్రజలకు హాని కలిగించాయి. ప్రజలందరూ తమరాజైన 'నాగడు' దగ్గరకు వచ్చి మొరపెట్టుకున్నారు. నాగడు తన

కుమారుడైన తిన్నని ఆహ్వానించి “ఈ బోయకులాన్ని సంరక్షించే బాధ్యతను స్వీకరించి క్రూర మృగాల బారినుండి వీరిని కాపాడు” అని చెప్పగా తిన్నడు విల్లంబులను ధరించి వేటగాళ్లతో అడవిలోపలికి ప్రవేశించాడు, అడవి పందులు, జింకలు, ఎలుగుబంట్లు, దుప్పులు, అడవి దున్నలు, ఏనుగులు, క్రూరమైన పులులు మొదలైన వాటిపై బాణాలను ప్రయోగించి వాటిని నేల కూల్చాడు. ఆ సమయంలో తిన్ననికి వేగంగా పరిగెత్తుతూ ఉండే ఒక పంది కనిపించింది. తిన్నడు దానిని వదలకుండా వెన్నంటి వెళ్లి తన కరవాలంతో ఆ పంది శరీరం రెండు తునకలయ్యేలా ఖండించాడు. కొంతసేపు విశ్రామం తీసుకున్న తరువాత తిన్నడు పక్కనే ప్రవహిస్తున్న స్వర్ణముఖి(పొన్ ముగలి) నదిలో స్నానంచేసి పక్కనున్న కొండ సమీపించాడు. పూర్వజన్మలో చేసిన తపోఫలం కారణంగా తిన్నడు శ్రీకాళహస్తి కొండ మీద లింగాకారంతో నెలకొని ఉన్న పరమేశ్వరుని చూశాడు. ప్రేమ ఉప్పొంగగా పరిగెత్తుకుంటూ వెళ్లి ఆ పరమేశ్వరుని ఆలింగనం చేసుకున్నాడు. “స్వామీ! క్రూర మృగాలు సంచరించే ఈ అడవిలో తోడెవరూ లేక నీవిలా ఒంటరిగా కొండమీద ఉండడం తగునా! నీవు తిని ఎంతకాలమైందో కదా!” అని హృదయావేదనతో పలికాడు. వెంటనే తాను చంపిన పంది మాంసాన్ని ఎర్రటి నిప్పులో పక్వంగా కాల్చి వాటి రుచిని ముందుగా తాను తెలుసుకోవడానికై కొంత నోటిలో వేసుకొని రుచిచూసి వాటిని ఒక దొన్నెలో పెట్టుకొన్నాడు. పరమేశ్వరునికి స్నానం చేయించాలనే ఉద్దేశంతో తన నోటిలో స్వర్ణముఖీ నదిలోని నీటిని తీసుకున్నాడు. అక్కడి పుష్పాలను కోసి తలమీద పెట్టుకున్నాడు. “నా దేవుడు ఆకలితో సొమ్మసిల్లి ఉంటాడు” అంటూ వేగంగా వచ్చి తన నోటిలోని నీటిని పరమేశ్వరుని శిరసుపై వదిలాడు. తలమీద ఉన్న పుష్పాలను దేవుని శిరసుపై అలంకరించాడు. ఆకులదొన్నెలోని మాంసాన్ని శివుని ముందు పెట్టి “స్వామీ! మేలైన మాంసం



తీసుకు వచ్చాను. మీరు దీనిని భుజించండి” అని చెప్పి మృదువైన మాటలు మాట్లాడుతూ పరమేశ్వరునికి తిన్నడు మాంసాన్ని తినిపించాడు. తనతో వచ్చిన వేటగాళ్లు ఇంటికి పోదామని చెప్పినప్పటికీ వాళ్ల మాటలను తిరస్కరించి తిన్నడు ఆ రాత్రి అక్కడే ఉండిపోయాడు. సూర్యోదయానికి ముందుగానే లేచి శివునికి మంచి మాంసం తెచ్చి ఇవ్వాలనే ఉద్దేశంతో వేటకు వెళ్లాడు.

శ్రీకాళహస్తీశ్వరునికి సూర్యోదయాత్పూర్వమే నియమం తప్పక పూజాదికాలు నిర్వర్తించే ఒక మునీశ్వరుడు అక్కడికి వచ్చాడు. శివుని సన్నిధిలోపడి ఉన్న మాంసపు ముక్కలను, ఎముకలను చూసి “అయ్యో! అసహ్యమైన ఈ పదార్థాలను ఇక్కడ ఎవరు పెట్టారో కదా! అని బాధపడి ఆ ప్రదేశాన్ని శుభ్రంగా నీటితో కడిగాడు. స్వర్ణముఖి నది పవిత్రజలాలతో, తాను తీసుకు వచ్చిన వస్తువులతో అభిషేకం మొదలైన పూజలు చేశాడు. తరువాత తాను తపస్సు చేసుకుంటున్న ప్రాంతానికి వెళ్లిపోయాడు. మునీశ్వరుడు వెళ్లిన తరువాత తిన్నడు దొన్నెలో తేనె కలిపిన మాంసాన్ని పెట్టుకొని పుష్పాలను, అభిషేకార్థమై నీటిని తీసుకొని వేగంగా వచ్చాడు. అక్కడ మునీశ్వరుడు చేసిన పూజాద్రవ్యాలను తొలగించి తాను తెచ్చిన మాంసాహారాన్ని స్వామికి తినిపించాడు.

ఆ రోజు రాత్రి మునీశ్వరుని కలలో శివుడు కనిపించి “నీకు ఆ వేటగాని భక్తిని చూపిస్తాను” అని చెప్పాడు. మునీశ్వరుడు యథాప్రకారం సూర్యోదయాత్పూర్వమే స్వామికి పూజలు సలిపి వెనుకభాగంలో ఎవరికీ కనిపించకుండా దాక్కున్నాడు. తిన్నడు జింకను వేటాడి చంపి దాని మాంసాన్ని తీసుకొని వేగంగా స్వామి సన్నిధికి వచ్చాడు. మునీశ్వరునికి తిన్నని భక్తి విశేషాలు తెలియజేయడానికై పరమేశ్వరుడు తన నేత్రములలో

ఒకదాని నుండి రక్తం కారేటట్లు చేశాడు. దానిని చూసి తిన్నడు తీవ్ర సంతాపంతో మూర్ఛిల్లాడు. అరణ్యమంతా గాలించి మూలికలను సేకరించి వాటి రసాన్ని కంటికి పూశాడు. అయినప్పటికీ రక్తం కారడం మానలేదు. 'దీనికి పరిహారంగా ఏంచేయాలి' అని ఆలోచించిన తిన్నడు ఒకరి అవయంలో ఏర్పడిన వ్యాధిని పోగొట్టడానికి దానిని పోలిన అవయవాన్ని ఇవ్వాలి అనే పెద్దల వాక్యాన్ని గుర్తుకు తెచ్చుకున్నాడు. స్వామి సన్నిధి ముందు నిలబడి తన కంటిని అమ్ముతో పెకలించి స్వామి కంటిలో పెట్టాడు. వెంటనే స్వామి కంటినుండి రక్తం కారడం ఆగిపోయింది. తిన్నడు సంతోషంతో గంతులు వేశాడు. తిన్నని శివభక్తిని లోకానికి తెలియజేయాలనే తలంపుతో శ్రీకాళహస్తీశ్వరుడు తన మరొక కంటినుండి కూడ రక్తం కారేలా చేశాడు. దానిని చూడగానే తిన్నడు పరమేశ్వరుని ఎడమకన్నులో తన ఎడమకన్నును పెట్టడానికి ఆ కన్ను ఉన్నచోటు మారకుండా ఉండడానికై తన ఎడమకాలిని స్వామి కన్ను ఉన్నచోట ఊన్చి బాణంతో తన కన్నును పెకలించబోయాడు. తన కంటిని పెకలించడానికి ఎత్తిన కన్నప్పచేతిని శ్రీకాళహస్తీశ్వరుడు తన చేతితో పట్టుకొని "అసమానమైన భక్తిని గలవాడా! నీవు నా కుడివైపున నిత్యమూ ఉండాలి" అని ఆశీర్వదించాడు.

## 10. గుంగులియ క్కలయ నాయనారు

**చో**ళదేశంలో 'తిరుక్కడవూరు' అనే గ్రామం ఒకటి ఉంది. ఆ గ్రామంలో కలయనార్ అనే ఒక వైదిక బ్రాహ్మణుడు నివసిస్తున్నాడు. అతడు పరమేశ్వరునికి నిత్యమూ పరిమళ భరితమైన గుగ్గులిని (గుంగులి) ధూపం వేసే పనిలో నిమగ్నమై ఉండడం వలన ప్రజలందరూ ఇతనిని గుంగులియ కలయనారు అని పిలవడం ప్రారంభించారు. శివుడు ఒక పర్యాయం కలయనారు భక్తిని పరీక్షించదలచుకొన్నాడు. పరమేశ్వరుని లీలా విలాసాల



కారణంగా అతనికి దారిద్ర్యం సంక్రమించింది. అయినప్పటికీ కలయనారు ధూపం వేసే పవిత్ర కైంకర్యాన్ని కొనసాగిస్తూ వచ్చాడు. కొంత కాలానికి అతడు తన సంపదలన్నీ కోల్పోయాడు. బంధువులతో, భార్యాబిడ్డలతో ఆహారంలేక ఆకలితో బాధపడవలసి వచ్చింది ఇంట్లో తినడానికి ఏ పదార్థమూ లేదు. రెండు రోజులు వరుసగా ఆహారం లేకుండా సొమ్మసిల్లి పోయిన పిల్లలను చూసి కలయనాయరు భార్య తన బంగారు మంగళసూత్రాన్ని తీసి భర్తచేతికి ఇచ్చి "దీనికి వడ్లు తీసుకురండి" అని కోరింది.

కలయనారు ఆ బంగారు తాళిబొట్టును తీసుకొని వడ్లు కొనడానికై బయలుదేరాడు. అప్పుడు అతని కెదురుగా ఒక వర్తకుడు గుగ్గిలపు మూటతో వచ్చాడు. కలయనారు ఆ వర్తకుని చూసి "నేను బంగారు ఇస్తాను. మీరు దానికి ఈ గుగ్గిలాన్ని ఇవ్వండి'' అని అడిగాడు. వర్తకుడు దానికి అంగీకరించగా కలయనారు తన భార్య బంగారు తాళిబొట్టును అతని చేతిలో పెట్టాడు. వర్తకుడు దానిని తీసుకొని గుగ్గులిమూట ఇచ్చాడు. కలయనారు ఆ మూటను తీసుకొని పరమేశ్వరుని దేవాలయానికి వేగంగా వెళ్లాడు. స్వామి భండారంలో ఆ గుగ్గులిమూటను భద్రపరచి పరమేశ్వరుని తిరుచరణాలను అర్చిస్తూ అక్కడే ఉండిపోయాడు. కలయనారు ఈ విధంగా దేవాలయంలో ఉండగా పరమేశ్వరుని కరుణాకటాక్షాలచే అతని గృహం ధనధాన్యాలతో, సువర్ణ రత్నాభరణాలతో, అపూర్వమైన సంపదలతో నిండిపోయింది. వడ్లకోసం కాచుకొని ఉన్న కలయనారు భార్యబిడ్డలు ఆకలితో సొమ్మసిల్లి నిద్రపోయారు. అప్పుడు తపోనిధి అయిన కలయనారు భార్య కలలో పరమేశ్వరుడు ప్రత్యక్షమై గృహమంతటా నిండి ఉన్న సంపదను తెలియజేశాడు. ఆమె నిద్రనుండి లేచి "పరమేశ్వరుడే మనకు దీనిని

అనుగ్రహించాడు'' అని రెండు చేతులూ మోడ్చి భగవంతునికి నమస్కరించింది. తరువాత తనభర్తకు, పిల్లలకు భోజనం తయారు చేయసాగింది. అక్కడ దేవాలయంలో ఉన్న కలయనారుకు స్వామి కలలో కనిపించి "నీవు ఆకలితో ఉన్నావు. ఇంటికి వెళ్లి నీ ఆకలిని తీర్చుకో" అని చెప్పాడు. పరమేశ్వరుని ఆజ్ఞను శిరసావహించి కలయనారు తన ఇల్లు చేరుకున్నాడు. ఇంటిలోపల ధనధాన్య రాశులు చూసి "ఇవన్నీ ఎలా వచ్చాయి" అని భార్యను ప్రశ్నించగా ఆమె "పరమేశ్వరుని అనుగ్రహంతో లభించింది" అని జవాబు చెప్పింది. గుంగులి కలయనారు పరమేశ్వరుని కరుణాకటాక్షాలను తలచుకొని చేతులను శిరసుమీద మోడ్చి స్తుతించాడు. యథాప్రకారం పరమేశ్వరునికి గుగ్గులిధూపాన్ని సమర్పించే కైంకర్యాన్ని చేస్తూ వచ్చాడు.

## 11. మానకంజార నాయనారు

**కం**జారు అనే గ్రామంలో మానకంజారుడు అనే భక్తుడు నివసిస్తూ ఉండేవాడు. వేలాల కులంలో జన్మించిన అతడు రాజుగారి సైన్యానికి దళపతిగా ఉండేవాడు. శివుని మీద అచంచలభక్తి విశ్వాసాలను కలిగిన మానకంజారుడు తన సంపదలన్నీ శివభక్తులకు చెందినవేనని భావించి వారు కోరకనే వారికి కావలసినవన్నీ ఇస్తుండేవాడు. పరమేశ్వరుని నియమనిష్ఠలతో పూజిస్తూ వచ్చిన అతనికి ఒక కుమార్తె జన్మించింది. అల్లారుముద్దుగా పెరిగిన ఆ అమ్మాయి కొంతకాలానికి యుక్తవయసుకు చేరుకుంది. మాన కంజారు తన కుమార్తెను ఎయర్ కోన్ కలిక్కామరుకు ఇచ్చి పెళ్లిచేయడానికి నిశ్చయించాడు.

కంజారు గ్రామం పెళ్లి సంబరాలతో కల కలలాడింది. ఎయిర్‌కోన్ నాయనారు, అతని బంధువులు మంగళవాయిద్యాలు మ్రోగుతుండగా



మానకంజారు పెళ్లి ఇంటికి బయలుదేరారు. వారు రావడానికి పూర్వమే ఒక మునివరుని వేషాన్ని ధరించి పరమేశ్వరుడు కంజారు ఇంటిలో అడుగుపెట్టాడు. కంజారు తన కుమార్తెను పిలిచి ఆ మునివరుని పాదాలకు నమస్కరింపజేశాడు. తన పాదాలకు నమస్కరించిన పెళ్లికుమార్తె తల వెంట్రుకలను మునీశ్వరుడు చూశాడు. కంజారుతో "మీ అమ్మాయి తల వెంట్రుకలు నాకు జంధ్యానికి ఉపకరిస్తాయి" అన్నాడు. వెంటనే పొడవుగా వేలాడుతున్న తన కుమార్తె తల వెంట్రుకలను మొదలంట కత్తరించాడు కంజారనాయనారు. దానిని మునివరుని చేతిలో పెట్టడానికి ముందుకు రాగా మునివరుడు మాయమయ్యాడు. ఉమాదేవి సహితుడై వృషభవాహనారూఢుడై పరమేశ్వరుడు గగనవీధిలో ప్రత్యక్షమయ్యాడు. "భక్తుడా! నీభక్తి లోకానికి తెలియజేయడం కోసమే నేను ఇలాచేశాను" అని చెప్పి అంతర్ధానమయ్యాడు. పరమేశ్వరుని అనుగ్రహంతో పెళ్లి కుమార్తె తలవెంట్రుకలు యథాప్రకారం వచ్చాయి.

## 12. అరివాట్టాయ నాయనారు

**కా**వేరి నదీజలాలు ప్రవహించే చోళదేశంలో కణ్ణమంగళం అనే గ్రామం ఉంది. ఆ గ్రామంలో తాయనార్ అనే శివభక్తుడు ఉండేవాడు. అతడు ప్రతిరోజూ క్రమం తప్పకుండా ఎర్రవడ్ల బియ్యపుటన్నాన్ని, మామిడి ఊరగాయలను శివునికి సమర్పిస్తుండేవాడు.

పరమేశ్వరుడు ఒక పర్యాయం తాయనార్ భక్తిని పరీక్షించదలచుకొన్నాడు. శివుని సంకల్ప మాత్రంచేతనే తాయనార్ సంపదలన్నీ తరిగిపోయాయి. పేదరికంతో బాధపడుతున్నప్పటికీ తాయనారు తాను రోజుచేసే స్వామి కైంకర్యాన్ని మాత్రం మరిచిపోలేదు. కూలి పనిచేసి దాని ద్వారావచ్చే ఎర్రటివడ్లను తీసుకువచ్చి దానిని పక్వంగా వండి

నైవేద్యంగా సమర్పిస్తూ, తాను మాత్రం తక్కువ రకం నల్ల వడ్లబియ్యాన్ని స్వీకరిస్తూ వచ్చాడు.

ఒక పర్యాయం తాయనారు ఎర్రటివడ్ల బియ్యపుటన్నాన్ని మావడుగులను, ఎర్ర ఆకుల కూరను వండి వాటిని బుట్టలో పెట్టుకొని మట్టిపాత్రలో భార్య పంచకవ్యాన్ని తీసుకొని వెంటరాగా శివాలయానికి బయలుదేరాడు. త్రోవలో తటాలుమని కాళ్లు తడబడగా తాయనార్ కిందపడ్డాడు. బుట్టలోనున్న అన్నము, మావడులు, ఎర్రటి ఆకుకూర నేలపాలయ్యాయి. “అయ్యో! స్వామికి నైవేద్యంగా తీసుకువెళ్తున్నవన్నీ నేల పాలయ్యాయి! స్వామికి నైవేద్యం పెట్టలేకపోయాను కదా అనే సంతాపంతో నాయనారు కత్తితో తన కంఠాన్ని ఉత్తరించుకోబోయాడు. అప్పుడు అందరూ చూస్తుండగా శివుడు వృషభవాహనారూఢుడై ఆకాశంలో ప్రత్యక్షమయ్యాడు. “ఓ భక్త శిఖామణీ! అపూర్వమైన నీ భక్తికి నేను సంతోషించాను. నీవు నీ భార్యతో కలసి కైలాసంలో శాశ్వతంగా ఉండేవరాన్ని అనుగ్రహిస్తున్నాను” అని చెప్పి అంతర్ధానమయ్యాడు. కత్తితో (అరివాళ్) కంఠాన్ని కోసుకోవడానికి ప్రయత్నించినందువలన ఇతను అరివాళ్ నాయనారుగా పిలువబడ్డాడు. కాలక్రమంలో అది అరివాట్టాయ నాయనారుగా మారింది.

## 13. ఆనాయ నాయనారు

**మే**ల్ మళనాడు అనే దేశంలో తిరుమంగళం అనే అందమైన గ్రామం ఉంది. ఆ గ్రామంలో యాదవ వంశాన్ని ఉద్ధరించడానికా అన్నట్లు ఆనాయరు అవతరించాడు. పవిత్రమైన విభూతిని ధరించిన అతడు శివునికి తప్ప వేరొకరికి నమస్కరించడు. ఆనాయరు పశువులను మేపడం వృత్తిగా కలిగినవాడు. ముల్లైప్రాంతపు పచ్చిక బయళ్లలో వాటిని మేపుతుంటాడు.



పశువులకు వేర్వేరు కొట్టాలను ఏర్పరచి వాటిలో పశువులను జాగ్రత్తగా ఉంచి కాపాడుతూ వచ్చాడు.

సంగీతంలో నిష్ణాతుడైన ఆనాయరు వెదురులో రంధ్రాన్ని ఏర్పరచి వేణువును తయారుచేసి దానినుండి మధురమైన సంగీతాన్ని వర్షిస్తుండేవాడు.

ఒక పర్యాయం పరమేశ్వరుని పంచాక్షరి మంత్రాన్ని తన వేణువుద్వారా వాయించడం ప్రారంభించాడు ఆనాయరు. శరీరాన్ని మైమరపించే అద్భుతమైన నాదాన్ని విన్నటువంటి పశువులు మేతమేయడం మానివేసి ఆనాయరు చుట్టూరా నిలిచాయి. పాలు తాగుతున్న దూడలు పాలు తాగడం మానివేశాయి. ఆనాయరు సంగీతానికి చరాచర లోకాలు తన్మయత్వంలో మునిగిపోయాయి.

కపట భక్తికి వశ్యుడు కాని పరమేశ్వరుని చెవులకు ఆనాయరు వేణునాదం సోకింది. వెంటనే ఉమాదేవితో కలసి వృషభవాహనారూఢుడై అనాయరు ముందు ప్రత్యక్షమయ్యాడు. “భక్తుడా! వేణునాదం ఆలపిస్తున్న ఈ స్థితిలోనే నీవు మమ్మల్ని చేరుకోగలవు” అని పరమేశ్వరుడు ఆనాయరుని అనుగ్రహించాడు.

## 14. మూర్తి నాయనారు

**పా**ండ్యదేశానికి రాజధాని అయిన మదురైలో వణిగ వంశంలో మూర్తినాయనారు అవతరించాడు. భక్తియే స్వరూపంగా కలిగిన నాయనారు మధురైలో నెలకొని ఉన్న శివునికి రోజూ చందనం అరగదీసి ఇస్తూ ఉండేవాడు.

ఒక పర్యాయం కర్ణాటక రాజు పాండ్యదేశంపై దండెత్తి యుద్ధంలో పాండ్యరాజును ఓడించి దేశాన్ని తన కైవశం చేసుకున్నాడు. అతడు విభూతి

ధారణ చేసిన శివభక్తులపై ద్వేషాన్ని పెంచుకున్నాడు. జైనమతాన్ని దేశంలో వ్యాపింపజేయడానికి కంకణం కట్టుకున్నాడు. మూర్తినాయనారును జైన మతానికి మార్చాలని ఎన్నో విధాలుగా ప్రయత్నించాడు. కాని అతని సంకల్పం నెరవేర లేదు. మూర్తినాయనారు చేస్తూ వస్తున్న చందన కైంకర్యానికి విఘ్నం తీసుకురావాలని తలచి అతనికి ఎవరూ చందనం కట్టెలు ఇవ్వకూడదని కట్టడి చేశాడు. ఈ రాజు నా కైంకర్యానికి అడ్డంకిని కలిగించాడు. కాని చందనాన్ని అరగదీసే నా చేతులకు అతను ఏవిధంగా అడ్డంకిని కలిగించగలడు? అని భావించి మూర్తినాయనారు తన చేతులను చందనం అరగదీసే రాయిపై పెట్టి అరగదీయడం ప్రారంభించాడు. చేతిపైనున్న చర్మం ఊడిపోయింది. రక్తం ప్రవాహంగా కారడం ప్రారంభించింది. ఎముకలు కూడ బయటపడ్డాయి. అయినప్పటికీ మూర్తి నాయనారు తన పనిని కొనసాగించాడు. ఆ రోజురాత్రి మూర్తినాయనారుకు పరమేశ్వరుడు కలలో ప్రత్యక్షమై “నీకు అపకారం తలపెట్టిన ఈ రాజు త్వరలోనే నశిస్తాడు. ఈ రాజ్యం నీ చేతికి వస్తుంది. నీవు యథాప్రకారం నాకు కైంకర్యం చేస్తూ చివరగా కైలాసంలో నా సన్నిధికి చేరుకుంటావు” అని అనుగ్రహించాడు.

ఆరోజు రాత్రే కర్ణాటకరాజు మరణించాడు. చనిపోయిన ఆరాజుకు సంతానం లేరు. సమర్థుడైన రాజు లేకపోతే దేశం నశించిపోతుందని దేశంలోని పెద్దలందరూ కలసి ఆలోచించారు. “ఒక ఏనుగుకు కళ్లను గంతలు కట్టి వదలుదాం. అది ఎవరిని తీసుకువస్తుందో వారినే మనం రాజుగా చేద్దాం” అని తీర్మానం చేశారు. అదేప్రకారం పట్టపుటేనుగు కళ్లకు గంతలు కట్టి వదిలారు. ఆ ఏనుగు రాజవీధుల గుండా వచ్చి అక్కడ నిలబడి ఉన్న మూర్తినాయనారు మెడలో మాలనువేసింది. మంత్రులు, రాజ ప్రముఖులు మొదలైనవారు మూర్తినాయనారును ఆహ్వానించి వారికి



వైభవంగా పట్టాభిషేకం చేసి రాజ్యాన్ని అప్పగించారు. మూర్తినాయనారు పవిత్ర పంచాక్షరినే పఠిస్తూ పరమేశ్వరుని ధ్యానంలో కాలం గడిపాడు. ప్రజలందరినీ తన కన్నబిడ్డలవలె కాపాడుతూ చివరగా పరమేశ్వరుని తిరుచరణాలను చేరుకున్నాడు.

## 15. మురుగ నాయనారు

**పా**డిపంటలతో విరాజిల్లుతున్న చోళదేశంలో తిరుప్పుగలూరు అనే గ్రామం ఉంది. ఈ గ్రామంలో ఒక వైదిక కుటుంబంలో మురుగనారు అవతరించాడు. శివభక్తుడైన ఇతడు శివుని ఏకాగ్రతచిత్తంతో పూజిస్తూ వచ్చాడు.

తిరుప్పుగలూరులో నెలకొని ఉన్న పరమేశ్వరునికి పవిత్రమైన పూలమాలలు కట్టి ఇచ్చే కైంకర్యాన్ని స్వీకరించి రోజూ నిష్ఠగా దానిని పాటిస్తూ వచ్చాడు. పూలహారాలు తయారుచేసే కైంకర్యంలో నిమగ్నుడై ఉన్నప్పటికీ సదా పంచాక్షరి మంత్రాన్ని ఏమరకుండా ఉచ్చరిస్తూ ఉండేవాడు. జగన్మాత అయిన పార్వతీదేవి దగ్గరినుండి జ్ఞాన క్షీరాన్ని గ్రోలిన తిరుజ్ఞాన సంబందరు ఇతనికి ఆప్తమిత్రుడుగా ఉండేవాడు. శివునికి పూలమాలలు సమర్పించే కైంకర్యాన్ని చేస్తూ వచ్చి చివరగా పరమేశ్వరుని తిరుచరణాలను చేరుకున్నాడు మురుగనాయనారు.

## 16. రుద్ర పశుపతి నాయనారు

**తి**రుత్తలైయూరు అనే గ్రామంలోని ఒక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు పశుపతి. అతడు చిన్నప్పటి నుండి పరమేశ్వరుని భక్తితో సేవిస్తూ వచ్చాడు. రుద్రసూత్రాన్ని భక్తిశ్రద్ధలతో పఠించడం వలన ఇతనికి రుద్రపశుపతి అనే పేరు కలిగింది రోజూ ప్రాతఃకాలంలోనే లేచి మెడవరకు

నీటిలో నిలబడి రెండు చేతులనూ శిరసుపై మోడ్చి భక్తితో రుద్రసూక్తాన్ని పఠించేవాడు. రుద్ర పశుపతి తపోభక్తికి ప్రసన్నుడై పరమేశ్వరుడు అతనికి శివలోక సాయుజ్యాన్ని ప్రసాదించాడు.

## 17. తిరునాళైపోవార్ నాయనారు

## (నందనార్ చరిత్ర)

**కొ**ల్లిడం నదీతీరంలో ఉన్న ఒక అందమైన గ్రామం ఆదనూరు. ఈ గ్రామానికి బాహ్యప్రదేశంలోని ఒక దళిత వాడలో నందనారు జన్మించాడు. పుట్టినప్పటి నుండి పరమేశ్వరుని తిరుచరణాలను సదా ధ్యానిస్తూ వచ్చాడు నందనారు. ఇతడు శివాలయంలోని భేరీ, మృదంగం మొదలైన వాయిద్యాలకు కావలసిన చర్మాన్ని, వీణ మొదలైన వాయిద్యాలకు తంత్రులుగా నరాలను అందిస్తూ ఉండేవాడు. ఈ విధంగా స్వామి కైంకర్యాన్ని చేస్తూ వచ్చిన నందనారు గుడి వాకిలి దాటక అక్కడి నుండే స్వామిని దర్శిస్తూ, నోరారా స్వామిని గానంచేస్తూ ఆనందించేవాడు.

ఆదనూరుకు సమీపంలో తిరుప్పున్‌గూరు అనే గ్రామంలో వెలసిన పరమేశ్వరుని దర్శించాలనే ఆకాంక్షతో నందనారు అక్కడికి వెళ్లి గుడి వాకిలి ముందు నిలబడి చూశాడు. కాని నందీశ్వరుడు అడ్డంగా ఉండడం వలన నందనారుకు స్వామి దర్శనం కలగలేదు. స్వామిని దర్శించ లేకపోయాననే తీవ్రమైన సంతాపంలో నందనారు మునిగిపోయాడు. భక్తుని ఆవేదనను గుర్తించిన కరుణామూర్తి అయిన శివుడు అడ్డంగా ఉన్న నందీశ్వరుని పక్కకు తొలగమని ఆజ్ఞాపించాడు. నందనారుకు స్వామిని నేరుగా దర్శించడానికి వీలయింది.



ఒక పర్యాయం నాయనారు చిదంబరంలోని నటరాజ స్వామిని దర్శించాలను కున్నాడు. కాని "పవిత్రమైన చిదంబరంలోని శివాలయానికి నాలాంటి అపవిత్రుడు, నిమ్నకుల సంజాతుడు వెళ్లడం ఎలా సాధ్యమవుతుంది?" అని తన ప్రయత్నాన్ని విరమించు కున్నాడు.

నందనారు ఒకరోజు చిదంబరం వెళ్లాలని గట్టిగా నిశ్చయం చేసుకొని ఆలస్యం చేయక వెంటనే బయలుదేరాడు. చిదంబరం పొలిమేరలు చేరుకున్నాడు. కాని తన కులాన్ని తలచుకొని చిదంబరం నగరంలోనికి అడుగుపెట్టకుండా అక్కడే నిలిచాడు. "నేను జన్మించిన ఈ కులం నాకు అడ్డంకిగా ఉంది" అంటూ చిదంబరానికి వెలుపల ప్రదక్షిణంగా వచ్చాడు. ఈ విధంగా ఎన్నో రోజులు చిదంబరాన్ని ప్రదక్షిణం చేస్తూ వచ్చిన నందనారుకు పరమేశ్వరుడు ఒకరోజు కలలో కనిపించి "భక్తుడా! నీకు సంక్రమించిన ఈ నీచకులం తొలగిపోవాలంటే నీవు నిప్పుల్లో నడిచి తిల్లైలోని బ్రాహ్మణులతో కలసి నాముందుకు రా!" అని చెప్పాడు. బ్రాహ్మణులు అగ్నిని ప్రజ్వలింపజేశారు. నందనారు సంతోషంతో పరమేశ్వరునికి చేతులు మోడ్చి నమస్కరించి పవిత్ర పంచాక్షరి మంత్రాన్ని పఠిస్తూ అగ్నిగుండంలో ప్రవేశించాడు. కెందామరల నుండి నడిచి వచ్చినట్లు నందనారు అగ్నిగుండం నుండి బయటకు వచ్చాడు. అతని రూపం పూర్తిగా మారిపోయింది. 'పవిత్రమైన యజ్ఞోపవీతం వేలాడుతుండగా, ముని వేషధారియై బ్రహ్మదేవుని తలపించేలా, నందనారు కనిపించాడు. తిల్లైలోని బ్రాహ్మణులందరూ చేతులు మోడ్చి నందనారుకు నమస్కారం చేశారు. నందనారు మెల్లగా శివాలయంలోనికి ప్రవేశించాడు. నటరాజస్వామి సన్నిధిలోనికి వెళ్లగానే నందనారు అంతర్ధానమయ్యాడు. కైలాసంలో ఎల్లప్పుడూ తన సన్నిధిలో ఉండే వరాన్ని నందనారుకు అనుగ్రహించాడు పరమేశ్వరుడు.

## 18. తిరుక్కురిప్పు తొండ నాయనారు

కంచి నగరంలో రజక కులంలో జన్మించిన ఒక మహాభక్తుడు ఉన్నాడు. పరమశివుని భక్తుడైన అతడు శివభక్తుల కోరికలను వారు చెప్పకముందే తెలుసుకొని వాటిని నెరవేరుస్తుండేవాడు. అందువలన అతనిని అందరూ తిరుక్కురిప్పు తొండ నాయనారు అని పిలిచేవారు. అతడు కాంచీపురంలోని ప్రజల మురికి బట్టలను రోజూ పరిశుభ్రంగా ఉతికి ఇస్తుండేవాడు. ముఖ్యంగా శివభక్తుల వస్త్రాలను పరిశుభ్రంగా ఉతికి ఇవ్వడంలో అత్యధిక శ్రద్ధ వహించేవాడు.

పరమేశ్వరుడు తిరుకురిప్పు తొండ నాయనారు భక్తిని పరీక్షించదలచుకొన్నాడు. చలికాలంలో ఒకరోజు మురికి బట్టలను వేసుకొని పేద శివభక్తుని వలె తిరుకురిప్పు నాయనారు ముందుకు వచ్చాడు. వారి మురికి బట్టలను నాయనారు చూశాడు. "స్వామీ! మీ బట్టలు మురికిగా ఉన్నాయి. వాటిని ఇచ్చారంటే నేను బాగా ఉతికి పరిశుభ్రంగా తీసుకు వస్తాను" అన్నాడు. "భక్తుడా! ఈ వస్త్రాన్ని సూర్యాస్తమయం లోపల నాకు పరిశుభ్రంగా ఉతికి తీసుకు రాగలిగితే ఇస్తాను. ఈ వస్త్రం లేకపోతే రాత్రి చలికి నేను ఓర్చుకోలేను" అని చెప్పాడు.

నాయనారు అమాయా తాపసిని చూసి "స్వామీ! మీరు ఈ వస్త్రాన్ని నాచేతికి ఇవ్వండి. ఈరోజు సాయంత్రంలోపల మీరు చెప్పినట్లు నేను దీనిని ఉతికి తీసుకువస్తాను" అని చెప్పి ఆ వస్త్రాన్ని తీసుకున్నాడు. తటాకంలోని నీటితో మురికిపోయేలా వస్త్రాన్ని శుభ్రంగా ఉతికాడు. ఈలోపల మధ్యాహ్న సమయం దాటిపోయింది. పరమేశ్వరుని లీలావిలాసాల కారణంగా హఠాత్తుగా వర్షం కురవడం ప్రారంభమైంది. వర్షం తగ్గే సూచనలు ఏమాత్రం కనిపించడం లేదు. రాత్రి సమీపించింది.



"అయ్యో! శివభక్తుని చలిలో బాధపడేలా చేశాను. ఈ బట్టలు లేకపోతే అతడు ఈ చలిని ఓర్చుకోలేడు. నేను ఇచ్చినమాట తప్పాను. ఏంచేయాలో తెలియడం లేదు. బట్టలు ఉతకడానికి ఉపయోగపడే ఈ బండపై నాతలను మోదుకుంటాను. ఇదే నేను చేసిన తప్పుకు ప్రాయశ్చిత్తం" అని చెప్పి ఆ బండమీద తన తలను మోదుకున్నాడు. అప్పుడు పరమేశ్వరుని పవిత్రహస్తము నాయనారు తలను కొట్టుకోకుండా ఆపింది. "నీ భక్తిని లోకానికి తెలియజేయడం కోసమే ఇలా చేశాను" అని చెప్పి భక్తవత్సలుడైన శివుడు తిరుకురిప్పు తొండనాయనారుకు శాశ్వతంగా శివలోకంలో ఉండే వరాన్ని అనుగ్రహించాడు.

## 19. చండేశ్వర నాయనారు

సేయంజలూరు అనే గ్రామంలో ఎచ్చ దత్తన్, పవిత్ర అనే దంపతులు శైవ సంప్రదాయాన్ని అనుసరిస్తూ జీవనం సాగిస్తూ వచ్చారు. పరమేశ్వరుని అనుగ్రహం వలన వారికి ఒక కుమారుడు జన్మించాడు. అతని పేరు విచార శర్మ.

శివభక్తుడైన విచారశర్మ పశువులను మేపడమే పవిత్ర కార్యంగా నిర్వహిస్తూ వచ్చాడు. చేతిలో ఒక పొడవాటి కర్రను ధరించి పశువులను పచ్చిక అధికంగా ఉన్న ప్రాంతాలకు తీసుకువెళ్లి మేపుతుండేవాడు. దీని కారణంగా పశువులు ఆరోగ్యంగానూ, బలిష్ఠంగానూ ఉండేవి. పాలను కూడ అధికంగా ఇవ్వసాగాయి. ఊరివారు కూడ దీనిని చూసి సంతోషించారు. ఇంట్లోనున్న దూడలను ఎడబాసిన ఆవులు విచారశర్మ తమదగ్గరికి రాగానే పాలుపిండకనే యథేచ్ఛగా పాలను స్రవించసాగాయి. ఈ పాలు ఇలా వృధాగా నేలపాలు కావడం కన్న శివునికి అభిషేకంగా ఉపయోగిస్తే మంచిదని విచారశర్మ అనుకున్నాడు.

శివుని కోసం ఒక ఆలయం నిర్మించాలని అనుకొని మణ్ణినదీ తీరంలోని అత్తివృక్షం కింద ఇసుకతో శివలింగాన్ని నిర్మించాడు. ఒక్కొక్క ఆవు పొదుగులోని నాలుగు కాడలలో ఒకదానిని మాత్రం తడమగా దాని నుండి పాలు సమృద్ధిగా కురిసింది. వాటిని కడవలలో నింపుకొని శివలింగానికి అభిషేకం చేశాడు. పరమేశ్వరుడు అతనిభక్తికి సంప్రీతుడై క్షీరాభిషేకాన్ని సంతోషంగా స్వీకరించాడు. పశువులు తామే వచ్చి పూజకు కావలసిన పాలను ఇవ్వసాగాయి. మొదట ఒక వేడుకగా ప్రారంభించిన ఈ పూజ రోజూ చేసే నిత్య పూజగా మారింది.

విచారశర్మ చేస్తున్న ఈపూజలను చూసి వాస్తవం తెలియని ఒకడు ఆ ఊరిపెద్దల దగ్గరికి వెళ్లి వారితో విచారశర్మ మన ఊరి ఆవుల నుండి పాలను తీసి వాటిని ఇసుకలో పోస్తున్నాడు" అని ఫిర్యాదు చేశాడు. ఊరిపెద్దలు విచారశర్మ తండ్రిగారిని విచారణసభకు పిలిపించారు. జరిగిన విషయం అతనికి తెలియజేశారు. ఎచ్చదత్తన్ సభవారికి నమస్కరించి "పెద్దలారా! ఈ విషయం నాకింతవరకు తెలియదు. ఈ ఒక్క తప్పును క్షమించండి. ఇకమీదట ఈవిధంగా జరక్కుండా నేను చూస్తాను" అని చెప్పి ఇంటికి వెళ్లాడు. రాత్రంతా అతనికి నిద్రపట్టలేదు. సభలోని వారు చేసిన అభియోగాన్ని తలచుకుంటూ ఉన్నాడు. ఈ అభియోగంలోని సత్యాసత్యాలను తానే స్వయంగా వెళ్లి తెలుసుకోవాలని నిశ్చయం చేసుకున్నాడు. ఉదయం యథాప్రకారం పశువులను తోలుకొని వెళ్తున్న విచారశర్మను అతనికి తెలియకుండా రహస్యంగా వెంబడించాడు. విచారశర్మ మెల్లగా మణ్ణినదీ తీరాన్ని సమీపించాడు. అక్కడి అత్తి చెట్టు సమీపంలో పశువులను మేయడానికి వదిలాడు. తాను నదిలో స్నానంచేసి అత్తిచెట్టుకింద ఇసుకలో శివలింగాన్ని నిర్మించాడు. పశువుల పొదుగులోని ఒక్క కాడనుండి



తీసిన పాలను కడవల్లో నింపుకొని ఆపాలతో శివలింగానికి భక్తితో అభిషేకం చేయడం ప్రారంభించాడు. తన కుమారుడు చేస్తున్న తతంగమంతా ఎచ్చదత్తన్ చూశాడు. మితిలేని కోపంతో తనచేతిలో ఉన్న కర్రతో విచారశర్మ వీపుపై బలంగా కొట్టాడు. కాని భక్తి పారవశ్యంతో పూజచేస్తున్న విచారశర్మకు తన తండ్రి కొట్టిన దెబ్బలుకాని, తిట్టిన తిట్లుగాని వినిపించలేదు. ఎచ్చదత్తన్ తన కోపాన్ని ఆపుకోలేక పోయాడు. పరమేశ్వరుని అభిషేకానికై కడవలో ఉంచిన పాలను తన కాలితో తన్ని తోసివేశాడు. అప్పుడు విచారశర్మలో చైతన్యం కలిగింది. అభిషేకానికై ఉంచిన పాలను నెట్టి వేసినది ఎవరని చూశాడు. పాలను ఎవరైతే కింద తోసివేశారో వాళ్లు ఎవరైనప్పటికీ వాళ్ల కాళ్లను నరకాలని నిశ్చయం చేసుకున్నాడు. తన చేతిలో ఉన్న కర్ర గండ్రగొడ్డలిగా మారగా దానితో తండ్రిగారి కాళ్లను నరికివేశాడు. ఎచ్చదత్తన్ నేలమీదికి వాలిపోయాడు. శివపూజకు కలిగిన అంతరాయం తీరిపోయిందనే సంతోషంతో విచారశర్మ మళ్లీ పూజలో నిమగ్నమైపోయాడు.

విచారశర్మ అచంచలమైన శివభక్తికి పరవశుడైన పరమేశ్వరుడు పార్వతీ సమేతుడై, విచారశర్మ ముందు ప్రత్యక్షమయ్యాడు.

తనకు చేతులు మోడ్చి భక్తితో నమస్కరించిన విచారశర్మతో "భక్తుడా! నాకోసం నీవు నీ తండ్రిగారి కాళ్లను నరికావు. ఇక నీకు మేమే తండ్రి మేము ధరించిన ఆభరణాలనే నీవూ ధరించి శివగణాలకు నాయకుడవై, చండేశ్వర బిరుదముతో విరాజిల్లు" అని పరమేశ్వరుడు చెప్పి విచారశర్మను ఆలింగనం చేసుకున్నాడు. పరమేశ్వరుని స్పర్శమాత్రం చేతనే విచారశర్మ మాయాశరీరం తొలగిపోయి శివుని దివ్యజ్యోతిలో ఐక్యమైపోయింది.

# 20. తిరునావు క్కరసు నాయనారు

తిరువామూరు' అనే గ్రామంలో పుగళనారు, మాదినియారు అనే ఆదర్శ దంపతులున్నారు. వీరికి తిలకవతి అనే కుమార్తె, మరుళ్‌నీక్కియార్ అనే కుమారుడు ఉన్నారు. మరుళ్ నీక్కియార్ బాల్యంలోనే సకల విద్యలను అభ్యసించి పండితుల ప్రశంసలను అందుకున్నాడు. తిలకవతికి పన్నెండు సంవత్సరాల ప్రాయం రాగానే ఆమెను పెండ్లాడానికి శివభక్తుడు, రాజుగారి దళపతి అయిన కలిప్పగైయార్ అనే యువకుడు ముందుకు వచ్చాడు. పుగళనారు కూడ తనకుమార్తెను కలిప్పగైయారుకు ఇవ్వడానికి సమ్మతించాడు. వివాహానికి ముహూర్తం కూడ నిశ్చయింపబడింది. ఇంతలో ఉత్తర దిగ్భాగానికి చెందిన కొందరు రాజులు రాజ్యంపై దండయాత్ర జరపగా కలిప్పగైయారు వాళ్లను ఎదుర్కోవడానికి ససైన్యంగా వెళ్లాడు. ఇక్కడ తిలకవతి తల్లిదండ్రులు వ్యాధిగ్రస్తులై మరణించారు. శత్రు సైనికులతో యుద్ధంచూస్తూ కలిప్పగైయారు కూడ వీరోచితంగా మరణించాడు. తీరని దుఃఖ సముద్రంలో మునిగిన తిలకవతి మా తల్లిదండ్రులు నన్ను కలిప్పగైయారుకు ఇచ్చి పెళ్లి చేయాలని నిశ్చయించారు. అందువలన నేను కలిప్పగైయారుకే స్వంతం. వారు కూడ యుద్ధంలో మరణించారు. కాబట్టి నేను కూడ ప్రాణ పరిత్యాగం చేసి వారిని చేరుకుంటాను" అని తన ప్రాణాలను తీసుకోవడానికి ప్రయత్నించింది. అప్పుడు తమ్ముడైన మరుళ్ నీక్కియార్ తన సోదరి కాళ్లమీద పడి "తల్లిదండ్రులను కోల్పోయి నిన్నే సర్వస్వమని భావించి జీవిస్తున్నాను. నన్ను అనాధను చేసి పోవడం నీకు తగునా! నీవు ప్రాణ పరిత్యాగం చేస్తే నేను నీకంటే ముందే నా ప్రాణాలను వదులుతాను" అని చెప్పగా తిలకవతి తన ఆత్మహత్యా ప్రయత్నాన్ని విరమించి సోదరుని పుత్ర సమానంగా భావించి పెంచుతూ వచ్చింది.



మరుళ్ నీక్కియార్ జైనమతంచే ఆకర్షింపబడి జైన బసదిలో చేరాడు. జైనమతానికి సంబంధించిన అన్ని గ్రంథాలను క్షుణ్ణంగా అధ్యయనం చేశాడు. ఇతని ప్రతిభ పాండిత్యాలకు అబ్బురపడి జైన సన్యాసులు ఇతనికి 'ధర్మసేనుడు' అని పేరు పెట్టారు. బౌద్ధ భిక్షువులతో వాదించి జైనమతమే సర్వోత్కృష్టమైంది అని నిరూపిస్తుండేవాడు ధర్మసేనుడు.

బంధువులను కోల్పోయిన తిలకవతి ఇల్లు వదలి తిరుక్కెడిల్ నదికి ఉత్తర దిశగా వెళ్లి తిరువదిగై వీరవట్టానం అనే పవిత్ర శైవక్షేత్రాన్ని ఆవాసంగా చేసుకొంది. అక్కడ వెలసిన శివాలయం ముందు భాగాన్ని శుభ్రంగా ఊడ్చి పేడతో అలికి అందంగా ముగ్గులు తీర్చి. సువాసనలీనే పుష్పాలతో మాలలు కట్టి సమర్పిస్తూ స్వామి కైంకర్యంలో మునిగిపోయింది. అప్పుడప్పుడూ తన తమ్ముని తలచుకుంటూ బాధపడుతూ ఉండేది. ఒకరోజు శివుడు తిలకవతికి కలలో కనబడి "నీవు విచారించకు నీ తమ్ముడు పూర్వం నాకోసం తపస్సు చేసిన మహాభక్తుడు. అతన్ని మళ్లీ శివభక్తునిగా నేను మారుస్తాను" అని చెప్పి అంతర్థానమయ్యాడు.

అక్కడ ధర్మసేనునికి శూలవ్యాధి సంప్రాప్తించింది. వ్యాధిబాధను అతను సహించలేకపోయాడు. జైన సన్యాసులు ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ ధర్మసేనుని వ్యాధిని తగ్గించలేక పోయారు. ఆఖరున ధర్మసేనునికి తన అక్కగారైన తిలకవతి గుర్తుకు వచ్చారు. జైనమత వేషధారణను వదలి తన అక్కగారి దగ్గరికి వచ్చాడు. అక్కగారు తన తమ్ముని చూసి పరమేశ్వరుని కరుణా కటాక్షాలచే నీ వ్యాధి పూర్తిగా నయమవుతుందని చెప్పి పవిత్రమైన పంచాక్షరి మంత్రాన్ని ఉపదేశించింది. నుదుట విభూతిని తీర్చింది. పరమేశ్వరుని అనుగ్రహంతో మరుళ్ నీక్కియారు శూలవ్యాధి పూర్తిగా తొలగిపోయింది. పరమేశ్వరుడు మరుళ్ నీక్కియారు పాడిన పాటలకు

సంతసించాడు. "ఇది మొదలుకొని నీవు తిరునావు క్కరసర్ (శ్రీ వాగీశుడు) అనే పేరుతో ప్రసిద్ధి చెందుతావు" అని ఆకాశవాణి ద్వారా ఆశీర్వదించాడు.

శివభక్తుడైన తిరునావుక్కరసర్ నాటినుండి త్రికరణశుద్ధిగా స్వామి కైంకర్యంలో నిమగ్నమయ్యాడు. శరీరమంతా విభూతిని అలదుకొన్నాడు. రుద్రాక్షమాలను ధరించాడు. స్వామిని హృదయంలో నిలుపుకొన్నాడు. చక్కటి తమిళంలో పరమేశ్వరుని స్తుతిస్తూ గీతాలను రాయడం ప్రారంభించాడు. శివాలయం చుట్టూ ఉన్న ముళ్ల పొదలను, గడ్డి, రాళ్లు రప్పలు మొదలైనవాటిని తొలగించి శుభ్రం చేసేపనిలో నిమగ్నుడయ్యాడు.

తిరుప్పాదిరి పులియూరులోని జైనులు తిరునావుక్కరసు చేష్టలను సహించలేక పోయారు. అందరూ చేరి రాజుగారి దగ్గరికి వెళ్లారు. రాజైన మహేంద్రవర్మ జైన మతాభిమాని. జైన సన్యాసులందరూ అతనితో "రాజా! ధర్మసేనుడు మీరు అనుసరిస్తూ వస్తున్న జైనమతాన్ని నిందిస్తున్నాడు" అని ఫిర్యాదు చేశారు. పల్లవ మహేంద్ర వర్మ కోపావేశంతో 'తిరునావుక్కరసు'ను బంధించి తీసుకురమ్మని చెప్పి అతనిని మండుతున్న సున్నపుబట్టిలో వేస్తాడు. పరమేశ్వరుని అనుగ్రహం కారణంగా తిరునావుక్కరసు శరీరం వారంరోజులైనా చెక్కు చెదరలేదు. జైనులు తమ కోపాన్ని వదలక అతనికి విషాహారాన్ని తినిపించారు. విషాన్ని ఆరగించిన పరమేశ్వరుని భక్తులను విషం ఏం చేయగలుగుతుంది. ఏనుగులతో తొక్కించాలని ప్రయత్నించారు. కాని ఆ ఏనుగులు తిరునావుక్కరసును చూసి తొండమెత్తి నమస్కరించాయి. నడుముకు బండరాయిని కట్టి సముద్రంలో విసరివేస్తే సముద్రుడు అతనిని క్షేమంగా తీరం చేర్చాడు. "ఎన్ని కష్టాలు వచ్చినప్పటికీ నేను పరమేశ్వరునే ధ్యానిస్తూ ఉంటాను" అని దృఢ నిశ్చయం గలవాడయ్యాడు తిరునావుక్కరుసు. జైన ధర్మము అసత్యంతో ముడిపడి ఉందని గ్రహించిన పల్లవ చక్రవర్తి



మహేంద్రవర్మ జైనమతాన్ని వదలి శైవమతాన్ని స్వీకరించాడు. తిరుప్పాదిరి పులియూరులో ఉన్న జైన ఆలయాలను, బసదులను నేల కూల్చాడు, తిరువదిగైలో పరమేశ్వరునికి 'గుణపర ఈశ్వరం' అనే దేవాలయాన్ని నిర్మించాడు. తిరునావుక్కరసు అనేక శివాలయాలు దర్శించి ఆయా పవిత్ర క్షేత్రాలను భక్తితో కీర్తించాడు. తిరునావు క్కరసరు శీర్కాళి వస్తున్న విషయం జ్ఞాన సంబందరుకు తెలిసింది. తన శిష్యులతో కలిసి వారికి స్వాగతం పలికారు. పరస్పరం నమస్కరించుకొన్నారు. తిరునావుక్కరసరు నమస్కరించగా జ్ఞాన సంబందరు తన చేతులతో వారిని ఆలింగనం చేసుకొని " అప్పరే!" అని పిలిచారు. అక్కడ గుమికూడిన అక్కడ గుమికూడిన మహా భక్తులందరూ ఈ దృశ్యాన్ని చూసిసంతోషంతో "హర హర" అని జయధ్వానాలు చేశారు.

ఒక పర్యాయం తిరునావు క్కరసరు మహా భక్తుడైన అప్పూది అడిగళ్ గ్రామమైన తింగళూరుకు వెళ్లాడు. తిరునావుక్కరసును చూడగానే అప్పూది అడిగళ్ ఆనందంతో పరవశం చెందాడు. ఆ మహాభక్తునికి తన ఇంటిలో విందును ఏర్పాటు చేశాడు. వంటకాలన్ని సిద్ధమైన తరువాత అప్పూది అడగళ్ తన కుమారుని పిలిచి అరటి ఆకులు కోసుకురమ్మని చెప్పాడు. అరటి ఆకులు కోస్తుండగా ఆ బాలుని పాము కరిచింది. దానిని లెక్కచేయక ఆ బాలుడు అరటి ఆకులను కోసుకు వచ్చి తండ్రి చేతికిచ్చి ప్రాణాలు వదిలాడు. కొడుకు చనిపోయిన విషయం తెలియనీయక అప్పూది అడిగళ్ వడ్డించడం ప్రారంభించారు. కాని తిరునావుక్కరసరు హృదయం జరిగిన విషయాన్ని గ్రహించింది. ఆ బాలుని శరీరాన్ని దేవాలయం ముందు పరుండబెట్టమని చెప్పి "ఒన్రు కోలాం..." అని ప్రారంభమయ్యే భక్తిగీతాన్ని పాడగా చనిపోయిన బాలుడు పునర్జీవాన్ని పొంది పైకి లేచాడు.

## 21. కులచ్చిరై నాయనారు

**మ**ణ మేఱ్కుడి అనే అందమైన గ్రామంలో గొప్ప శివభక్తుడైన కులచ్చిరైయారు జన్మించాడు. నిరంతరమూ శివభక్తిలో లీనమై యున్న అతడు పాండ్య చక్రవర్తికి ప్రధానమంత్రిగా ఉండేవాడు.

శివుని అనుగ్రహం పొందాలంటే శివభక్తులకు సేవ చేయాలనే విషయాన్ని గ్రహించిన కులచ్చిరైయారు శివభక్తులు తనకు ఎదురైతే వారి పాదాలకు సాష్టాంగ నమస్కారం చేస్తుండేవాడు. వాళ్లు ఏ కులానికి చెందిన వారైనా ధనవంతులైనా పేదవారైనా అందరినీ సమానంగా భావించేవాడు.

శివభక్తులు సమూహంగా వచ్చినా, లేక ఒక్కరే వచ్చినా వారిని సంతోషంగా ఆహ్వానించి, వారిని అతిథి మర్యాదలతో సంతృప్తి పరుస్తుండేవాడు. పాండ్య చక్రవర్తికి అమాత్యులుగా ఉన్న కులచ్చిరైయారు దేశాన్ని శత్రువుల బారి నుండి సంరక్షిస్తూ వచ్చాడు. శైవమతం అభివృద్ధి చెందడానికి కారణమైన మంగయర్క్కరసి రాణిగారి శైవభక్తి సేవలకు నిజమైన సేవకుడుగా ఉంటూ శివభక్తులను ఆదరిస్తూ వచ్చాడు. తిరుజ్ఞాన సంబందరు తిరుచరణాలను తన శిరసున ధరించిన మహానుభావుడితడు. సుందరమూర్తి నాయనారుచే 'తిరుతొండ త్తొగై' గ్రంథంలో 'పెరునంబి' అని కీర్తింపబడ్డ శివభక్తుడు కులచ్చిరైనాయనారు.

## 22. కురుంబ నాయనారు

**శి**వదీక్షాపరులై, విభూతిధారులై విరాజిల్లుతున్న ప్రజలతో కూడిన పెరుమిళలై అనే గ్రామంలో శివభక్తుడైన కురుంబనాయనారు అవతరించాడు. శివభక్తులు ఏదడిగినా లేదనకుండా ఇస్తూ వాళ్లను భోజన



మజ్జనాదులతో సంతృప్తి పరుస్తుండేవాడు. శివభక్తులముందు తననొక సేవకుడుగా భావించుకొని వినయంగా ప్రవర్తిస్తూ వచ్చాడు.

'తిరుత్తొండ త్తొగై' రచించిన సుందరమూర్తి నాయనారును సదా ధ్యానంచేస్తూ రావడం వలన కురుంబనాయనారుకు అష్టమసిద్ధులు కైవశమైనది. శివ పంచాక్షరియే తన సర్వస్వంగా భావించి శివభక్తులకు సేవచేయడంలో కాలం గడుపుతుండగా సుందరమూర్తి నాయనారు కొడుంగోళూరు చేరుకున్నారు. వారు తిరువంజి కళంలో వెలసిన పరమేశ్వరుని ప్రస్తుతించి కైలాసాన్ని అనుగమిస్తున్నారనే విషయాన్ని తన యోగబలంచే కురుంబ నాయనారు తెలుసుకున్నారు. "సుందరమూర్తి నాయనారును ఎడబాసి గుడ్డివారి వలె నేను జీవనం సాగించలేను. అందువలన యోగబలంచే ఇప్పుడే నేను కైలాసానికి వెళ్తాను" అని కురుంబ నాయనారు నిశ్చయం చేసుకున్నాడు. తనకున్న యోగశక్తిచే బ్రహ్మరంధ్రాన్ని తెరుచుకొని పరమేశ్వరుని తిరుచరణాల సన్నిధిని సుందరమూర్తి నాయనారు చేరుకోవడానికి పూర్వమే తాను వెళ్లి చేరుకోగలిగాడు.

## 23. కారైక్కాల అమ్మైయారు

**స**ముద్రతీరంలో వెలసిన కారైక్కాల్ అనే ఒక అందమైన పట్టణంలో ధనదత్తుడు అనే ఒక వర్తక శిఖామణి ఉండేవాడు. అతనికి లేక లేక ఒక కూతురు జన్మించగా ఆమెకు పునిదవతి అనే పేరుపెట్టి అల్లారుముద్దుగా పెంచాడు. పునిదవతికి చిన్నప్పటినుండే శివభక్తి అలవడింది. సదా పంచాక్షరి మంత్రాన్ని పఠిస్తూ పరమేశ్వరునే ధ్యానిస్తూ వచ్చింది. బాల్యంనుండి యౌవనదశకు చేరుకున్న అందమైన పునిదవతిని పెండ్లి చేసుకోవడానికై చాలామంది యువకులు ముందుకు వచ్చారు.

నాగ పట్టణంలో నిధిపతి అనే వర్తకునికి పరమదత్తుడనే కుమారుడున్నాడు. పరమదత్తునికి, పునిదవతికి పెళ్లి జరిపించాలనే ఆలోచనతో పెద్దలు ధనదత్తుని సమ్మతిని కోరారు. దానికతడు సంతోషంగా సమ్మతించాడు. బంధువుల, పెద్దల ఆశీర్వాదాలతో పరమదత్తునికి పునిదవతికి పరిణయం జరిగింది. అందమైన భవంతిలో కొత్త దంపతులైన పునిదవతి, పరమదత్తుడు ఇరువురూ సంతోషంగా తమ జీవనాన్ని సాగించారు. తమ ఇంటికి వచ్చిన శివభక్తులకు ప్రీతిగా ఆహారాన్ని సమర్పించి వారిని తృప్తులను కావిస్తుండేవారు.

ఒక పర్యాయం పరమదత్తునికి ఎవరో రెండు మామిడి పళ్లను కానుకగా ఇచ్చారు. ఆ రెండు పళ్లను తన ఇంటిలో ఇవ్వమని సేవకుని ద్వారా పంపించాడు పరమదత్తుడు. పునిదవతి భర్త పంపిన రెండు మామిడిపళ్లలో ఒకదానిని ఒక శివభక్తుడికి ఇవ్వగా అతడు సంతోషంతో ఆ పండును ఆరగించి ఆమెను ఆశీర్వదించి తనదోవన వెళ్లిపోయాడు.

పరమదత్తుడు భోజనం వేళకు ఇల్లు చేరుకున్నాడు. స్నానాదికాలు ముగించుకొని వచ్చిన భర్తకు పునిదవతి అన్నం వడ్డించింది. దాంతోపాటు భర్త సేవకుడిద్వారా పంపిన మామిడిపండ్లలో మిగిలిన ఆ ఒక్కపండును కూడ వడ్డించింది. పరమదత్తుడు ఆ మామిడిపండును ప్రీతిగా తిని “నాకు ఆ రెండో పండును కూడ తినాలని ఉంది. దానిని కూడ తీసుకురా!” అని భార్యను కోరాడు. పునిదవతి రెండోపండును ఎక్కడినుంచి తేగలుగుతుంది? పండును తీసుకువస్తానని చెప్పి అక్కడినుండి లోపలికి వచ్చింది. పరమేశ్వరుని తననీ ఇక్కట్టు నుండి కాపాడమని ప్రార్థించింది. పరమేశ్వరుని అనుగ్రహంచే ఆమెచేతికి ఒక మామిడిపండు వచ్చింది. పునిదవతి సంతోషంతో ఆ మామిడిపండును భర్తక ఇవ్వగా అతడు దానిని ఆనందంగా



ఆరగించాడు. “ఈ మామిడిపండు పూర్వం నేను తిన్న మామిడి పండుకంటె కూడ రుచి అధికంగా ఉంది. ఇది ఇంతకుముందు నేను తిన్న మామిడిపండులాగ లేదు. ఇది నీకెలా వచ్చింది?” అని అడిగాడు. పునిదవతి శివానుగ్రహంచే మామిడిపండు లభించిందని చెప్పడానికి సంశయించినప్పటికీ పతిభక్తి కారణంగా పండు ప్రత్యక్షమైన ఉదంతాన్ని తెలియజేసింది. అయితే పరమదత్తుడు దీనిని నమ్మలేదు. “పరమేశ్వరుని అనుగ్రహంచే మామిడిపండు లభించిందని చెబుతున్నావు. అది వాస్తవమైతే ఇంకొక మామిడిపండును కూడ నాకు తెప్పించి ఇవ్వు” అని భార్యను అడిగాడు. పునిదవతి గత్యంతరం లేక శివుని ప్రస్తుతించి “ఓ నీలకంఠా! ఇప్పుడు వేరొక మామిడిపండును నీవివ్వకపోతే నేను చెప్పిన మాటలన్నీ అసత్యములవుతాయి” అని ప్రార్థించింది. పరమేశ్వరుని అనుగ్రహంచే మరొక మామిడి పండును పునిదవతి కిచ్చాడు శివుడు. దానిని ఆమె భర్తకు ఇవ్వగా అతడు దానిని తీసుకున్నాడు. మరుక్షణమే అది అతని చేతినుండి అదృశ్యమైంది. పరమదత్తుడు మిక్కిలి భయపడ్డాడు. “ఈమె సాధారణ మానవకాంత కాదు. ఈమె ఒక దైవం. ఈమెను వదలి వెళ్లిపోవాలి” అని నిశ్చయించుకొని ఎవరికీ చెప్పకుండా వేరొక ఊరికి వెళ్లి ఆ వూరి వర్తకుని కుమార్తెను పెళ్లి చేసుకొన్నాడు.

పరమదత్తుడు మళ్లీ పెళ్లి చేసుకొని వేరొకచోట కాపురం చేసుకుంటున్నాడనే విషయం బంధువులకు తెలిసింది. భార్య అయిన పునిదవతిని అతనితో చేర్చడమే తమ కర్తవ్యమని వాళ్లు భావించారు. ఆమెను ఒక అందమైన పల్లకీలో ఎక్కించి అందరూ కలసి పాండ్య దేశంలో పరమదత్తుడున్న పట్టణానికి వెళ్లారు. ఈ వార్త విన్న పరమదత్తుడు తన భార్యను, కూతురిని తీసుకొని తానే స్వయంగా పునిదవతిని చూడ్డానికి

వచ్చాడు. ఆమె పాదాలపై వాలి నమస్కరించి "నేను నీ అనుగ్రహంతో జీవనం సాగిస్తున్నాను. నేను నిన్ను దైవంగా భావించడం వలన నా కుమార్తెకు కూడ నీ పేరే పెట్టాను" అని వినయంగా చెప్పాడు. దానిని చూసి బంధువులు పరమదత్తునితో "నీవు నీ భార్యకు ఎందుకు నమస్కరిస్తున్నావు. కారణమేమిటి?" అని ప్రశ్నించారు. ఆ మాటలకు పరమదత్తుడు తన భార్యను చూపించి "ఈమె మానుషమాత్రురాలు కాదు. ఈమె మహిమలతో కూడుకొన్న దైవం. దీని కారణంగానే ఈ దేవత పేరునే నా కుమార్తెకు పెట్టాను. నేను చేసినట్లుగా మీరు కూడ ఈ దేవతకు నమస్కరించండి" అని చెప్పాడు.

పరమదత్తుని మాటలను విన్న బంధువులందరూ ఆశ్చర్యచకితులయ్యారు. పునిదవతి కూడ భర్త మాటలను ఆలకించి తన హృదయాన్ని శివునిపై లగ్నం చేసి "స్వామీ! నేను దేవత అని ఇతడు భావిస్తున్నాడు. ఇతని కోసమై నేను రక్షించుకుంటూ వచ్చిన మాంసంతో కూడిన అందమైన ఈ శరీరాన్ని విడిచిపెట్టాలని కోరుకుంటున్నాను. నీ తిరుచరణాలను సదా సేవిస్తూ ఉండేలాగ పిశాచిరూపాన్ని నాకు అనుగ్రహించు" అని ప్రార్థించింది. తన శరీరంలోని మాంసాన్ని, దాని వలన కలిగే అందాన్ని పునిదవతి పరిత్యజించింది. ఎముకలగూడే తన శరీరంగా పిశాచిరూపాన్ని ధరించింది. మన్నూ మిన్నూ ఏకమై పుష్పవర్షాన్ని కురిపించింది. బంధువులందరూ ఈ అద్భుతాన్ని చూసి ఆశ్చర్య చకితులయ్యారు.

పరమేశ్వరుడు నెలకొని ఉన్న పవిత్రక్షేత్రమైన కైలాసాన్ని కాళ్లతో నడిచి వెళ్లడం సముచితం కాదని భావించి తలతో నడిచి తన దగ్గరికి వచ్చిన ఆమెను చూసి పరమేశ్వరుడు "అమ్మా!" అని పిలిచాడు. ఆ పిలుపు



లోకాలన్నిటా ప్రతిధ్వనించిది. వెంటనే ఆమె శివునిచూసి "తండ్రీ!" అంటూ పిలుస్తూ అతని పాదాలకు నమస్కరించింది. పరమేశ్వరుడు ఆమెను చూసి "నీకేం వరం కావాలి?" అని అడగ్గా ఆమె "ఇక పుట్టుకే లేని వరం కావాలి. ఒకవేళ పుట్టుక ఉంటే నిన్ను మరిచిపోకుండా ఉండే వరం కావాలి. అంతేకాదు నీవు నాట్యమాడే టప్పుడు నీ తిరు చరణాల కింద నేను ఉండే భాగ్యాన్ని నాకు అనుగ్రహించు" అని ప్రార్థించింది. పరమేశ్వరుడు ఆమెను చూసి "తల్లీ! దక్షిణ దిగ్భాగంలోని పళయనూరు గ్రామంలోని తిరువాలంగాడు దేవాలయంలో నేను ప్రదర్శిస్తున్న నాట్యాన్ని చూసి నన్ను ప్రస్తుతిస్తూ ఉందువు గాక!" అని అనుగ్రహించాడు.

## 24. అప్పూది యడిగళ్ నాయనారు

**ప**రమేశ్వరునికి అత్యంత ప్రియమైన భక్తుడు తిరునావుక్కరసర్. ఆ తిరునావుక్కరసు నాయనారుని తాను ఎన్నడూ చూడకపోయినప్పటికీ అతని పాద పద్మాలనే తన హృదయంలో నిలుపుకొని అతనినే ధ్యానిస్తూ వచ్చాడు అప్పూది యడిగళు అనే శివభక్తుడు. శివభక్తుల సౌకర్యార్థమై అనేక మఠాలను, చలివేందిరాలను ఏర్పరచి వాటికి తిరునావుక్కరసు నాయనారు అనే పేరు పెట్టాడు.

ఒక పర్యాయం తిరునావుక్కరసు నాయనారు శివుడు నెలకొనియున్న పవిత్రక్షేత్రాలను దర్శనం చేసుకుంటూ తింగళూరుకు వచ్చారు. తిరునావుక్కరసు శివ భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మఠాలను, చలివేందిరాలను చూశాడు. అక్కడి చల్లటి నీరును తాగి సంతృప్తి చెందాడు. అంతేగాక ఆ చలివేందిరాలకు నాలుగువైపులా "తిరునావుక్కరసరు చలివేందిరం" అనే పేరు ఉండడం కూడా చూశాడు. అక్కడున్నవారిని

చూసి "ఈ చలివేందిరాలకు ఈ పేరు పెట్టినది ఎవరు?" అని ప్రశ్నించాడు. "ఈ చలివేందిరానికి తిరునావుక్కరసు అనే పేరు పెట్టిన మహానుభావుడు అప్పూది యడిగళు. అతని ఇల్లు ఇక్కడికి ఎంతో దూరంలో లేదు. పక్కనే ఉంది" అని అక్కడున్న వారు చెప్పారు.

తిరునావుక్కరసు నాయనారు అప్పూది యడిగళు ఇంటి ముందుకు వెళ్లి నిలబడ్డారు. అప్పూది యడిగళు వచ్చినవారు తాను ఆరాధిస్తూ వస్తున్న తిరునావుక్కరసు నాయనారే అని తెలుసుకొని మిక్కిలి సంతోషించాడు. నాయనారును అర్ఘ్యపానాదులతో సంతృప్తులను గావించి వారిని తమ ఇంట్లో విందారగించ వలసిందని ప్రార్థించగా వారు దానికి సమ్మతించారు. వచ్చిన దైవసమానుడైన అతిథి సత్తమునికి అప్పూది యడిగళు, వారి భార్య షడ్రుచులతో కూడిన మృష్టాన్న భోజనాన్ని సిద్ధం చేశారు. అన్నం వడ్డించడానికి ముందు తమ కుమారులలో ఒకడైన పెద్ద తిరునావుక్కరసుని పిలిచి తోటకు వెళ్లి అరటి ఆకులను కోసుకుని రమ్మని చెప్పారు. ఆ బాలుడు కూడ సంతోషంగా తోటకు వెళ్లి అరటి ఆకును కోస్తుండగా పాము కాటువేసింది. పాము కరిచిన విషయం చెబితే అతిథి భోజనానికి అడ్డంకి ఏర్పడుతుందని భావించి ఆ బాలుడు వేగంగా ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు అరటి ఆకులను ఇచ్చి పాముకాటు వేసిన విషం తలకెక్కగా అక్కడే నేలమీద వాలిపోయి మరణించాడు. అప్పూది యడిగళు దంపతులు బాలుడి చేతిలో కారుతున్న రక్తాన్ని బట్టి ఇతర శరీర లక్షణాలను బట్టి బాలుడు పాముకాటుచే మరణించాడని గ్రహించారు. ఈ విషయం వచ్చిన అతిధికి తెలిస్తే వారి భోజనానికి అడ్డంకి ఏర్పడుతుందని భావించి చనిపోయిన బాలుడిని ఒక చాపలో చుట్టి ఒక పక్కగా దాచి ఉంచారు. తరువాత దంపతులిరువురూ కలిసి తిరునావు క్కరసు దగ్గరికి వెళ్లి భోజనం చేయడానికి ఆహ్వానించారు.



తిరునావుక్కరసు నాయనారు వాళ్ల ఆహ్వానాన్ని అంగీకరించి వచ్చి ఒక ఆసనంలో కూర్చున్నాడు. వారిముందు అరటి ఆకును పరిచి దంపతు లిరువురూ వండిన వంటకాలన్నింటినీ ప్రీతిగా వడ్డించారు. తిరునావుక్కరసు నియమం ప్రకారం విభూతి ధారణచేసి అప్పూది యడిగళు దంపతులకు విభూతిని అందించాడు. పిల్లలందరినీ పిలిచి వాళ్లకు కూడ విభూతిని ఇచ్చాడు. తరువాత అప్పూది యడిగళును కనుగొని మీ సంతానంలో పెద్దవాడిని పిలవండి. వాడికి కూడ నేను విభూతిని ప్రసాదించాలి" అని చెప్పాడు. అప్పూది యడిగళు అప్పుడు జరిగిన విషయమంతా చెప్పాడు. ఆ మాటలకు తిరునావుక్కరసరు బాలుని శవాన్ని చూపించమని కోరాడు. బాలుని శరీరంలోని విషాన్ని తొలగించమని తిరునావుక్కరసు భక్తితో పరమేశ్వరుని ప్రార్థించాడు. బాలుడు నిద్రనుండి లేచిన వాడివలె లేచి తిరునావుక్కరసు పాదపద్మాలకు నమస్కరించగా ఆయన పవిత్రమైన విభూతిని ప్రసాదంగా ఇచ్చాడు. ప్రాణాలతో వచ్చిన తమ కుమారుని చూసి తల్లిదండ్రులు ఆనంద మగ్నులయ్యారు.

అప్పూది యడిగళ్ గృహంలో తిరునావుక్కరసు నాయనారు కొన్ని రోజులుండి తరువాత తిరుప్పళనం వెళ్లి తమిళ తిరుప్పదిగాలను రచిస్తూ కాలం గడిపాడు. తిరునావుక్కసు నాయనారు పాదపద్మాలనే ధ్యానిస్తూ వచ్చిన అప్పూది యడిగళు కైలాసవాసుడైన పరమేశ్వరుని తిరుచరణాల సన్నిధి చేరుకునే భాగ్యాన్ని సంపాదించాడు.

## 25. తిరునీల నక్క నాయనారు

**సి**రి సంపదలతో కూడిన చోళదేశంలో తిరుచ్చందమంగై అనే అందమైన గ్రామం ఉంది. శివభక్తుడుగా ప్రసిద్ధిచెందిన నీలనక్కరు అక్కడ

జీవనం సాగిస్తూ వచ్చాడు. అతడు రోజూ శివుని అర్చిస్తూ శివభక్తులకు సేవలు చేయడమే తన పరమావధిగా కాలం గడుపుతూ ఉండేవాడు.

ఒక పర్యాయం నీలనక్క నాయనారు అయవంది దేవాలయంలో నెలకొని ఉన్న పరమేశ్వరుని సన్నిధికి పూజాద్రవ్యాలు తీసుకొని తన భార్యను వెంట బెట్టుకొని వెళ్లాడు. భక్తితో దేవాలయం ప్రదక్షిణంచేసి స్వామి గర్భగృహాన్ని సమీపించాడు. ఆ సమయంలో ఒక సాలెపురుగు శివలింగంమీద పడగా పక్కనే ఉన్న తిరునీల నక్క నాయనారు భార్య దానిని చూసింది. ఒక తల్లికి తన శిశువుమీద ఎంతటి ప్రేమ ఉంటుందో శివునిమీద అలాంటి ప్రేమ భావాన్ని కలిగిన నీలనక్క నాయనారు భార్య శివునికి ఏదైనా ఆపద సంభవిస్తుందేమోనని భయపడింది. వెంటనే తన నోటితో ఆ సాలెపురుగును ఊదింది. సాలెపురుగు దూరంగా కిందపడిపోయింది కాని ఆమె ఎంగిలి తుంపరలు కూడ శివలింగం మీద పడింది. తిరునీల నక్క నాయనారు తన భార్య కారణంగా శివునిపై ఎంగిలి పడిందని తెలుసుకొని కోపోద్రేకంతో ఆమెను చూసి “ఓ బుద్ధిహీనురాలా! శివాపరాధం చేసిన నిన్ను క్షమించను. నిన్ను పరిత్యజించాను” అని చెప్పి భార్యను అక్కడే వదలిపెట్టి తాను మాత్రం ఇంటికి వెళ్లి పోయాడు.

ఆరోజు రాత్రి కలలో తిరు నీలనక్క నాయనారుకు పరమేశ్వరుడు ప్రత్యక్షమై తన శరీరాన్ని చూపించి “భక్తుడా! నా మీద ప్రేమాభిమానాలతో నీ భార్య నా శరీరంపై ఊదింది. ఆమె ఆ విధంగా ఊదడం వలన ఎంగిలి తుంపరలు పడిన చోటుతప్ప మిగిలిన భాగాల్లో సాలెపురుగు కారణంగా బొబ్బలు లేచాయి. ఇదిగో చూడు” అని చెప్పి భార్య భక్తి భావాన్ని అతనికి తెలియజేశారు. తిరు నీలనక్క నాయనారు నిద్రనుండి మేల్కొని స్వప్న వృత్తాంతాన్ని గుర్తుకు తెచ్చుకున్నాడు. తన భార్య శివభక్తిని తలచుకొని సంతోషంతో పరమేశ్వరుని స్తుతించాడు. సూర్యోదయం కాగానే నాయనారు అయవంది దేవాలయానికి వెళ్లి పరమేశ్వరుని పాదపద్మాలకు సాగిలబడి నమస్కరించారు. తన తప్పును క్షమించమని వేడుకున్నాడు. తన భార్యను సంతోషంగా ఇంటికి పిలుచుకొని వచ్చాడు.



శివభక్తులకు సేవ చేయడమే పరమావధిగా తన జీవితాన్ని గడిపిన తిరు నీలనక్క నాయనారు చివరగా శివ సాయుజ్యాన్ని పొందాడు.

## 26. నమి నంది అడగలు నాయనారు

ప్రసిద్ధ శైవ క్షేత్రమైన తిరువారూరు సమీపంలో పాడి పంటలతో కళ కళలాడుతున్న అందమైన గ్రామం ఒకటుంది. దాని పేరు ఏమప్పేరూరు.

ఆ గ్రామంలోని ఒక బ్రాహ్మణ కుటుంబంలో నమినంది అనే శివభక్తుడు జన్మించాడు. నమినంది రోజూ తిరువారూరు వెళ్లి అక్కడ వెలసిన వల్మీక నాథుని దర్శించి, భక్తితో అర్చించి తరువాత పక్కనే ఉన్న అరనెరి అనే గ్రామంలోని శివాలయానికి వెళ్లేవాడు. అతని హృదయంలో ఆ దేవాలయంలో అసంఖ్యాకములైన దీపాలు వెలిగించాలనే కోరిక కలిగింది. అది సూర్యాస్తమయ సమయం కావడం వలన ఇంటికి వెళ్లి నెయ్యి తీసుకురావడానికి అవకాశం లేక పోయింది. అందువలన తిరువారూరులోని ఒక ఇంటికికెళ్లి శివాలయంలో దీపం వెలిగించడానికి నెయ్యి కావాలని అడిగాడు. ఆ ఇంట్లోనున్న వ్యక్తి జైన మతస్తుడు కావడం వలన “చేతిలో అగ్నిహోత్రుని దాల్చిన శివునికి దీపాలు ఎందుకు? మీరు దీపాలు వెలిగించ దలుచుకుంటే నీళ్లుపోసి దీపాలను వెలిగించండి” అని పరిహాసంగా పలికాడు.

శివునిమీద అచంచల భక్తి ప్రపత్తులు కలిగిన నమినంది చింతాక్రాంతుడై తిరువారూరు దేవాలయానికి వెళ్లాడు. అక్కడి పరమేశ్వరునికి సాష్టాంగ నమస్కారాలు చేశాడు. దీపాలు వెలిగించడానికి నాకు అవకాశం లేకపోయిందని బాధపడ్డాడు. ఆ సమయంలో అతనికి అశరీరవాణి వినిపించింది. “ఓ భక్తుడా! నీ హృదయంలో గూడు కట్టుకోనున్న శోకాన్ని తొలగించుకో. ఈ దేవాలయం సమీపంలో ఒక కొలను ఉంది. అక్కడికి వెళ్లి ఆ కొలని నీటితో దీపాలను వెలిగించు” అనే మాటలు అతని చెవులలో ప్రతిధ్వనించాయి. నమినంది అత్యంత సంతోషంతో ఉబ్బితబ్బియ్యాడు. తరువాత పరిగెత్తుకుంటూ వెళ్లి కొలనునుండి నీటిని తీసుకు వచ్చి దానితో దీపాలను వెలిగించాడు. ఆ దీపాలు ప్రజ్వరిల్లుతూ దశదిశలా ప్రకాశవంతంగా వెలుగులను విరజిమ్మాయి. నమినంది మరింత సంతోషంతో దేవాలయమంతటా దీపాలను వెలిగించాడు.

దీపం వెలిగించడానికి నెయ్యి ఇవ్వమని నిరాకరించిన జైనులకు బుద్ధివచ్చేలా నమినంది నీటితో దీపాలను వెలిగించి పరమేశ్వరుని కృపాకటాక్షాలను వాళ్లకు తెలియజేశాడు.

పరమభక్తుడైన తిరునావుక్కరుసుచే ప్రశంసింపబడి నమినంది జీవితాంతం పరమేశ్వరుని పాదపద్మాలనే ధ్యానిస్తూ మరణానంతరం శివ సాయుజ్యాన్ని పొందాడు.

## 27. తిరుజ్ఞాన సంబంధ నాయనారు

**చో**ళదేశంలోని ఒక ప్రసిద్ధ శైవక్షేత్రం శీర్గాళి. ఆ గ్రామంలో శివపాద హృదయుడు, భగవతి అనే వైదిక దంపతులు శైవాచార నియమ నిష్ఠలతో తమ గృహస్థ జీవితాన్ని ఆనందంగా గడుపుతూ వచ్చారు. ఆ పుణ్య



దంపతులకు తిరువాదిరై (ఆరుద్రా నక్షత్రం) పుణ్యదినాన ఒక కుమారుడు జన్మించాడు. జ్ఞాన శిశువు అవతరించాడనే సంతోషంతో దేవతలు పుష్పవర్షాన్ని కురిపించారు. బాలచంద్రునివలె దిన దిన ప్రవర్ధమాన మవుతూ వచ్చిన తమ కుమారుని అల్లారుముద్దుగా పెంచుతూ వచ్చారు తల్లిదండ్రులు.

ఒక పర్యాయం శివపాద హృదయులు స్నానం చేయడానికి బయలుదేరుతుండగా కుమారుడు తానూ వస్తానని కాళ్లుచేతులూ విదిలిస్తూ ఏడ్చాడు. శివపాద హృదయుడు పిల్లవాడిని ఎత్తుకొని కొలను దగ్గరికి వెళ్లి బిడ్డను కొలను గట్టు దగ్గర వదలి తాను స్నానం చేయడానికై కొలనులో దిగి నీళ్లల్లో మునిగాడు. తండ్రి కనిపించకుండా పోయినందువల్ల పిల్లవాడు కళ్లల్లో నీళ్లు చిప్పిలుతుండగా బిగ్గరగా ఏడ్చాడు. శీర్గాళి పుణ్యక్షేత్రంలో నెలకొని ఉన్న పరమేశ్వరుడు శివగామి సుందరీ సమేతుడై బిడ్డముందు ప్రత్యక్షమయ్యాడు. ఏడుస్తున్న బిడ్డను చూసిన ఉమాదేవి తన వక్షోజాల నుండి స్రవించిన పాలను బంగారు గిన్నెలోకి తీసుకొని దానిలో శివజ్ఞానాన్ని కలిపి బిడ్డచేత తాగించింది. వెంటనే ఆ పిల్లవాడు ఈ సకల చరాచర సృష్టికి కారణభూతుడు పరమేశ్వరుడేనని, సర్వమూ శివమయమేనని తెలియజెప్పే శివతత్వాన్ని ఆమూలాగ్రంగా గ్రహించాడు.

శివపాద హృదయులు కొలనులో నుండి వెలుపలికి వచ్చి పాలు కారుతున్న నోటితో నిలబడి ఉన్న కుమారుని చూశాడు. అతనికి కోపం వచ్చింది. కొడుకును చూసి “ఎవరిచ్చిన ఎంగిలి పాలు తాగావు?” అని అడిగాడు. అప్పుడా బాలుడు కళ్లల్లో నీళ్లు స్రవిస్తుండగా దేవాలయ గోపురాన్ని చూపించాడు. తనకు పాలను ఇచ్చినవారు పార్వతీ పరమేశ్వరులు అనే విషయాన్ని తన తండ్రికి సంకేతరూపంలో తెలియబరిచాడు. జ్ఞాన

సంబంధరు తన తండ్రితో కలసి తనకు దర్శన భాగ్యాన్ని అనుగ్రహించిన పరమేశ్వరుని ఆలయం లోపల ప్రవేశించి మధురమైన తమిళంలో "తోడుడైయ సెవియిన్ విడైయేఱి ఓర్ తూవెణ్మది చూడి" అని ప్రారంభమయ్యే పద్య దశకంతో శివుని స్తుతించాడు. తిరుజ్ఞాన సంబంధరుకు పరమేశ్వరుడు దర్శన భాగ్యాన్ని అనుగ్రహించాడనే విషయం అక్కడున్న వారందరికీ తెలిసింది. పరమేశ్వరుడు ఈ బాలునికి రక్షకుడైనందువలన తిరుజ్ఞాన సంబంధరు 'రక్షకుడు గల బాలుడు' (ఆలుడై పిళ్ళైయార్) అనే పేరుతో ప్రసిద్ధి చెందాడు.

తిరుజ్ఞాన సంబంధరు మహిమాతిశయాలను తిరునీల కంఠ యాళ్ప్పాణరు అనే శివభక్తుడు, అతని భార్య అయిన మతంగ చూడామణి విన్నారు. సంబంధరును దర్శించుకోవాలనే ఆకాంక్షతో వారు శీర్గాళి వచ్చి సంబంధరు పాదపద్మాలకు భక్తితో నమస్కరించారు. ఆ దంపతులను సంబంధరు శివాలయానికి పిలుచుకొని వెళ్లాడు. దంపతులిరువురు శివుని దర్శించి ఆనందంతో, భక్తి పారవశ్యంతో నమస్కరించారు. సంబంధరు వారిని చూసి "మీరు యాళ్ వాయిద్యాన్ని ఆలపించి గానంచేస్తూ శివుని ఆరాధిస్తూ ఇక్కడే ఉండండి" అని కోరాడు. యాళ్ పాణరు కూడ దానికి సమ్మతించాడు. అప్పటినుండి తిరుజ్ఞాన సంబంధరు రచించిన పద్య దశకాలను యాళ్ పాణరు తన యాళ్ వాయిద్యాన్ని వాయించి పాడి భక్తులను పరవశులను చేస్తూ వచ్చాడు.

ఒక పర్యాయం తిరుజ్ఞాన సంబంధరు శిష్యబృందం వెంటరాగా తీర్థయాత్రలకు బయలుదేరారు. వారు శివాలయాలను దర్శించుకుంటూ కావేరినదికి ఉత్తరదిగ్భాగంలోని తిరుపాచ్చిలాశ్రమానికి చేరుకున్నారు. ఆ నగరానికి రాజైన కొల్లిమళవన్ కుమార్తె మూర్ఛవ్యాధితో చాలాకాలంగా



బాధపడుతూ ఉంది. ఆమె వ్యాధిని వైద్యులు ఏవిధంగానూ పోగొట్టలేకపోయారు. తిరుజ్ఞాన సంబంధరు తన నగరానికి వచ్చిన వార్తను విని కొల్లిమళవన్ ఆయనను దర్శించుకొని తన కుమార్తెను రోగ విముక్తురాలిని చేయమని ప్రార్థించారు. సంబంధరు "తుణివళర్ తింగళ్..." అనే పద్య దశకంతో పరమేశ్వరుని స్తుతించగా రాజ కుమార్తె మూర్ఛవ్యాధి తొలగిపోయింది. ఈ అద్భుతాన్ని చూసిన అక్కడి భక్తులందరూ ఆనందాశ్చర్యాలతో సంబంధరుని ప్రస్తుతించారు.

ఆ రోజుల్లో పాండ్య దేశమంతటా జైనులు శివాలయాలను జైన మతాలుగా మార్చి ప్రజలచే బలవంతంగా జైనమతాన్ని అవలంబింపజేస్తూ వచ్చారు. పాండ్యరాజు పట్టమహిషి మంగయర్క్కరసి, ప్రధానమంత్రి కులచ్చిరైయారు మాత్రం శైవమతావలంబకులై రహస్యంగా పరమేశ్వరుని ఆరాధిస్తూవచ్చారు. శైవమతాన్ని ప్రవర్ధమానం చేయడానికై అవతరించిన తిరుజ్ఞాన సంబంధరు పక్కనే ఉన్న తిరుమరైకాట్టిల్ అనే పవిత్ర శైవ క్షేత్రంలో ఉన్నారనే వార్తను తెలుసుకొని వారు సంబంధరును పాండ్యదేశానికి విచ్చేయమని, జైనమతాన్ని పారదోలి శైవమతాన్ని ఉద్ధరించమని కోరుతూ విశ్వసనీయులైన తమ సేవకులను పంపించారు. వారి కోరికను మన్నించి సంబంధరు తమ శిష్య పరివారంతో ముత్యాల పల్లకిని అధిరోహించి పాండ్య దేశ రాజధాని మదురై నగరంలో ప్రవేశించాడు. ఆకాశాన్ని తాకే గోపురాలతో, ధ్వజ పతాకాలతో విరాజిల్లే సుందరేశ్వరుని ఆలయానికి వెళ్లి స్వామి సన్నిధిలో సాగిలబడి నమస్కరించాడు. సంబంధరు నగరంలో ప్రవేశించగానే జైనులకు అసంఖ్యాకములైన దుశ్శకునాలు కనిపించాయి. వాళ్లందరూ కలసి పాండ్యరాజు ఆస్థానానికి వెళ్లి "మహారాజా! మన మతాన్ని నాశనం చేయాలని శీర్గాళి నుండి ఒక శైవుడు వచ్చాడు. మీరు అతన్ని

నగరం నుండి బహిష్కరించండి" అని చెప్పి అంతటితో ఆగక సంబంధరు బసచేసి ఉన్న శైవమఠానికి నిప్పు పెట్టారు. పరమేశ్వరుని కరుణా కటాక్షాలతో మఠమంతటా వ్యాపించిన మంటలు వెంటనే నిలిచిపోయాయి. తిరుజ్ఞాన సంబంధరు తన భక్తులకు ఏర్పడిన కష్టాలను తలచుకొని "పైయవే సెన్రు పాండయఱ్ కాగవే..." అనే పద్య దశకాన్ని పాడి "జైనుల మఠానికి పెట్టిన అగ్ని రోగ రూపంలో పాండ్యరాజును బాధించనీ" అని ఆజ్ఞాపించాడు. వెంటనే రాజుగారికి ఉష్ణజ్వరం సోకింది. వైద్యులు చికిత్స చేసినప్పటికీ తగ్గక అది ఉగ్రరూపం దాల్చింది. అప్పుడు పట్టమహిషి మంగయర్ కరసి భర్తను సమీపించి "సంబంధరు అనుగ్రహించినట్లయితే ఈ రోగం తొలగిపోతుంది. కాబట్టి వారిని ఇక్కడికి ఆహ్వానించండి" అని ప్రార్థించింది. రాజుగారు రాణి మాటలకు సమ్మతించారు. తిరుజ్ఞాన సంబంధరును సగౌరవంగా అంతఃపురానికి పిలుచుకు రమ్మని రాజుగారు ఆనతి ఇచ్చారు. తిరుజ్ఞాన సంబంధరును చూడగానే రాజుగారికి ఉష్ణజ్వరం కొంత ఉపశమించింది.

సంబంధరును చూడగానే అక్కడున్న జైనులందరూ ఒక్కుమ్మడిగా లేచి తమతో వాదుకు పిలిచారు. బాలుడైన తిరుజ్ఞాన సంబంధరుకు జైనులు ఏదైనా అపకారం చేస్తారేమోనని రాణి భయపడింది. పాండ్యరాజు సంబంధరును, జైనులను చూసి "మీలో ఎవరు నా వ్యాధిని నయం చేయగలుగుతారో వారు వాదంలో జయించిన వారు" అని ప్రకటించాడు. జైనులు రాజుగారి శరీరం ఎడమవైపు ఉష్ణజ్వరాన్ని పోగొట్టడానికి మంత్రాలు చదువుతూ నెమలి పింఛంతో తడుమగా నొప్పి తగ్గడానికి బదులు మరింత అధికమైంది. బాధను సహించలేక రాజుగారు సంబంధరు వైపు చూశారు. వెంటనే తిరుజ్ఞాన సంబంధరు ఈ వ్యాధికి మందు, మంత్రము విభూతియేనని చెప్పి "మంతిరమావదు నీఱు, వానవర్ మేనదు నీఱు"



అని ప్రారంభమయ్యే పద్య దశకాన్ని ఆలపించి రాజుగారి శరీరం కుడిభాగానికి విభూతిని పూశాడు. ఉష్ణజ్వరం పూర్తిగా తగ్గిపోయి నిండైన మడుగువలె చల్లబడింది. జైనులు నెమలి పింఛంతో తడిమిన ఎడమ భాగంలో మాత్రం ఉష్ణజ్వరం పూర్వం కన్నా అధికమైంది. రాజుగారు ఆశ్చర్య చకితులై జైనులను కనుగొని "మీరు వాదంలో ఓడిపోయారు. ఇక నాముందు నిలబడకండి" అని ఆదేశించి సంబంధరుతో "స్వామీ నా రోగాన్ని పూర్తిగా నయం చేయండి" అని ప్రార్థించాడు. సంబంధరు విభూతిని తీసుకొని రాజుగారి శరీరం ఎడమ భాగానికి పూయగా ఉష్ణజ్వరం పూర్తిగా అదృశ్యమైంది.

తిరుజ్ఞాన సంబంధరు జైనులను పిలిచి మీ మతంలోని ముఖ్యమైన అంశాలను చెప్పండి అని కోరారు. ఆ మాటలకు జైనులు "మా మతంలోని ముఖ్యాంశాలను నోటితో చెప్పి వాదించడం వలన ఫలితంలేదు. మేము మా మత సిద్ధాంతాలను, మీరు మీ మత సిద్ధాంతాలను తాటాకుల మీద రాసి వాటిని మండుతున్న అగ్నిలో వేద్దాము. ఎవరు వేసిన తాటాకులు అగ్నికి ఆహుతి కాకుండా నిలుస్తాయో వారి మతమే జయించినట్లు" అని వీరావేశంతో చెప్పారు. సంబంధరు వాళ్ల మాటలకు అంగీకరించాడు. రాజుగారి ఆజ్ఞ ప్రకారం అగ్నిని ప్రజర్విల్ల జేశారు. సంబంధరు తేవారంలోని "తళిరిళ వళరొళి..." అని ప్రారంభమయ్యే పద్య దశకాన్ని భక్తితో గానంచేసి శివుని హృదయంలో నిలుపుకొని తనచేతిలోని తిరునళ్లారు పదిగం తాటాకులను అగ్నిగుండంలో విడిచారు. ఆ తాటాకులు కాలిపోలేదు. అంతేకాదు తన పసిమిని కూడ కోల్పోక వేసినది వేసినట్టే ఉండినది. జైనులు తాటాకులలో ఉన్న తమ మతగ్రంథాన్ని ఒకదానిని తీసి అగ్ని గుండంలో వేయగా అది నిప్పు సోకిన దూదివలె వెంటనే మాడి భస్మమైంది.

దీనిని చూసి పాండ్యరాజు, అక్కడ గుమికూడిన ప్రజలందరూ ఆశ్చర్య పరవశులయ్యారు. ఈ విధంగా శివుడు తప్ప వేరే దైవంలేదని పాండ్యరాజుకు, దేశంలోని ప్రజలకు నిరూపించి రాజ్యమంతటా శైవమతం నెలకొనేలా చేశాడు. తిరుజ్ఞాన సంబంధరు.

శివ హృదయుడు తన కుమారుడైన తిరుజ్ఞాన సంబంధరుకు పెళ్లీడు వచ్చినదని గ్రహించాడు. తిరుపెరు మణ నల్లూరులోని నంబాండర్ నంబి కుమార్తె సంబంధరుకు తగిన కన్య అని పెద్దలు తీర్మానించారు. వివాహ ముహూర్తం నిశ్చయింపబడింది. బంధుమిత్రులు శిష్య పరివారం వెంటరాగా సంబంధరు తిరుపెరు మణ నల్లూరుకు వెళ్లాడు. పెళ్లికొడుకు వేషంలో సంబంధరు కన్నుల పండుగగా దర్శనమిచ్చాడు. నూతన వధూవరుల హస్తాలకు కంకణాలను కట్టి తిరునీల నక్క నాయనారు పురోహితులుగా వివాహ తంతువును జరిపించడానికి సంతోషంగా ఆయత్తమయ్యారు. దంపతులిరువురూ పవిత్రమైన అగ్నికి ప్రదక్షిణం చేశారు. అప్పుడు సంబంధరు "అయ్యో గృహస్థ జీవితం నన్ను చుట్టుముట్టింది. ఈమెతో కలసి నేను పరమేశ్వరుని పాద పద్మాలను చేరుకుంటాను" అని తన హృదయంలో తలచుకొన్నారు. అప్పుడు పరమేశ్వరుడు ప్రత్యక్షమై నీవు నీ భార్యతో, ఈ పెళ్లికి వచ్చిన వారందరితో కలసి నా కరుణయనే మహాజ్యోతిలో లీనం కాగలరు" అని వారిని అనుగ్రహించాడు. ఆ విధంగా సంబంధరు భార్యతో, బంధుమిత్రాదులతో, శిష్య పరివారంతో ఆ మహాజ్యోతిలో లీనమయ్యారు.

## 28. ఏయర్‌కోన్ కలిక్కామ నాయనారు

'ఏయర్' అనే కర్షక వంశానికి చెందిన శివ భక్తుడు కలిక్కామ నాయనారు. సంపద్భరితమైన చోళ మండలంలోని తిరుప్పెరు మంగళంలో



సదా శివధ్యాన తత్పరుడై అతడు నివసిస్తూ ఉండేవాడు. కలిక్కామ నాయనారుకు సమకాలికుడు సుందరమూర్తి నాయనారు.

పరమేశ్వరుడు సుందరుల కోసం దౌత్యం నిర్వహించాడనే విషయాన్ని విన్న కలిక్కామ నాయనారుకు సుందరమూర్తి నాయనారుపై కోపం వచ్చింది. పరమేశ్వరుని లీలా విశేషాలను కలిక్కామ నాయనారు అర్థం చేసుకోలేక పోయాడు. కలిక్కాయ నాయనారు అపోహ పోగొట్టడానికి శివుడు ఒక లీలా నాటకాన్ని జరిపించాడు.

శివుని లీలా విలాస కారణంగా కలిక్కామరుకు తీవ్రమైన కడుపునొప్పి వచ్చింది. వైద్యులెంత ప్రయత్నించి నప్పటికీ వ్యాధి తగ్గుముఖం పట్టలేదు. బాధను ఓర్చుకోలేక అతడు పరమేశ్వరుని ప్రార్థించాడు. శివుడు ప్రత్యక్షమై "భక్తుడా! నిన్ను బాధించే ఈ శూలవ్యాధిని నా భక్తుడైన సుందరులు మాత్రమే పోగొట్టగలరు" అని చెప్పాడు. కలిక్కామరు శివుడితో "స్వామీ! తరతరాలుగా మేమందరమూ నీకు భక్తులుగా నిన్ను సేవించుకుంటూ వచ్చాము. నీ భక్తుడైన సుందరుడా ఈ వ్యాధిని నయం చేయగలడు? అతనిచే ఈ వ్యాధి నివారింపబడడం కన్న ఈ వ్యాధితో నేను మరణించడమే మంచిది" అని కచ్చితంగా చెప్పాడు. శివుడు అక్కడి నుండి అదృశ్యమై సుందరుల ముందు ప్రత్యక్షమయ్యాడు "నా భక్తుడైన కలిక్కామరు శూలవ్యాధితో బాధపడుతున్నాడు. నీవు వెళ్లి ఆ వ్యాధిని నయం చేయవలసింది" అని చెప్పాడు. సుందరులు సంతోషంతో కలిక్కామరు దగ్గరికి ప్రయాణమయ్యాడు. తనకు వచ్చిన శూలవ్యాధి సుందరుల వలన నయమవుతుందనే వార్త విని కలిక్కామరు మరింత విచారంలో మునిగిపోయాడు. "పరమేశ్వరునిచే పనులు చేయించుకొన్న సుందరులా నా వ్యాధిని నయం చేయడానికి వస్తున్నది?" అని బాధపడ్డాడు. వారు

రావడానికి పూర్వమే ఈ శూలవ్యాధిని కడుపుతో సహా చీల్చివేస్తాను అని చెప్పి తన కడుపును చీల్చుకున్నాడు. శూలవ్యాధితో పాటు ప్రాణాలు కూడ అతని శరీరాన్ని వీడి తొలగిపోయింది. సుందరులు ఈ విపరీతాన్ని చూసి "అయ్యో ఎంతటి విపత్తు సంభవించింది. నేను కూడ అతనిలాగానే నా ప్రాణాలను పోగొట్టుకుంటాను" అని చెప్పి అక్కడున్న కత్తితో తన కడుపును చీల్చుకోబోయాడు. పరమేశ్వరుని అనుగ్రహంతో వెంటనే కలిక్కామరు ప్రాణాలతో లేచి నిలబడ్డాడు. సుందరులు కలిక్కామరుల పాదాల మీద భక్తితో వాలగా కలిక్కామరులు కూడ సుందరుల పాద పద్మాలకు భక్తితో నమస్కరించాడు. కలిక్కామరు ప్రశాంత జీవితాన్ని గడిపి అవసానదశలో పరమేశ్వరుని పాదపద్మాలను చేరుకున్నాడు.

## 29. తిరుమూల నాయనారు

**కై**లాసంలో నందీశ్వరుని వద్ద ఉపదేశం పొందిన సుందరుడనే మహాభక్తుడు ఉండేవాడు. నంది దేవునిచే 'నాథర్' అని పిలువబడిన వాడితడు. తిరుమూలర్ అనే పేరుతో లోకంలో ప్రసిద్ధి చెందిన శివ భక్తుడితడు. అణిమాది అష్టసిద్ధులను కైవశం చేసుకొన్న యోగి పుంగవుడు తిరుమూలర్.

పొదిగై పర్వతంలో నివసిస్తున్న అగస్త్య మహర్షితో కలసి ఉందామనే కోరికతో తిరుమూలర్ పొదిగైమలైకు బయలుదేరాడు. చిదంబరం మొదలైన శివాలయాలను దర్శించుకుంటూ కావేరీ నదీ తీరం చేరుకున్నాడు. అక్కడ ఒకచోట పశువులన్నీ మేత మేయక గుమికూడి కన్నీరు విడుస్తూ దుః ఖిస్తుండడం చూశాడు. దీనికి కారణమేమిటని ఆలోచించాడు.

సాత్తనూరు అనే గ్రామంలో ఒక గొల్లవాడుండేవాడు. అతని పేరు మూలన్. అతడు పశువులను మేపుతుండేవాడు. అతడు పశువులను తన



ప్రాణంకంటె మిన్నగ భావించి ప్రేమతో రక్షిస్తూ వచ్చాడు. ఒకరోజు అతడు పాముకాటుచే మరణించాడు. అందువలన పశువులన్నీ అతని కళేబరం చుట్టూ నిలబడి కన్నీటి వర్షాన్ని కురిపించాయి. ఈ దృశ్యాన్ని చూసిన తిరుమూలర్ హృదయం కరిగిపోయింది. వెంటనే అతడు పరమేశ్వరాను గ్రహంచే పశువుల దుఃఖాన్ని నేను నివృత్తి చేస్తాను. ఇతడు పునర్జీవితాన్ని పొందితేగాని పశువుల దుఃఖము తొలగిపోదు అని భావించాడు.

తిరుమూలర్ తన శరీరం నుండి ప్రాణాలను వేరు చేశాడు. శరీరాన్ని ఒకచోట భద్రపరచి తాను నేర్చుకొన్న యోగ విద్యాబలంచే తన ప్రాణాలను చనిపోయిన గొల్లవాడి శరీరంలో ప్రవేశపెట్టాడు. చనిపోయిన గొల్లవాడి శరీరాకృతిలో తిరుమూలర్ పైకి లేచాడు. గొల్లవాడు ప్రాణాలతో పైకి లేవడాన్ని చూసి పశువులన్నీ చాలా సంతోషించాయి. వాటిని మంచి పచ్చిక బయళ్లలో మేయడానికి విడిచాడు. మధురమైన కావేరీ జలాలను తాగించాడు.

సాయంత్రం కాగానే పశువులు తమ దూడలను తలచుకుని ఇంటిముఖం పట్టాయి. తిరుమూలర్ కూడ వాటిని వెన్నంటి వెళ్లాడు. మూలని భార్య తన భర్త ఇంకా ఇంటికి రాలేదని అతన్ని వెతుక్కుంటూ వెళ్లి పశువుల వెంట వస్తున్న తన భర్తను చూసింది. అతడున్న ధోరణి గమనించి అతనికి ఏదైనా కీడు జరిగిందేమోనని భయపడింది. అతన్ని పట్టుకొని తన ఇంటికి బలవంతంగా తీసుకు వచ్చింది. అతడు యోగాసనంలో కూర్చుండి పోయాడు. తన భర్త పరిస్థితిని గురించి ఊళ్లో వాళ్లకు తెలియజేసింది. తిరుమూలర్ విచిత్ర ధోరణిని గమనించిన ఊరిపెద్దలు "ఇది పిచ్చిగాని మైకంగాని కాదు. ఇతనికి ప్రపంచ వ్యామోహం ఏమీ లేదు. ఇతడు శివయోగంలో లీనమై ఉన్నాడు. ఇతడు సంసార

బంధాలన్నింటినీ వదలుకొన్న జ్ఞాని" అని చెప్పారు. మూలని భార్య వెక్కి వెక్కి ఏడ్చింది. అక్కడున్న వారు ఆమెను ఓదార్చి వెళ్లిపోయారు.

తిరుమూలర్ భగవద్ధ్యానం చేస్తూ తిరువావడుతురై పవిత్రక్షేత్రం చేరుకుని స్వామిని దర్శించు కొన్నాడు. దేవాలయం పక్కనే ఉన్న అశ్వత్థ వృక్షం కింద ఆసీనులై యోగనిష్ఠలో కాలం గడిపాడు. సంవత్సరానికొక పద్యం వంతున మూడువేల సంవత్సరాలకు మూడువేల పద్యాలను రచించాడు. ఇది 'తిరు మంత్రము' అనే పేరుతో ప్రసిద్ధి చెందింది. తన మనసులో సదా పరమేశ్వరుని ధ్యానిస్తూ వచ్చిన తిరుమూలర్ చివరగా శివునిలో ఐక్యమయ్యాడు.

## 30. దండి యడిగళ్ నాయనారు

ప్రసిద్ధి చెందిన తిరువారూరు పవిత్రక్షేత్రంలో దండియడిగళ్ అవతరించాడు. అతను పుట్టుకతోనే అంధుడుగా ఉన్నప్పటికీ జ్ఞానదృష్టి సముపేతుడై భగవంతుని దర్శించుకొని ఆనందిస్తూ ఉండేవాడు.

ఆలయానికి పశ్చిమ దిగ్భాగంలో కమలాలయం అనే ఒక కొలను ఉంది. ఆ కొలను చుట్టూ జైనులు బసదులు ఏర్పరచుకొని తటాకాన్ని పూడ్చి వేస్తుండడాన్ని ఇతరులు చెబుతుండగా దండియడిగళు విన్నాడు. కమలాలయం తటాకాన్ని పూర్వంలాగ విశాలం చేయాలని అనుకున్నాడు.

దండి యడిగళుకు కళ్లు లేనందున తటాకం పైభాగాన ఒక స్థంబాన్ని నాటాడు. తటాకంలో ఒక స్థంభాన్ని నాటాడు. ఈ రెండు స్థంభాలను ఒక బలమైన తాడుతో బిగించాడు. ఆ తాడు పట్టుకొని దండియడిగళు తటాకంలో దిగి మట్టిని తవ్వేవాడు. దారాన్ని పట్టుకొని పైకి వెళ్లి తవ్విన మట్టిని గట్టున పోస్తూ వచ్చాడు. దండియడిగళు చేస్తున్న పనిని చూసి



జైనులు సహించలేక అతను చేసున్న పనికి ఆటంకం కలిగించాలని ప్రయత్నించారు. "నీవు గుడ్డివాడివే కాదు మా మాటలను వినకపోవడం వలన నీకు వినికిడి శక్తి కూడ లేనట్లు తెలుస్తున్నది" అని పరిహాసం చేశారు. ఆ మాటలకు దండియడిగళు "నేను పరమేశ్వరుని తిరు చరణాలను తప్ప వేరేదీ చూడను. మీరు గుడ్డివాళ్లయి నా కళ్లకు చూపువస్తే మీరు ఏం చేస్తారు?" అని జైనులను ప్రశ్నించాడు. ఆ మాటలకు జైనులు "మీ దేవుని అనుగ్రహంతో నీ కళ్లు చూసే శక్తిని పొందినట్లయితే మేమందరం ఈ ఊరు వదలి వెళ్లిపోతాము" అని చెప్పి అతని చేతిలో నున్న మట్టిని తవ్వే పారను లాక్కున్నారు.

దండి యడిగళు తీవ్రమైన శోక సముద్రంలో మునిగి పోయాడు. అతను దేవాలయానికి వెళ్లి "స్వామీ! నన్ను జైనులు అవమానం చేశారు. ఇది నాకు తీరని వేదన కలిగించింది. నా వేదనను పోగొట్టి నన్ను అనుగ్రహించండి" అని ప్రార్థించాడు. అతడు ఆ రాత్రి పూర్తిగా నిద్రపోలేదు. తెల్లవారుజామున దండియడిగళుకు స్వప్నంలో పరమేశ్వరుడు ప్రత్యక్షమై "భక్తుడా! బాధపడకు, నీ కన్నులకు చూసే శక్తి కలుగుతుంది. జైనులు నశిస్తారు. నీవు భయపడకు" అని ధైర్యం చెప్పాడు. అదే సమయంలో ఆ దేశపు రాజుగారికి కూడ కలలో ప్రత్యక్షమై "దండియడిగళు మన కోసం తటాకాన్ని తవ్వుతున్నాడు. అతను చేస్తున్న పనికి జైనులు అడ్డం వస్తున్నారు. నీవు వెళ్లి దండియడిగళు హృదయంలోని కోరికను తీర్చు" అని ఆజ్ఞాపించి అంతర్థాన మయ్యాడు.

సూర్యోదయం కాగానే రాజుగారు దండియడిగళు దగ్గరికి వెళ్లి జరిగిన వృత్తాంతమంతా తెలుసుకున్నారు. రాజు జైనులను ఆహ్వానించాడు. "దండియడిగళు కన్నులు చూసే శక్తిని పొందినట్లయితే ఈ ఊరు వదలి

వెళ్లిపోతామని మీరు చెప్పిన మాటలు సత్యమేనా?” అని ప్రశ్నించాడు. జైనులా మాటలకు ‘అవును’ అని సమాధాన మిచ్చారు. దండియడిగళు, జైనులు, రాజుగారు అందరూ కలసి తటాకం దగ్గరకు వచ్చారు. రాజుగారు దండియడిగళును చూసి “మహానుభావా! భగవదనుగ్రహంతో మీ కళ్లు చూసే శక్తిని పొందడం మేమందరం చూడాలి. మాకా అద్భుతాన్ని చూపించు” అని ప్రార్థించారు. దండి యడిగళు చేతులు మోడ్చి భక్తితో నేను పరమేశ్వరునికి నిజమైన భక్తుడను అయినట్లయితే నా కళ్లకు చూసేశక్తి కలగాలి. జైనులు చూసేశక్తిని కోల్పోవాలి. నిజమైన మతము శైవమతమే” అని చెప్పి పంచాక్షరీ మంత్రాన్ని జపిస్తూ కమలాలయంలో మునిగాడు.

ఏమి అద్భుతం! పద్మాల వంటి విశాలమైన కన్నులు విరాజిల్లుతుండగా దండియడిగళు కొలనులో నుండి పైకి లేచాడు. జైనులు చూపులను కోల్పోయి తడబడసాగారు. రాజుగారు దీనిని చూసి “కీడు చేయాలని తలపెట్టిన జైనం నశించిపోయింది. ఈ జైనులు మన కళ్లకు కనిపించకుండా ఉండేలాగ వీరిని దూరంగా తరిమి కొట్టండి” అని ఆజ్ఞాపించాడు. అంతేగాక జైన బసదులను, మఠాలను నేలమట్టంగావించి కమలాలయాన్ని విస్తరింపజేశాడు. దండి యడిగళు ఆనందంతో ఉప్పొంగిపోయాడు. పరమేశ్వరుని సేవిస్తూ పంచాక్షరి మంత్రాన్ని పఠిస్తూ చివరికి స్వామి తిరుచరణాలను చేరుకున్నాడు.

## 31. మూర్ఖ నాయనారు

సకల సంపదలకు ఆలవాలమైన తిరువేర్కాడు అనే గ్రామంలో మూర్ఖ నాయనారు జన్మించాడు. మూర్ఖ నాయనారు గొప్ప శివభక్తుడు. శివభక్తులకు ఆహారం సమర్పించి ఆనందంతో కూడిన వారి ముఖారవిందాలను చూసిన తరువాతనే తాను ఆహారాన్ని స్వీకరించే నియమాన్ని కలిగి ఉండేవాడు.



శివభక్తులు ఏది అడిగినా లేదనకుండా ఇస్తుండేవాడు. మూర్ఖ నాయనారు తన పంటపొలాలను, ఇంటిని, సకల వస్తువులను విక్రయించి ఆ డబ్బుతో శివభక్తులకు ఆహారాన్ని సమకూరుస్తూ వచ్చాడు. కొంతకాలానికి అతని వద్ద చిల్లిగవ్వ కూడ లేకపోయింది.

మూర్ఖ నాయనారు జూదంలో నేర్పరి. అందువలన జూదమాడి ధనాన్ని సంపాదించి దానితో శివభక్తులకు ఆహారాన్ని సమర్పిస్తూ వచ్చాడు. కొంత కాలానికి మూర్ఖ నాయనారుతో జూదమాడ్డానికి ఎవరూ ముందుకు రాలేదు. అతడే ఎప్పుడూ గెలుపొందుతూ ఉండడం వలన ఎవరు మాత్రం అతనితో జూదమాడ్డానికి వస్తారు?

మూర్ఖ నాయనారు ఆ ఊరు వదలి ప్రసిద్ధ శివాలయాలు ఉన్న ఊర్లకు వెళ్లి అక్కడి వారితో జూదమాడి గెలిచిన డబ్బుతో శివభక్తులకు ఆహారాన్ని సమకూరుస్తూ వచ్చాడు.

జూదంలో ఓడిపోయిన వాళ్లు డబ్బు ఇవ్వకపోతే మూర్ఖ నాయనారు తన కరవాలంతో వారిని ఖండించేవాడు. అందువలన అతన్ని ‘మంచి జూదగాడు’ అనీ, ‘మూర్ఖుడు’ అనీ ఆ గ్రామ ప్రజలు పిలవడం ప్రారంభించారు. జూదం వలన వచ్చే డబ్బు దోష పూరితమైంది కాబట్టి మూర్ఖ నాయనారు తన చేతులతో దానిని తాకేవాడు కాదు. వంట చేసే వాళ్లనే ఆ డబ్బు తీసుకోమని చెప్పి దానితో వంటకాలను తయారుచేయించి శివభక్తులకు సమర్పించేవాడు. భక్తులు తిన్న తరువాత చివర బంతిలో మూర్ఖ నాయనారు కూర్చుని అన్నం తినేవాడు. ఆ విధంగా పెక్కు సంవత్సరాలు స్వామికి కైంకర్యం చేసి మూర్ఖ నాయనారు శివలోక సాయుజ్యాన్ని పొందారు.

## 32. సోమాసి మార నాయనారు

**తి**రు వంబర్ అనే పవిత్ర క్షేత్రంలో ఒక బ్రాహ్మణ కుటుంబంలో సోమాసి నాయనారు జన్మించాడు. అతని చిన్నప్పటి పేరు మారన్. వేద విధి ప్రకారం శైవయాగాలను చేసే బ్రాహ్మణోత్తముని సోమయాజి అని గౌరవంగా వ్యవహరిస్తారు. మారన్ పెక్కు యజ్ఞ యాగాదులను చేయడం వలన అతను సోమాసి మారన్ అని పిలువబడ్డాడు.

అతను శివభక్తులకు సంతృప్తిగా అన్నపానీయాలను ఇచ్చి సంతోషించే స్వభావం గలవాడు. తిరువారూరు వెళ్లి సుందరమూర్తి నాయనారును దర్శించి అతని ప్రేమాభిమానాలకు పాత్రుడైనాడు. సుందరమూర్తి నాయనారు పాదపద్మాల సేవచేస్తూ శివ సాయుజ్యాన్ని పొందిన మహాభక్తుడితడు.

## 33. సాక్కియ నాయనారు

**తి**రుచ్చంగ మంగై అనే పుణ్యక్షేత్రంలో శివభక్తుడైన సాక్కియ నాయనారు జన్మించాడు. అచిర కాలంలోనే అన్ని విద్యలూ అవలీలగా నేర్చుకున్నాడు. తత్ఫలితంగా అన్యప్రాణుల పట్ల ప్రేమను, దయను కలిగి ఉండేవాడు. "ఇక జన్మ అంటూ మళ్లీ పుట్టకూడదు. ఈ జన్మలోనే భవబంధాలను తెంచుకోవాలి" అని సాక్కియారు తన మనసులో దృఢంగా నిశ్చయించు కొన్నాడు.

కొంత కాలమైన తరువాత సాక్కియారు కంచి నగరానికి వెళ్లి అక్కడ బౌద్ధ మతం స్వీకరించాడు. శివుని పూజించడమే భవ రోగానికి మందు అనే జ్ఞానోదయం అతనికి కలిగింది. శివుడొక్కడే నిజమైన దైవం. ఏ దశలో ఉన్నప్పటికీ, ఏ వేషాన్ని ధరించినప్పటికీ పరమేశ్వరుని తిరు చరణాలను ఆశ్రయించిన వాళ్లు సాయుజ్యాన్ని పొందగలరు అని



సాక్కియారు గ్రహించాడు. శివలింగాన్ని దర్శించిన తరువాతనే భోజనం చేయాలనే నియమాన్ని అతడు కలిగి ఉండేవాడు. ఒక పర్యాయం అతడు ఒక బహిరంగ ప్రదేశంలో శివలింగాన్ని చూశాడు. ప్రేమ, ఆశ్చర్యం, సంతోషం ముప్పిరిగొనగా సంభ్రమంతో ఏం చేయాలో తెలియక పక్కనే ఉన్న ఒక రాయిని తీసుకొని శివలింగం మీద విసరి వేశాడు.

పరమేశ్వరుడు సంతోషించాడు. మరురోజు యథాప్రకారం సాక్కియ నాయనారు శివలింగం దగ్గరికి వచ్చాడు. ముందు రోజు చేసినట్లుగా తన హృదయంలో పొదమిన ఆనందంతో శివలింగంపై ఒక రాయిని తీసుకుని విసరి వేశాడు. ఈ విధంగా ప్రతిరోజూ వెళ్లి శివలింగంపై రాయిని వేస్తూ వచ్చాడు సాక్కియారు. భగవంతుడు దానిని భక్తితో చేసిన అర్చనా పుష్పంగా భావించి స్వీకరించాడు.

ఒకరోజు సాక్కియ నాయనారు భోజనం చేయడానికి కూర్చున్నాడు. ఆ సమయంలో "అయ్యో! ఈరోజు పరమేశ్వరునిపై రాయి విసరకుండా భోజనానికి కూర్చున్నామే" అని వేగంగా లేచి శివలింగం దగ్గరికి పరువులు తీశాడు. అక్కడున్న ఒక రాయిని తీసుకొని శివుని మీద విసరి వేశాడు.

పరమేశ్వరుడు తన భక్తుడైన సాక్కియ నాయనారుకు శివలోక పదవిని అనుగ్రహించాడు.

## 34. సిరప్పులి నాయనారు

**సం**పద్భరితమైన చోళ దేశంలో తిరువాక్కరు అనే గ్రామంలో ఒక బ్రాహ్మణ కుటుంబంలో సిరప్పులి నాయనారు అనే శివభక్తుడు జన్మించాడు. 'లేదు' అని వచ్చిన వాళ్లకు లేదనకుండా ఇచ్చే ఉదార స్వభావంగల వాడు సిరప్పులియారు.

తన దగ్గరికి వచ్చిన శివభక్తులను మృదు మధురమైన మాటలతో సంతోషంగా ఆహ్వానించి, షడ్రసోపేతమైన వంటకాలను తయారుచేసి ప్రీతిగా వారికి వడ్డించేవాడు. వారు కోరిన పదార్థాలను లేదనకుండా ఇస్తూ వచ్చాడు. జీవితాంతం పంచాక్షరి మంత్రాన్ని జపం చేస్తూ చివరగా పరమేశ్వరుని తిరు చరణాల సన్నిధిని చేరుకున్నాడు.

## 35. చిరు తొండ నాయనారు

**కా**వేరి నదీ జలాలచే పవిత్రమైన చోళ దేశంలో సంపద్భరితమైన తిరుచ్చెంగాట్టంగుడి అనే గ్రామం ఉంది. ఆ గ్రామంలో పరంజ్యోతియార్ అనే శివభక్తుడు జన్మించాడు. అతడు తన భార్య అయిన తిరువెణ్‌గాట్టు నంగైతో కలసి శివభక్తులకు సేవచేయడమే పరమావధిగా సేవలు చేస్తూ వచ్చాడు. శివభక్తులు భోజనం చేసిన తరువాతనే తాము భోజనం చేయాలనే వ్రతాన్ని పూని దానిని రోజూ అనుసరిస్తూ వచ్చాడు. శివభక్తుల ముందు తనను ఒక చిన్నవాడిగా, సామాన్యుడుగా భావించి వారికి పరిచర్యలు చేస్తూ రావడం వలన అతనికి చిరు తొండర్ (చిన్న భక్తుడు) అనే పేరు లోకంలో ప్రసిద్ధమైంది.

ఈ విధంగా భక్తులసేవలో కాలంగడుపుతుండగా అతనికి ఒక కుమారుడు కలిగాడు. అతనికి సీరాళ దేవుడనే పేరుపెట్టి అల్లారు ముద్దుగా పెంచుతూ వచ్చాడు.

కైలాసవాసి అయిన పరమేశ్వరుడు చిరుతొండని భక్తిని పరీక్షించి అతనిని తన కరుణా కటాక్షాలతో అనుగ్రహించ దలచుకొన్నాడు. అందువలన ఒక భైరవయోగి వేషాన్ని ధరించి తిరు చెంగాట్టు గుడి గ్రామానికి వచ్చాడు. చిరుత్తొండరు ఇంటి ముంగిటి ముందు నిలబడి "శివభక్తులకు లేదనకుండా ఆహారాన్నిసమర్పించే చిరుత్తొండరు ఉన్నారా?" అని ప్రశ్నించాడు. తిరుతొండ నాయనారు భార్య తిరువెణ్ గాట్టు నాచ్చియారు ఇంటిలోపలినుండి వెలుపలికి వచ్చి "స్వామీ! నా భర్త శివభక్తులకు ఆహారాన్ని సమర్పించిన తరువాతనే ఆహారాన్ని స్వీకరించే నియమాన్ని కలిగిన వారు. ఈ రోజు భక్తులు ఎవరూ రానందున వాళ్లను వెతుక్కుంటూ బయటకు వెళ్లారు. వారు మిమ్మల్ని చూస్తే చాలా సంతోషిస్తారు. మీరు ఇంటి లోపలికి వచ్చి ఆసీనులు కండి" అని ప్రార్థించింది.



భైరవ వేషధారి అయిన శివుడు "నేను చిరుతొండరుని చూడ్డానికే వచ్చాను. వారు లేనపుడు ఇంట్లోకి రాను. నేను ఇక్కడి గణపతీ సారం దేవాలయం సమీపంలో ఉన్న అత్తి చెట్టు కింద కూర్చోనుంటాను. చిరు తొండరు వస్తే నేను అక్కడున్నట్లు చెప్పండి" అని చెప్పి అక్కడి నుండి వెళ్లిపోయాడు.

శివభక్తుల కోసం అన్వేషిస్తూ వెళ్లిన చిరుతొండడు శివభక్తులెక్కడా కనిపించనందున నిరాశతో ఇంటికి తిరిగి వచ్చాడు. భర్తను చూడగానే అతని భార్య "మీరు బయటకు వెళ్లినపుడు శివభక్తుడొకరు ఇక్కడికి వచ్చారు. అతడు ప్రస్తుతం గణపతి సారం దేవాలయం సమీపంలోని అత్తిచెట్టు కింద ఉన్నారు" అని చెప్పింది. ఆ మాటలు వినగానే అత్యంత ఆనందంతో చిరుతొండడు వేగంగా వెళ్లి ఆ భైరవ మునికి నమస్కరించి "స్వామీ! మీరు మాయింటికి వచ్చి ఆహారం స్వీకరించాలి" అని భక్తితో ప్రణమిల్లాడు. ఆ మాటలకా మాయా శివయోగి "నేను ఆరు నెలలకొక పర్యాయమే తింటాను. పశువును చంపి దాని మాంసాన్ని ఆహారంగా ఇస్తే దాన్ని మాత్రమే నేను తింటాను. అదీ నా పద్ధతి" అన్నాడు. ఆ మాటలకు చిరుతొండరు "స్వామీ! మీరేమీ సందేహించ వద్దు. నా దగ్గర పశువులు, దున్నపోతులు, పొట్టేళ్లు,

మేకలు మందలు మందలుగా ఉన్నాయి. వాటిలో మీకు ఏది కావాలని చెబితే త్వరగా దానిని వండి మీకు ఆలస్యం లేకుండా నేను వడ్డిస్తాను” అని చేతులు మోడ్చి నిలబడ్డాడు.

చిరుతొండని ప్రేమ పూరిత వాక్యాలు విన్న శివయోగి “ఓ భక్తుడా! నేను తినడానికి అడిగింది నీవను కొన్నట్లు పశుమాంసం కాదు. మానవ మాంసాన్ని నేను ఆహారంగా స్వీకరిస్తాను. ఆ మానవుడు కూడ అయిదు సంవత్సరాల లోపు బాలుడై ఉండాలి. శరీర అవయవాల్లో ఎలాంటి లోపమూ లేనివాడై ఉండాలి. అటువంటి మాంసాన్ని మాత్రమే నేను తింటాను. అంతేకాదు ఆ పిల్లవాడు తల్లిదండ్రులకు ఒకే కొడుకుగా ఉండాలి. ఆ పిల్లవాడిని తండ్రి నరుకుతుండగా తల్లి గట్టిగా పట్టుకోవాలి. ఇరువురూ ఈ పని సంతోషంగా చేయాలి. ఆ విధంగా వండిన మాంసాన్నే నేను తింటాను” అన్నాడు. ఆ మాటలకు చిరు తొండడు “స్వామీ! అదేమంత కష్టమైన పనికాదు. మీరు మా ఇంట్లో భోజనం చేయడం నా అదృష్టంగా భావిస్తున్నాను. నేను వెళ్లి వంట సిద్ధం చేస్తాను” అని చెప్పి వేగంగా ఇంటికి తిరిగి వచ్చాడు. భర్త రాకకోసం చిరుతొండని భార్య గుమ్మం ముందు ఎదురు చూస్తూ నిలబడి ఉంది. భర్తను చూడగానే ఆమె సంతోషించింది. నాయనారు ఆమెతో “శివయోగి మన ఇంట్లో భోజనం చేయడానికి సమ్మతించాడు. ఒక చిన్న పిల్లవాడిని చంపి ఆ మాంసాన్ని వండి అతనికి వడ్డించాలి. అతడు అయిదు సంవత్సరాల బాలుడై ఉండాలి. ఏ అవయవ లోపమూ లేకుండా ఉండాలి. తల్లి అతన్ని పట్టుకోగా తండ్రి అతని శరీరాన్ని నరికి మాంసాన్ని వంటకు సిద్ధం చేయాలి” అన్నాడు.

తిరు వెణ్ గాట్టు నంగై కూడ భర్త మాటలకు సమ్మతించి “ఆలస్యం చేయకుండా బడికి వెళ్లిన మన కుమారుని వెళ్లి పిలుచుకు రండి” అని కోరింది. భార్య మాటలకు సంతోషించి చిరు తొండరు బడికి వెళ్లి కుమారుని ప్రేమతో భుజాలమీదికి ఎక్కించుకొని ఇంటికి వచ్చాడు.



తల్లిదండ్రులు ప్రేమతో కుమారునికి స్నానం చేయించారు. తలదువ్వి, చందనమలది, కళ్లకు కాటుక దిద్ది, కొత్త బట్టలు తొడిగి చక్కగా అలంకారం చేశారు. శివభక్తునికి మాంసంగా చేయాలని చెప్పి తల్లి కుమారుడైన శీరాళ దేవుని కాళ్లను చేతులను తన రెండు చేతులతో గట్టిగా పట్టుకోగా చిరుతొండడు కత్తితో శీరాళుని దేహాన్ని ఖండించడం ప్రారంభించాడు. తల్లిదండ్రులు సంతోషంగా చేస్తున్న ఈ పనులను చూసి కుమారుడైన సీరాళదేవుడు కూడ సంతోషంతో చిరునవ్వులు చిందించాడు.

తిరు వెణ్గట్టు నంగైయారు తల మాంసం వంటకు పనికిరాదని భావించి దానిని భద్రపరచమని చందన దాదితో చెప్పి మిగిలిన శరీరభాగాలను వేర్వేరు వంటకాలుగా వండి ఆహారాన్ని సిద్ధంచేసింది. చిరుతొండడు సంతోషంతో భైరవయోగి ఉన్న చోటుకు వెళ్లి నమస్కరించి “స్వామీ! మీరు కోరినట్లుగా ఆహారాన్ని సిద్ధం చేశాము. భోంచేయడానికి రండి” అంటూ వారిని భోజనానికి ఆహ్వానించాడు. విశాలమైన అరటిఆకును శివయోగి ముందు పరిచి వండిన వంటకాలను వరుసగా వడ్డించారు. వాటిని చూసి శివయోగి “నేను చెప్పిన విధంగా శరీరంలోని అన్ని భాగాలను వండారా?” అని ప్రశ్నించాడు. ఆ మాటలకు “తలమాంసాన్ని మీరు తినరని భావించి దానిని మాత్రం వండకుండా వదిలివేశాము” అని చెప్పారు. శివయోగి ఆ మాటలకు “మేము దానిని కూడ తింటాము” అని చెప్పగా చిరుతొండడు అతని భార్య చింతా క్రాంతులై నిలబడ్డారు. అప్పుడు దాదియైన చందన “నేను తలమాంసాన్ని వండి సిద్ధంగా ఉంచాను” అని చెప్పి దానిని తీసుకు వచ్చి ఇచ్చింది. చిరుతొండడు అతని భార్య సంతోషించి దానిని అకులో శివయోగికి వడ్డించారు.

అప్పుడు భైరవ శివయోగి మరో నిబంధన ఒకటి చేశాడు. “నాకు ఒంటరిగా కూర్చొని తినే అలవాటు లేదు. మీకు కొడుకు ఉంటే అతన్ని పిలవండి. నాతో కలసి భోంచేస్తాడు” అని ఆజ్ఞాపించాడు. అతడిక్కడలేదని చిరుతొండడు చెప్పగా “నీ కొడుకు ఇక్కడికి వస్తేనే నేను భోజనం చేయడానికి సాధ్యమవుతుంది. కాబట్టి నీ కుమారుని గొంతెత్తి పిలువు” అని శివయోగి చిరుతొండనితో చెప్పాడు. భక్తుల మాటలను శిరసావహించి చిరుతొండడు, అతని భార్య ఇరువురూ తమ కుమారుని గొంతెత్తి పిలిచారు. భగవంతుని కృపాకటాక్షాల కారణంగా శీరాళుడు బడినుండి పరిగెత్తుకుంటూ వచ్చిన విద్యార్థివలె పరిగెత్తుకుంటూ వచ్చాడు. తల్లి తన కొడుకును ప్రీతితో ఆలింగనం చేసుకొని భర్త చేతులకు అందించింది. కొడుకు రావడం వలన ఇక శివభక్తుడు ఆహారాన్ని స్వీకరిస్తాడు అనే సంతోషంతో శీరాలదేవుని పిలుచుకొని చిరుతొండడు అతని భార్య ఇరువురూ ఇంటికి వేగంగా వచ్చారు. భైరవరూపంలో వచ్చిన పరమేశ్వరుడు అదృశ్యమయ్యాడు. ఆ సమయంలో వినువీధి యందు ఉమాదేవి, కుమారస్వామి సహితుడై పరమేశ్వరుడు ప్రత్యక్షమయ్యాడు. చిరుతొండడు, తిరువెణ్ నాట్టు నంగై, శీరాళదేవుడు, చందన దాది తన ముందు ప్రత్యక్షమైన శివునికి నమస్కరించి స్తుతించారు. శివుడు వారి భక్తికి ప్రసన్నుడై అందరికీ శివ సాయుజ్యాన్ని అనుగ్రహించాడు.

## 36. కళతిట్రతివార్ నాయనారు

అందమైన కొడుంగోళూరు నగరంలో చేర రాజవంశానికి చెందిన పెరమాకోద్దైయార్ అనే శివభక్తుడు ఉండేవాడు. అతడు తన వృత్తిని కూడ విస్మరించి తిరువంజై కళంలోని పరమేశ్వరుని సదా సేవిస్తూ వచ్చేవాడు.

చేర రాజ్యాన్ని కంటికి రెప్పగా పాలిస్తూ వచ్చిన సెంగోత్ పొత్తైయన్ అనే చేరరాజు రాజ్య సుఖభోగాల మీద విరక్తుడై సన్యాసాన్ని స్వీకరించాడు.



దీని కారణంగా చేరదేశం అల్లకల్లోలమైంది. అమాత్యులందరూ కలసి పెరుమాకోద్దైయారు దగ్గరికి వెళ్లి “రాజు లేకపోవడం కారణంగా దేశంలో శాంతి భద్రతలు లోపించి ఛిన్నాభిన్నమవుతున్నది. మీరు చేర రాజ వంశానికి చెందినవారు కాబట్టి రాజ్యాధికారాన్ని స్వీకరించి దేశాన్ని రక్షించండి” అని ప్రార్థించారు. “నేను చేస్తున్న శివ కైంకర్యానికి ఆటంకం ఏదీ కలుగకుండ ఉన్నట్లయితే నేను ఈ బాధ్యతను స్వీకరిస్తాను” అని పెరుమాకోద్దైయారు చెప్పగా అమాత్యులు దానికి అంగీకరించారు. పరమేశ్వరుని అనుగ్రహించే సకల జీవరాశుల భాషలను గ్రహించేశక్తి, అడిగిన వారికి లేదనకుండా ఇచ్చే దానగుణం, రాజ్య పరిపాలనా సామర్థ్యం అతనికి చేకూరింది.

పెరుమాకోద్దైయార్ దేవాలయానికి వెళ్లి పరమేశ్వరునికి భక్తితో నమస్కరించి, అమాత్యులు, సైనికాధికారులు, పరివారజనం వెన్నంటి రాగా పట్టపుటేనుగును ఎక్కి నగర పర్యటనకు బయలుదేరాడు. అప్పుడు ఒక రజకుడు చవుడు మట్టి మూటను మోసుకుంటూ ఎదురుగా వచ్చాడు. వర్షం కారణంగా ఆ మట్టి కరిగి అతని శరీరమంతా తెల్లబారి ఉంది. ఆ దృశ్యం శరీరమంతా విభూతిధారణ చేసిన శివభక్తునివలె రాజుగారికి కనిపించింది. వెంటనే రాజు ఏనుగునుండి కిందికి దిగి ఆ చాకలి వాడికి భక్తితో నమస్కరించాడు. చాకలివాడు భయంతో గజగజ వణుకుతూ “రాజా! నేను మీ అంతఃపురంలో పనిచేసే చాకలివాడిని” అని చెప్పాడు. “నేను భక్తులకు దాసుడను, నీవు శివభక్తుడు కాక పోయినప్పటికీ శివభక్తుని వేషాన్ని గుర్తుకు తెచ్చావు” అని చెప్పి రాజు అతనికి బహుమతులిచ్చి పంపాడు.

“సకల సంపదలు, రాజ్యాధికారం, భక్తి శ్రద్ధలు అన్నీ చిదంబరంలో నాట్యమాడే పరమేశ్వరుని తిరుచరణాలే” అని పెరుమాకోద్దైయారు

విశ్వాసించాడు. నటరాజస్వామి పాదపద్మాలను భక్తితో పూజించాడు. శంకరుడు అనుగ్రహించి "ప్రతిరోజూ పూజ ముగిసిన తరువాత నా కాలి అందెల శబ్దం వినే శక్తి నీకు కలుగుతుంది" అని రాజును ఆశీర్వదించాడు. ఆ విధంగానే రాజు అర్చనానంతరం పరమేశ్వరుని కాలి అందెల రవళిని వింటూ ఆనంద సాగరంలో ఓలలాడుతూ వచ్చాడు.

పుణ్య క్షేత్రమైన మదురైలో వెలసిన పరమేశ్వరుని రోజూ సంగీతంతో స్తుతించే పాణభద్రుడనే పాణరుడు ఒకడు ఉండేవాడు. అతని పేదరికాన్ని పోగొట్టాలని భగవంతుడు సంకల్పించాడు. పాణరునికి స్వప్నంలో ప్రత్యక్షమై "నీకు సకల సంపదలను ఇవ్వాలని పెరుమా క్కోదైయారుకు చెప్పి యున్నాము. నీవు ఈ లేఖను రాజుగారికి ఇచ్చి వారిచ్చే సంపదలను స్వీకరించు" అని చెప్పి తాటాకులో రాసి ఉన్న ఒక ఉత్తరాన్ని అతనికిచ్చాడు. పాణ భద్రుడు ఆ ఉత్తరాన్ని తీసుకువెళ్లి పెరుమాక్కోదైయారుకు ఇవ్వగా రాజు దానిని చదివి ఆనంద భరితుడయ్యాడు. తన బొక్కసంలో ఉన్న అపారమైన ధనరాశులను ఇవ్వగా ఒక భద్ర గజము మీద వాటిని తీసుకొని పాణ భద్రుడు తన నివాసం చేరుకున్నాడు.

సకల జీవరాశుల భాషలను అర్థం చేసుకునే శక్తిని భగవంతుడు అనుగ్రహించి నందువలన పెరుమాక్కోదైయారు వాటి కష్టాలను తెలుసుకొని వాటిని నివారించి అవి సుఖసంతోషాలతో జీవించేలా ఏర్పాట్లు చేశాడు. అందువలన అతను కళతీర్రుటివార్ నాయనార్ అనే పేరుతో పిలువబడ్డాడు.

చేరరాజుకు (కళఱ్ట్రటివారు నాయనారుకు) చిదంబరంలోని నటరాజస్వామిని, సుందరమూర్తిని దర్శించాలనే కోరిక కలిగింది. అమాత్యులతో పరివారంతో కలసి చిదంబరం దిశగా ప్రయాణమయ్యాడు.



పొన్నంబలంలోని నటరాజ స్వామిని దర్శించుకొని వారి అందెల రవళిని విని ఆనందించాడు. చేరరాజు కొద్ది రోజులు చిదంబరంలో ఉండి తరువాత సుందరమూర్తి నాయనారులను దర్శించడానికై తిరువారూరు ప్రయాణమయ్యాడు. చేర చక్రవర్తి తనను చూడ్డానికి వస్తున్న విషయం తెలుసుకొని సుందరులు వారికి ఎదురుగా వెళ్లి స్వాగతం చెప్పాడు. చేర చక్రవర్తి సుందరమూర్తి తిరు చరణాలకు ప్రణమిల్లాడు. సుందరులు కూడ చేరరాజుకు నమస్కరించాడు. ఇరువురూ దేవాలయానికి వెళ్లి పరమేశ్వరుని దర్శించుకొన్నారు.

చేరరాజు సుందరమూర్తి నాయనారు పాద పద్మాలనే తలచుకుంటూ పరమేశ్వరుని భక్తితో సేవిస్తూ ధర్మబద్ధంగా రాజ్య పరిపాలన చేస్తూ కాలం గడిపాడు.

## 37. గణనాథ నాయనారు

తిరుజ్ఞాన సంబంధరు అవతరించిన శీర్గాళి పుణ్యక్షేత్రంలో ఒక బ్రాహ్మణ కుటుంబంలో గణనాథుడనే శివభక్తుడు అవతరించాడు. పరమేశ్వరుని అర్చించడమే తన జీవితధ్యేయంగా అతడు భావించి సదా స్వామి కైంకర్యంలోనే కాలం గడుపుతూ వచ్చాడు. ఉద్యాన వనాల్లో పూలమొక్కలను పెంచి, సురభిళ పుష్పాలతో అందమైన మాలలను కూర్చి స్వామికి సమర్పించడం, స్వామి అభిషేకార్థం పవిత్రజలాలను తీసుకొని రావడం, దేవాలయంలో దీపాలను వెలిగించడం, పవిత్ర శైవ గ్రంథాలైన తిరుముఱై పఠించడం, వాటి ప్రతులను తీసి భక్తులకు పంచడం మొదలైన సేవలను సంతోషంగా చేస్తూ వచ్చాడు.

గణనాథ నాయనారు గొప్ప శివభక్తుడైన తిరుజ్ఞాన సంబంధరును కళ్లకు కనిపించే ప్రత్యక్ష దైవంగా భావించి మూడువేళలా అతని దగ్గరికి

వెళ్లి భక్తితో ప్రణమిల్లు తుండేవాడు. మరణించిన తరువాత గణనాథ నాయనారు కైలాసం చేరుకుని అక్కడి శివగణాలకు నాయకుడై పరమ శివునికి ప్రీతితో కైంకర్యం చేసే భాగ్యాన్ని సంపాదించాడు.

## 38. కూట్రువ నాయనారు

తిరుక్కళందై అనే నగరంలో అవతరించిన గొప్ప శివభక్తుడు కూట్రువ నాయనారు. ఇతడొక మండలాధిపతి. ఇతడు ఎన్నో యుద్ధాలుచేసి రాజులను ఓడించి వారి రాజ్యభాగాలను ఆక్రమించాడు. అతడు బంగారు కిరీటాన్ని శిరసున ధరించి పట్టాభిషేకం చేసుకోవాలని ఆకాంక్షించాడు.

పట్టాభిషేకం నిర్వహించే అధికారం ఆరోజుల్లో చిదంబరంలోని దీక్షితులు మాత్రమే కలిగి ఉండేవారు. కూట్రువ నాయనారు వాళ్ల దగ్గరకు వెళ్లి తనకు పట్టాభిషేకం చేయమని అడిగాడు. "చోళ చక్రవర్తులకు తప్ప వేరొకరికి మేము పట్టాభిషేకం చేయము" అని వాళ్లు కచ్చితంగా చెప్పారు. వాళ్లు కూట్రువ నాయనారుకు భయపడి చేరదేశానికి తరలి వెళ్లిపోయారు.

కూట్రువ నాయనారు ఈ పరిణామాలకు సంతాపం చెంది "పరమేశ్వరా! నీ పాద పద్మాలను ఈ దాసునికి కిరీటంగా అలంకరించండి" అని ప్రార్థించాడు. ఆ రోజు రాత్రే కరుణామూర్తి అయిన శివుడు అతనికి కలలో ప్రత్యక్షమై తన పాద పద్మాలనే అతనికి కిరీటంగా శిరసున అలంకరించాడు. వాటిని శిరసున ధరించి కూట్రువ నాయనారు అనేక సంవత్సరాలు ధర్మబద్ధంగా రాజ్యపాలన చేశాడు. తరువాత అతడు శివాలయాలను దర్శించుకుంటూ చివరకు పరమేశ్వరుని తిరు చరణాలలో శాశ్వత స్థానాన్ని సంపాదించుకొన్నాడు.



## 39. పుగళ్ చోళ నాయనారు

ఉరైయూరును రాజధానిగా జేసుకొని శివభక్తుడైన పుగళ్ చోళుడు ధర్మబద్ధంగా రాజ్యపరిపాలన చేశాడు. శివభక్తులకు ఏ లోపమూ రానివ్వక వారికి కావలసినవన్నీ సమకూరుస్తూ వచ్చాడు.

ఒక పర్యాయం అధికుడనే సామంతరాజు తాను కట్టవలసిన కప్పాన్ని పుగళ్చోళ చక్రవర్తికి కట్టక ఎదురు తిరిగాడు. చోళ చక్రవర్తి తన సైన్యాధిపతిని రావించి చతురంగబలాలతో అధికుని గర్వాన్ని అణచి రమ్మని పంపించాడు. చోళ చక్రవర్తి సైన్యాలకు అధికుని సైన్యాలకు మధ్య భీకర సంగ్రామం జరిగింది. చోళుని సైన్యాలు అధికుని చంపడంతో బాటు దేశాన్ని నేలమట్టం చేసి అక్కడున్న సంపదలన్నీ తమ దేశానికి తరలించుకు వచ్చారు. శత్రువుల నుండి దోచుకువచ్చిన అపారమై ధనరాశులతో బాటు మరణించిన శత్రువీరుల తలలను కూడ పుగళ్చోళ చక్రవర్తి ముందు కుప్పపోశారు. ఆవిధంగా కుప్పగా పడి ఉన్న శత్రువీరుల తలల్లో ఒకదానికి నుదుట విభూతిరేఖలుండడం పుగళ్చోళ చక్రవర్తి చూశాడు. అది ఒక శివభక్తుని తలగా రాజు గుర్తించాడు. కళ్లనుండి భాష్పధారలు కురుస్తుండగా "అయ్యో! ఎంత విపరీతం జరిగింది. విభూతిని అలదుకొన్న శివభక్తులను రక్షించలేని నేను ఇక జీవించడం వ్యర్థం" అని నిశ్చయించు కొన్నాడు. అమాత్యులను పిలిచి తన కుమారునికి పట్టాభిషేకం చేయమని చెప్పి రాజ్యాన్ని అప్పగించాడు. ఒక పెద్ద అగ్ని గుండాన్ని తయారు చేయమని సేవకులకు ఆనతి ఇచ్చాడు. తాను చూసిన శివభక్తుని తలను ఒక బంగారు తట్టలో పెట్టుకొని పంచాక్షరీ మంత్రం చదువుతూ అందరూ చూస్తుండగా అగ్ని గుండంలో ప్రవేశించాడు. దేవతలు ఈ అద్భుతాన్ని చూసి పుష్పవర్షం

కురిపించారు. పుగళ్‌చోళ చక్రవర్తి పరమేశ్వరుని పాద పద్మాలలో ఐక్యమయ్యాడు.

## 40. నరసింగ మునైయరైయ నాయనారు

**తి**రుమునై పాడినాడు రాజ్యాన్ని ధర్మమార్గం తప్పక నరసింగ మునైయరైయ నాయనారు పాలిస్తూ వచ్చాడు. ఇతడు గొప్ప శివభక్తుడు. శివభక్తులు ఏది అడిగినా లేదనకుండా ఇవ్వడమే నియమంగా పెట్టుకున్న వాడితడు.

పవిత్రమైన తిరువాదిరై (ఆరుద్రా) నక్షత్ర శుభదినాన నరసింగ రాజు అన్ని శివాలయాల్లోను శివునికి ప్రత్యేకమైన పూజలు జరిపించేవాడు. ఆ రోజున శివభక్తులందరికీ షడ్రసోపేతమైన విందుతో సంతృప్తులను గావించి ఒక్కొక్కరికీ నూరు బంగారు నాణెములను ఇస్తూ వచ్చాడు.

ఒక పర్యాయం ఆవిధంగా శివభక్తులను సన్మానిస్తుండగా శరీరమంతా సంభోగ చిహ్నాలతో, చిందర వందరయైన దుస్తులతో ఒకడు శివభక్తుని వేషాన్ని ధరించి అక్కడికి వెళ్లాడు. ఆవిధంగా వచ్చిన అతనిని రాజు గౌరవంగా ఆహ్వానించాడు. శివభక్తులు నైతికమార్గం నుండి వైదొలగిన వారైనప్పటికీ వారిని హేళన చేసినవారు ఘోరమైన నరకంలో పడుతారని ఇతరులకు తెలియజేయడానికై రాజు ఆ శివభక్తుడికి రెండింతలు బంగారు నాణెములను బహుమతిగా ఇచ్చి గౌరవించాడు. నరసింగ మునైయరైయ నాయనారు ఈ విధంగా శివభక్తులను గౌరవిస్తూ పరమేశ్వరునికి సేవలు చేస్తూ చివరగా శివలోక పదవిని అందుకున్నాడు.



## 41. అతిబత్త నాయనారు

**చో**ళదేశమనే కల్పవృక్షానికి పూచిన పుష్పంగా నాగ పట్టణాన్ని అభివర్ణిస్తుంటారు. ఇది సముద్రతీరంలో ఉంది. అతిబత్తర్ బెస్తకులంలో జన్మించాడు. ఇతడు గొప్ప శివభక్తుడు. వంశ పరం పరానుగతమైన చేపలు పట్టే వృత్తిని కొనసాగిస్తూ వచ్చినప్పటికీ తన శివభక్తి మార్గంనుండి ఎన్నడూ వైదొలగలేదు. వలవేసి చేపలు పడుతున్నపుడు మొదట పడిన చేపను శివార్పణంగా భావించి నీటిలోనే వదలడం అతడు ఒక వ్రతంగా పెట్టుకున్నాడు.

ఒక్కోరోజు అతిబత్త నాయనారుకు ఒక చేప మాత్రమే లభించేది. దానిని కూడ అతడు నీళ్లలోనే వదలి వేసేవాడు. చాలారోజులు రోజుకొక్క చేప మాత్రమే వలలో పడుతూ వచ్చింది. వాటి నన్నటిని అతిబత్తర్ తిరిగి నీళ్లలోనే వదలుతూ వచ్చాడు. తాను, తనను ఆశ్రయించిన వారు ఆకలితో మలమల మాడుతున్నప్పటికీ అతడు తన వ్రతాన్ని మానలేదు. అతని శరీరం ఎముకలగూడుగా మారింది.

ఒక రోజు అతనికి వలలో అపరంజి బంగారంతో చేయబడిన మణులు పొదిగిన బంగారు చేప దొరికింది. అది అత్యంత విలువైన చేప అయినప్పటికీ నాయనారు తన వ్రతానికి భంగం రానీయక శివార్పణంగా ఆ చేపను నీళ్లలోనే వదలివేశాడు. సంపదలకు ప్రాధాన్యమిచ్చే ఈ లోకంలో ఆ సంపదనే తృణప్రాయంగా భావించి తనకు లభించిన బంగారుచేపను శివార్పణం గావించాడు అతిబత్తరు. అతని భక్తికి ప్రసన్నుడై పరమేశ్వరుడు వృషభవాహనారూఢుడై ప్రత్యక్షమై అతనికి శివలోక పదవిని అనుగ్రహించాడు.

## 42. కలిక్కంబ నాయనారు

**తి**రు పెణ్ణాగడం అనే నగరంలో ఒక వైశ్య కుటుంబంలో జన్మించిన శివభక్తుడు కలిక్కంబ నాయనారు. శివభక్తులను శివుని సాక్షాద్రూపంగా భావించి గౌరవ మర్యాదలతో వారికి సేవలు చేస్తూ వచ్చాడు. రోజూ షడ్రసోపేతమైన వంటకాలను సిద్ధం చేయించి వచ్చిన శివభక్తులకు లేదనకుండా సంతృప్తిగా వడ్డించేవాడు.

ఒక రోజు యథా ప్రకారం శివభక్తులు కలిక్కంబ నాయనారు ఇంటికి వెళ్లారు. అతని భార్య నీళ్లు పోస్తుండగా నాయనారు శివభక్తుల పాదాలను ప్రక్షాళనం చేస్తూ వచ్చాడు. నాయనారు ఈ విధంగా చేస్తూ ఒక శివభక్తుని పాదాలు పట్టుకొని కడగడం ప్రారంభించాడు. కాని అతని భార్య నీళ్లు పోయలేదు. భార్య నీళ్లు పోయకుండ ఉన్నందులకు కారణమేమిటని అతడు ఆలోచించాడు. వెంటనే నాయనారు భార్య ఆ శివభక్తుని చూపించి "ఇతడు మన ఇంట్లో పరిచారకుడుగా ఉండేవాడు" అని చెప్పింది. నాయనారు తీవ్రమైన కోపంతో కరవాలాన్ని దూసి భార్యచేతిని ఖండించాడు. తరువాత వారే నీటి పాత్రను తీసుకొని నీళ్ళుపోసి ఆ శివభక్తుని పాదాలకు అభిషేకం గావించాడు. పరమేశ్వరుడు అతని శివభక్తికి ప్రసన్నుడై అతనికి శివలోక పదవిని అనుగ్రహించాడు.

## 43. కలియ నాయనారు

**తొం**డ మండలంలోని ప్రసిద్ధ శైవ క్షేత్రాలలో తిరువొత్రియూరు ఒకటి. ఆ గ్రామంలో గాండ్ల కులానికి చెందిన గొప్ప శివభక్తుడైన కలియనాయనారు అవతరించాడు. శ్రీమంతుడైన అతడు తిరువొత్రియూరు శివాలయానికి వెళ్లి రాత్రింబగళ్లు దీపాలు వెలిగించడం ఒక వ్రతంగా నిర్వహిస్తూ వచ్చాడు.



కలియ నాయనారు శివభక్తిని పరమేశ్వరుడు లోకానికి తెలియజేయాలని అనుకున్నాడు. అది మొదలుకొని నాయనారు సంపద రోజు రోజుకూ క్షీణించడం ప్రారంభించింది. అయినప్పటికీ కలియ నాయనారు గుడిలో దీపాలు వెలిగించే వ్రతాన్ని మాత్రం మానలేదు. కూలిపనికి వెళ్లి వచ్చిన డబ్బులతో గుడిలో దీపాలు వెలిగించాడు. కొద్ది రోజులైన తరువాత అతనికి కూలి పని కూడ దొరకలేదు. ఇంటిని, ఇంటిలోని వస్తువులను అమ్మి దేవాలయంలో దీపారాధన నిర్వహించాడు. ఆ డబ్బులు కూడ పూర్తిగా ఖర్చయిన తరువాత తన భార్యను అమ్మి తన వ్రతాన్ని నిరాటంకంగా జరపాలనుకున్నాడు. భార్యను పిలుచుకొని నగరమంతటా తిరిగినప్పటికీ ఆమెను కొనడానికి ఎవరూ ముందుకు రాలేదు.

దీపాలు వెలిగించడానికి అతనికి ఏ మార్గమూ తోచలేదు. దేవాలయానికి వెళ్లి ప్రమిదలను వరుసగా అమర్చి వాటిలో వత్తులను వేశాడు. "దీపాలు వెలిగించకుండా జీవించడం కన్నా మరణించడమే మేలు. నా శరీరంలోని రక్తంతో దీపాలను వెలిగిస్తాను" అని నిశ్చయించుకున్నాడు. కత్తితో తన శరీరాన్ని పొడుచుకొన్నారు. కరుణామూర్తి అయిన పరమేశ్వరుడు ప్రత్యక్షమై కలియ నాయనారుకు శివలోక పదవిని అనుగ్రహించాడు.

## 44. సత్తి నాయనారు

**కా**వేరీ నదీ తీరంలోని అందమైన గ్రామాలలో విరింజైయూరు ఒకటి. ఆ గ్రామంలో సత్తి నాయనారు అవతరించాడు. అతడు శివునిగాని, శివభక్తులను గాని, శైవమతాన్ని గాని ఎవరైనా దూషిస్తే వారి నాలుకను తన కరవాలంచే ఖండించేవాడు. నిందించినవాళ్లు ఈ జన్మలో కష్టాలు, మరుజన్మలో నరకం ప్రాప్తించకుండా ఉండడానికై నాయనారు ప్రేమతో

చేసిన పనే అది. ఆ విధంగా అతడు జీవితాంతం శివ ద్రోహుల నాలుకలను ఖండించి చివరకు పరమేశ్వరుని పాద పద్మాలను చేరుకున్నాడు.

## 45. ఐయడిగళ్ కాడవర్ కో నాయనారు

**తొం**డ మండలానికి చెందిన కంచి నగరాన్ని రాజధానిగా చేసుకొని ఐయడిగళ్ కాడవర్ కోనాయనారు అనే రాజు ధర్మమార్గం తప్పక ప్రజలను కన్నబిడ్డలుగా భావిస్తూ రాజ్య పరిపాలన సాగించాడు. ఇతడు గొప్ప శివభక్తుడు. ఇతని కాలంలో ప్రజలు సుఖసంతోషాలతో జీవనం సాగించారు. శైవమతం మూడు పూవులు ఆరుకాయలుగా అభివృద్ధి చెందింది.

ఐయడిగళ్ కాడవర్‌కో నాయనారుకు రాజ్య పరిపాలన మీద, ఐహిక సుఖాలమీద వైముఖ్యం కలిగింది. పరలోక చింతన అధికమైంది. తన కుమారునికి రాజ్య భారాన్ని అప్పగించి తాను పూర్తిగా శైవమత వ్యాప్తి కోసం తన కాలాన్ని వెచ్చించాడు. దేశంలోని శివాలయాలకు వెళ్లి ఒక్కొక్క దేవాలయానికి ఒక్కొక్క పద్యం వంతున పద్యాలు రచించాడు. ఈ పద్య సంకలనానికి 'క్షేత్ర వెణ్బా' అని పేరు. సదా శివభక్తులకు సేవచేస్తూ చివరకు అతడు శివలోక పదవిని అందుకున్నాడు.

## 46. కణం పుల్ల నాయనారు

**వె**ళ్లారు నది దక్షిణ తీరంలో సంపదలకు నెలవైన ఇరుక్కు వేళూరు అనే గ్రామం ఉంది. పుల్లారు అనే శివభక్తుడు ఆ గ్రామానికి అధికారిగా ఉండేవాడు. శివాలయాల్లో దీపం వెలిగించడమనే పుణ్యకార్యాన్ని నియమం తప్పకుండా చేస్తూ వచ్చాడు. కొద్ది రోజులకు అతడు సంపదలన్నీ కోల్పోయి



పేదరికంలో ఇడుమలు అనుభవించవలసి వచ్చింది. పేదరికంలో కూడ అతడు ఆలయంలో దీపాలు వెలిగించే వ్రతాన్ని మరిచిపోక చేస్తూ వచ్చాడు. చిదంబరం వెళ్లి అక్కడ కూలి పని చేస్తూ తన వ్రతాన్ని కొంతకాలం కొనసాగించాడు. కూలిపని లభించనందున 'కణం' అనే ఒక రకమైన గడ్డిని కోసుకొని వచ్చి దానికి అమ్మగా వచ్చిన డబ్బులతో శివాలయంలో దీపాలు వెలిగించడం చేశాడు. ఒక పర్యాయం అతడు కోసుకు వచ్చిన గడ్డిమోపును ఎవరూ కొనలేదు. అందువలన నాయనారు ఆ గడ్డి మోపునే దీపంగా వెలిగించాడు. అది త్వరగా కాలిపోయింది. నాయనారుకు ఒక జాము వరకు దీపం వెలిగించడం అలవాటు. అందువలన అతను తన తల వెంట్రుకలను దీపంగా వెలిగించాడు. పరమేశ్వరుడు అతని భక్తికి మెచ్చి ప్రత్యక్షమై 'కణం పుల్ల నాయనారు'కు శివలోక పదవిని అనుగ్రహించాడు.

## 47. కారి నాయనారు

**తి**రుక్కడవూరు అనే గ్రామంలో విద్వజ్జనులచే ప్రస్తుతింపబడిన కారి నాయనారు అనే పండితుడు జన్మించాడు. ఇతడు కారి కోవై అనే గ్రంథాన్ని రచించాడు. పాండ్య చోళ చేర చక్రవర్తులు ముచ్వురూ ఇతని పాండిత్యానికి ముగ్ధులై అసంఖ్యాకములైన బహుమతులను ఇచ్చారు. ఆ విధంగా వచ్చిన సంపదలను కారి నాయనారు తన స్వంతం చేసుకోలేదు. వాటితో శివాలయాలు నిర్మించాడు. శివభక్తులకు కావలసినవన్నీ సమకూర్చాడు. సదా కైలాస పర్వతమే అతని మదిలో మెదలుతూ ఉండేది. నాయనారు హృదయంలో భావించిన విధంగానే మరణించిన తరువాత వారు కైలాసంలో ప్రమధగణంగా అవతరించి శివుని భక్తితో అర్చిస్తూ వచ్చాడు.

# 48. నిన్ట సీర్ నెడుమార నాయనారు

**ని**న్టసీర్ నెడుమారర్ పాండ్య దేశానికి చక్రవర్తి. జైన మతస్తుడైన అతడు తిరుజ్ఞాన సంబంధరు అనుగ్రహం కారణంగా శైవుడుగా మారాడు. వీరి కాలంలో ఉత్తర భారత భూభాగం నుండి కొందరు రాజులు తిరునెల్వేలిని ముట్టడించారు. నెడుమార నాయనారు వాళ్లతో భీకరంగా పోరాడి విజయాన్ని సాధించాడు. వీరు పాండ్యదేశాన్ని ఎన్నో సంవత్సరాలు ఎలాంటి కొరత లేకుండా కాపాడాడు. పరమేశ్వరుని తిరుచరణాలకు ప్రణమిల్లిన నాయనారు ఆ స్వామి తిరుచరణాలే తనకు భవబంధ విమోచనం కలిగిస్తుంది అని గాఢంగా విశ్వసించాడు. వీరి గురించిన చరిత్ర “తిరుజ్ఞాన సంబంధరు” పురాణంలో విపులంగా చర్చింపబడింది.

# 49. వాయిలార్ నాయనారు

**తొం**డ మండలంలోని సముద్ర తీర గ్రామాలలో ముఖ్యమైనది మైలాపూరు. ఆ గ్రామంలోని వేళాల కుటుంబంలో వాయిలార్ అవతరించాడు. ఇతడు గొప్ప శివభక్తుడు. తన హృదయాన్ని ఆలయంగా చేసుకున్నాడు. దానిలో భగవంతుని ప్రత్యక్షం చేసుకున్నాడు. దానిలో జ్ఞానమనే దీపాన్ని వెలిగించాడు. పొంగులు వారే ఆనందజలాలతో స్వామికి అభిషేకం గావించాడు. ప్రేమ అనే నైవేద్యాన్ని సమర్పించాడు. ఈ విధంగా పరమేశ్వరునికి నిత్యపూజలు చేస్తూ వాయిలార్ నాయనార్ తన జీవనాన్ని సాగించాడు. పరమేశ్వరుడు ఇతని భక్తికి మెచ్చి ఇతనిని తన శివ గణాలలో ఒకరుగా అనుగ్రహించాడు.



# 50. మునైయడువార్ నాయనారు

**చో**ళనాడులోని నీడూరు అనే గ్రామం పాడిపంటలతో సస్యశ్యామలంగా విరాజిల్లుతూ ఉంటుంది. ఆ గ్రామంలో మునైయడువార్ నాయనారు అనే శివభక్తుడు ఉండేవాడు.

శత్రువులతో యుద్ధంచేసి ఓడిపోయిన వారు ఇతని దగ్గరికి వచ్చి తమకు సహాయం చేయాలని అర్థించే వారు. వాళ్లు చెప్పడం ధర్మశాస్త్రానికి విరుద్ధం కాకుండా ఉన్నట్లయితే మునైయడువార్ నాయనారు వాళ్లకు తోడుగా వెళ్లేవాడు, శత్రువులతో పోరాడి వాళ్లకు విజయాన్ని చేకూర్చి ఇచ్చేవాడు. దానికి తగిన పారితోషకాన్ని కూడ పొందుతుండేవాడు. ఆ సొమ్ముతో శివభక్తులకు నిత్యమూ భోజనం ఏర్పాట్లు చేస్తుండేవాడు. శివభక్తులకు సదా అన్నదానం చేసే పవిత్రకార్యక్రమంలో చాలాకాలం లీనమై స్వామి అనుగ్రహంతో శివసాయుజ్యాన్ని పొందాడు మునైయడువార్ నాయనార్.

# 51. కళర్ సింగ నాయనారు

**ప**ల్లవ వంశ సంభూతుడైన కళర్ సింగ నాయనార్ భగవంతుని పాదపద్మాలపై తప్ప వేరు చింతన లేనటువంటి వాడు. శివ భగవానుడు వెలసిన పవిత్రక్షేత్రాలను దర్శించి స్వామికి కైంకర్యం చేయాలనే ఆకాంక్షతో పత్నీ సమేతుడై కళర్ సింగ నాయనార్ తిరువారూరు చేరుకున్నాడు. సతీ సమేతుడై అమాత్యపరివార జనం వెంటరాగా ఆలయంలో ప్రవేశించాడు. రాణి అక్కడున్న పుష్ప మండపం సమీపానికి వెళ్లింది. అప్పుడు ఆమెకు

ఎదురుగా ఒక పుష్పం ఒకటి వచ్చిపడింది. ఆమె దానిని తీసుకొని వాసన చూసింది. దీనిని చూసిన సెరుత్తుణై నాయనారు అనే శివభక్తుడు అణచుకోలేని కోపావేశాలతో "ఈమె శివాలయానికి సంబంధించిన పుష్పాన్ని వాసన చూసింది. ఇది శివాపరాధం" అని చెప్పి వేగంగా వెళ్లి కత్తితో రాణిగారి ముక్కును కోసివేశాడు. ముక్కునుండి ఏకధారగా రక్తం కారసాగింది.

అప్పుడు స్వామిని దర్శించుకొని కళర్ సింగ నాయనార్ వచ్చారు. తన భార్యను చూసి ఈలోకంలో భయం లేకుండా "ఈ పనిచేసిన వారు ఎవరు?" అని కన్నులు ఎఱ్ఱబడగా, శరీరమంతా కోపంతో కంపించిపోగా అక్కడున్నవారిని ప్రశ్నించాడు.

అప్పుడు పక్కనే ఉన్న సెరుత్తుణై నాయనారు జరిగిన వృత్తాంతమంతా చెప్పాడు. వెంటనే కళర్ సింగ నాయనార్ "స్వామీ! మీరు ఇచ్చిన ఈ దండన సరిపోదు. పుష్పాన్ని తీసుకొన్న చేతినికదా మొదట ఖండించ వలసింది" అని చెప్పి తన దగ్గరున్న కరవాలంతో పట్టపురాణియైన తన ప్రియమైన భార్యచేతిని గాజులతో సహా ఖండించాడు. దేవతలందరూ పుష్పవర్షాన్ని కురిపించారు. అపూర్వమైన శివభక్తిని ప్రదర్శించిన కళర్ సింగ నాయనార్ చాలాకాలం రాజ్యపరిపాలన చేసి పరమేశ్వరుని తిరుచరణాల సన్నిధిలో సేవచేసే భాగ్యాన్ని పొందాడు.

## 52. ఇడంగళి నాయనారు

**కో**నాడు ప్రాంతంలో కొడుంబలూరు అనే గ్రామం ఉంది. ఆ గ్రామంలో ఇడంగళి నాయనారు నివసిస్తూ ఉండేవాడు. అతడు చోళకుల



వంశోద్భవుడు. శివభక్తులకు సేవచేయడమే వ్రతంగా కలిగి నీతిమార్గం తప్పక పరిపాలన సాగించాడు.

అతని కాలంలో శివభక్తులకు నిత్యాన్నదానం చేసే ఒక శివభక్తుడు ఆ గ్రామంలో ఉండేవాడు. తన దగ్గరున్న చరాచర వస్తువులన్నింటినీ అమ్మి అతడు శివభక్తులకు లేదనకుండా ఆహారాన్ని సమర్పిస్తూ వచ్చాడు. ఈ విధంగా చేయడం వలన కొంతకాలానికి అతనికి పేదరికం సంప్రాప్తించింది. ఒకరోజు అతనిఇంట్లో చీమ తీసుకెళ్లగలిగినంత బియ్యపుగింజకూడ లేకుండాపోయింది. రాజైన ఇడంగళి నాయనారుకు చెందిన గిడ్డంగుల్లో వడ్లు రాశులు పోసిఉండడం అతను చూశాడు. ఆ శివభక్తుడు అర్ధరాత్రి అక్కడికి వెళ్లి వడ్లను గంపలో పోసుకొని ఇంటికి తీసుకురావడానికి ప్రయత్నించాడు. కాపలా సైనికులు అతనిని పట్టుకొని బంధించి రాజైన ఇడంగళి నాయనారు ముందు నిలబెట్టారు. దొంగతనం చేస్తే శిక్ష తప్పకుండా పడుతుందని అతనికి తెలుసు. కాని శివభక్తులపై ఎనలేని భక్తిప్రపత్తులు కలిగి ఉన్నందువలన రాజ దండన కూడ అతనికి మధురంగానే తోచింది.

రాజైన ఇడంగళి నాయనారు శివభక్తుని చూసి "నీవు వడ్లను దొంగలించినది నిజమే కదా!" అని ప్రశ్నించారు. శివభక్తులకు భోజనం పెట్టాలనే ఆకాంక్షతోనే నేను దాన్ని దొంగలించాను" అని చెప్పాడు ఆ భక్తుడు. ఆ మాటలు వినగానే హృదయం కరిగిపోగా "ఇతను కదా! నిజమైన శివభక్తుడు, వడ్లరాశులను మాత్రమే కాదు రాజ్యానికి సంబంధించిన, ఆస్తులన్నింటినీ శివభక్తులు కొల్లగొట్టుకుపోనీ!" అని ఇడంగళి నాయనారు ఆ భక్తునితో చెప్పాడు. ఆవిధంగానే రాజుగారు దండోరా వేయించారు.

శివభక్తులు రాజుగారి గిడ్డంగులకు వెళ్లి తమకు కావలసినవన్నీ తెచ్చుకున్నారు. ఈ విధంగా శివభక్తులకు సేవచేస్తూ శివభక్తితో కాలంగడిపి చివరగా ఇడంగళి నాయనారు శివసాయుజ్యాన్ని పొందాడు.

## 53. సెరుత్తుణై నాయనారు

**చో**ళ మండలంలోని తంజావూరులో వేళాలకులంలో సెరుత్తుణై నాయనారు అనే శివభక్తుడు ఉండేవాడు. అతడు తిరువారూరు వెళ్లి వన్మీకనాధుని అర్చిస్తూ వచ్చాడు. ఒకరోజు శివాలయానికి వెళ్లి స్వామికి ప్రణతులర్పించి తిరిగివస్తుండగా కళర్ సింగ నాయనారు భార్య పట్టపురాణి పుష్పమండపంలో ఉన్న ఒక పుష్పాన్ని వాసన చూసింది. దానిని చూసిన వెంటనే సెరుత్తుణై నాయనారు కోపావేశంతో తన దగ్గరున్న కరవాలాన్ని తీసుకొని పట్టపురాణి ముక్కును ఖండించి వేశాడు. పరమేశ్వరుని పూజకు ఉద్దేశింపబడిన పుష్పాన్ని వాసన చూడ్డం గొప్ప తప్పిదంగా భావించి సెరుత్తుణై నాయనారు ఆవిధంగా రాణిగారి ముక్కును కోసివేశాడు. ఈ విధంగా సెరుత్తుణై నాయనారు స్వామి కైంకర్యం చేస్తూ శివసాయుజ్యాన్ని పొందాడు.

## 54. పుగళ్ తుణై నాయనారు

**సె**రుసిల్లి పుత్తూరులో వైదికకులంలో జన్మించిన పుగళ్ తుణై నాయనారు అనే శివభక్తుడు ఉండేవాడు. అతడు రోజూ నియమం తప్పక శివుని పూజిస్తూ వచ్చాడు. ఆరోజుల్లో లోకంలో తీవ్రమైన కరువు దాపురించింది. పుగళ్ తుణై నాయనారు కూడ కరువు బాధకు గురయ్యాడు. చాలారోజులు ఆహారం లేకుండా ఉన్నందువలన కృశించిపోయాడు. అయినప్పటికీ తన శివపూజను మాత్రం వదలనని చెప్పి రోజూ చేస్తూ వచ్చాడు.



పుగళ్ తుణై నాయనారు ఒకరోజు శివునికి అభిషేకం చేస్తూ ఆకలిబాధకు తనచేతిలో ఉన్న నీటి కడవను మోయలేక శివునిమీద జారవిడిచి, తానూ స్పృహతప్పి కిందపడి పోయాడు. అప్పుడు పరమేశ్వరుడు నాయనారుకు ప్రత్యక్షమై "ప్రియమైన భక్తుడా! నీ పేదరికం తొలగిపోయేలా రోజూ ఈ పీఠం మీద నీకోసమై ఒక బంగారు నాణెం ఉంచుతాను. నీవు తీసుకో" అని చెప్పారు. ఆవిధంగానే అతనికి బంగారు నాణెం లభించింది. పుగళ్ తుణై నాయనారు సంతోషంతో యధావిధిగా భగవంతున్ని పూజిస్తూ శివ సాయుజ్యాన్ని పొందాడు.

## 55. కోట్పులి నాయనారు

**తి**రు నాట్టియత్తాన్ కుడి అనే గ్రామంలో వేళాల కులంలో కోట్పులి నాయనారు జన్మించాడు. చోళ చక్రవర్తి సైన్యాధిపతి అయిన ఇతడు గొప్ప శివభక్తుడు. కోట్పులి నాయనారు తాను రాజుగారి దగ్గరనుండి జీతంగా స్వీకరించిన ధనాన్ని పూర్తిగా శివాలయంలో స్వామికి రోజూ నైవేద్యం సమర్పించడానికి ఉపయోగపడేలా వడ్ల మూటలను కొని వాటిని భద్రపరుస్తూ వచ్చాడు.

ఒక పర్యాయం కోట్పులి నాయనారు రాజాజ్ఞ ప్రకారం శత్రువుల మీదికి దండెత్తి వెళ్లాడు. "తాను తిరిగి వచ్చేంత వరకు దేవాలయంలో స్వామికి నైవేద్య కైంకర్యం యథాప్రకారం జరగాలని" అతడు నిశ్చయించాడు. వెంటనే బండ్లకొలది వడ్ల మూటలను కొని వాటిని పెద్ద పర్వతంవలె పోగుచేసి పెట్టాడు. తన బంధువులను పిలిచి "పరమశివుని నైవేద్యంకోసం చేర్చిపెట్టిన ఈ వడ్లను మీరు మనసులో కూడ తాకడానికి ప్రయత్నించ కూడదు. ఇది శివుని మీది ఆన" అని కట్టడి చేసి యుద్ధానికి వెళ్లాడు.

వారు యుద్ధానికి వెళ్లిన కొద్దిరోజులకే పెద్ద కరువు వచ్చింది. "మనం ఆకలితో చావడంకన్నా కోట్పులి నాయనారు శివునికి నైవేద్యం నిమిత్తం చేర్చిపెట్టి ఉన్న వడ్లను ఆహారంగా తీసుకుందాము. మనకు లభించినపుడు తిరిగిఇచ్చి వేద్దాము" అని అనుకొని నాయనారు బంధువులు ఆ వడ్లను తీసుకున్నారు.

కోట్పులి నాయనారు యుద్ధంలో శత్రువులను జయించాడు. రాజుగారు సంతోషించి అతనికి అపారమైన వస్తుసంపదలను బహుమతిగా ఇచ్చాడు. నాయనారు వాటిని తీసుకొని తన గ్రామమైన తిరునాట్టి యత్తాన్ కుడికి వచ్చాడు. తన ఊరు చేరుకోగానే నాయనారుకు తన బంధువులు గావించిన దుష్కృత్యం తెలియవచ్చింది. ''శివుని సొత్తును మింగిన ఈ దుర్మార్గులనందరినీ సంహరిస్తాను" అని కోపావేశంతో మండిపడ్డాడు. కాని అతను తన కోపాన్ని ఎవరికీ తెలియనివ్వలేదు ''గ్రామంలోని బంధువులందరికీ నూతనవస్త్రాలను, వస్తువులను బహుమతిగా ఇస్తాను. అందువలన వారినందరినీ వెళ్లి పిలుచుకురండి" అని తన సేవకులను నియోగించాడు. వాళ్లందరూ వెళ్లి గ్రామంలో ఉన్న నాయనారు బంధువులను పిలుచుకు వచ్చారు.

కోట్పులి నాయనారు తన సేవకుడైన కోట్పులిని ఇంటి వాకిలి ముందు కాపలాగా ఉండమని చెప్పి తన బంధువులతో "పరమేశ్వరుని నైవేద్యం కోసం ఏర్పాటుచేసిన వడ్లమూటలను ఆహారంగా స్వీకరించి శివునిమీద పెట్టిన ఆనను మీరు అతిక్రమించారు. మిమ్మల్ని చంపకుండా వదలను" అని చెబుతూ బంధువుల నందరినీ వరుసగా తన కరవాలంతో హతమార్చాడు.

పరమేశ్వరుడు తన భక్తుని అపూర్వమైన భక్తికి ప్రీతుడై అతని ముందు ప్రత్యక్షమయ్యాడు. "నీ కరవాలంతో నీవు నీ బంధువులను చంపడం వలన



వాళ్లందరూ పునీతులై సర్గలోకానికి చేరుకొని తరువాత నాలోకానికి వస్తారు. నీవు ఇప్పుడే మాతో కైలాసానికి రావలసింది" అని చెప్పి కోట్పులి నాయనారును తనతోపాటు కైలాసానికి పిలుచుకు వెళ్లాడు.

## 56. పూసలార్ నాయనారు

**తొ**ండ మండలంలోని ఒక అందమైన గ్రామం తిరునిన్టవూరు. ఆ గ్రామంలో ఒక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు పూసలారు. తన సంపాదన పూర్తిగా అతడు శివభక్తులకే సంతోషంగా ఇస్తుండేవాడు. అతను పరమేశ్వరునికి ఒక దేవాలయాన్ని నిర్మించాలని అనుకున్నాడు. కాని దానికి కావలసిన డబ్బు అతని దగ్గర లేదు. డబ్బుకోసం అతను ఎంతో ప్రయత్నం చేశాడు. కాని అతని ప్రయత్నాలన్నీ వమ్మాయ్యాయి. తన కోరిక నెరవేరలేక పోయిందని అతడు చాలా బాధపడ్డాడు. చివరకు తన మనసులోనే శివునికి ఒక దేవాలయాన్ని నిర్మించాలని నిర్ణయించుకొన్నాడు.

ఆలయానికి కావలసిన రాళ్లు, ఇసుక, సున్నం, మట్టి మొదలైన వాటిని తన హృదయంలోనే సేకరించుకొన్నాడు. నేర్పరులైన పనివాళ్లను నియమించు కొన్నాడు. ఒక శుభ ముహూర్తంలో ఆలయ శంఖుస్థాపన గావించి రాత్రింబగళ్లు విరామం లేకుండా గుడికట్టడం ప్రారంభించాడు. ఈ రోజుకు ఈ పని చేసి ముగించాలి అని మనసులో ఒక ప్రణాళిక వేసుకొని దాని ప్రకారం ఆ పని పూర్తిచేస్తూ వచ్చాడు. గోడలు, విమానం, గోపురం, ప్రాకారం, కోనేరు, బావి మొదలైనవి వరుసగా నిర్మించుకుంటూ వచ్చాడు. ఈ విధంగా ఒక్కొక్కటిగా దేవాలయానికి సంబంధించిన కార్యక్రమాన్ని తన మనసులోనే పూర్తిచేసాడు. అందమైన దేవాలయం తయారైంది. ఆ దేవాలయానికి కుంభాభిషేకం చేయడానికి కూడ ఏర్పాట్లు పూర్తిచేసి ఒక శుభముహూర్తాన్ని నిశ్చయించాడు.

ఆ సమయంలో కాంచిపురంలో రాజసింహ పల్లవ చక్రవర్తి శివునికి ఒక పెద్ద దేవాలయాన్ని నిర్మించి తన సంపదనంతా భగవంతునికి సమర్పించాడు. పూసలారు తన హృదయంలో ఉన్న దేవాలయానికి కుంభాభిషేకం ఏరోజు చేయాలని నిశ్చయించుకున్నాడో ఆరోజే రాజుగారు కూడ తాను కట్టిన శిలా నిర్మిత దేవాలయానికి కుంభాభిషేకం చేయాలని నిశ్యయించుకొన్నాడు.

కుంభాభిషేకం జరుగుతున్న రోజుకు ముందురోజు రాత్రి రాజుగారి కలలో శివుడు ప్రత్యక్షమై "తిరు నిన్టవూరులోని పూసల నాయనారు చాలాకాలం శ్రమించి ఒక దేవాలయాన్ని నిర్మించాడు. మేము రేపు అక్కడికి వెళ్తున్నాము. నీవు కట్టిన దేవాలయానికి కుంభాభిషేకం వేరొక రోజుకు పెట్టుకో" అని చెప్పి అంతర్థానమయ్యాడు.

పరమేశ్వరుని మాటలను విన్న రాజు ఆశ్చర్యపోయాడు. "పరమేశ్వరునికి అపూర్వమైన దేవాలయాన్ని నిర్మించిన ఆ పుణ్యాత్ముని దర్శించి నమస్కరించాలి" అనుకొని రాజు తిరునిన్టవూరు ప్రయాణమై వెళ్లాడు. పూసలారు దగ్గరికి వెళ్లి వారిని చూసి నమస్కరించాడు. "మీరు కట్టిన దేవాలయం ఎక్కడ ఉంది? ఆ గుడిలో పరమేశ్వరుని ప్రతిష్టచేసే రోజు ఇదేనని నా కలలో స్వామి ప్రత్యక్షమై చెప్పాడు. అందువలన మిమ్మల్ని చూడాలని వచ్చాను" అన్నాడు.

"భగవంతుడు నాపై అవ్యాజ కరుణా వర్షాన్ని కురిపించాడు. నా దగ్గర సంపద ఇంచుకైనా లేదు. అందువలన హృదయంలోనే దేవాలయాన్ని నిర్మించాను" అని పూసలారు తన మనసులో కట్టిన దేవాలయం గురించి చెప్పాడు. రాజుగారు ఈ సంగతి విని ఆశ్చర్య చకితులయ్యారు.



సంతోషాతిరేకంతో "ఈ భక్తుని భక్తి ఎంత అపూర్వమైంది" అని పూసలారు నాయనారుకు నమస్కరించాడు.

పూసలారు తన హృదయంలో కట్టుకొన్న దేవాలయంలో పరమేశ్వరుని స్థాపించాడు. చేయవలసిన పూజలన్నీ నియమం తప్పక చేస్తూ వచ్చాడు. చివరగా పరమేశ్వరుని పాదపద్మాలను చేరుకున్నాడు.

## 57. మంగైయర్ కరసి అమ్మెయార్

**చో**ళరాజ పుత్రి అయిన మంగైయర్క్కరసి మదురైలోని నెడుమార నాయనారుకు భార్య. కెందామరలో విరాజిల్లుతున్న శ్రీమహాలక్ష్మితో ఉపమిస్తున్న ఈమె పాండ్య వంశానికి వచ్చిన అపనిందను తొలగించిన మహనీయురాలు. తమిళనాడుకు వచ్చిన కష్టాలను తిరుజ్ఞాన సంబంధరు నాయనారు అనుగ్రహంతో తొలగించి శివభక్తి లోకమంతా వ్యాపించడానికి కారణమైంది. దేశంలో శైవం దృఢంగా నెల నాటుకోవడానికి కృషిచేసి శివభక్తి తత్పరురాలై పరమేశ్వరుని పాదపద్మాలను చేరుకొంది.

## 58. నేస నాయనారు

**బ**ళ్లారి జిల్లాలోని కంపిలి అనేగ్రామంలో సాలె కులానికి నాయకుడుగా ప్రసిద్ధిగాంచిన నేస నాయనారు నివసిస్తూ ఉండేవాడు. అతడు తన చిత్తంలో పరమేశ్వరుని పాద పద్మాలను, వాక్కులో శివ పంచాక్షరి మంత్రాన్ని నిలుపుకొన్న పరమ శివభక్తుడు. శివభక్తుల కోసమే తన శరీరాన్ని అర్పణ గావించి జీవితాన్ని సాగించాడు. ఉత్తరీయం, కౌపీనం, ధరించడానికి దుస్తులు నేసి వాటిని తన దగ్గరకు వచ్చే శివ భక్తులకు సంతోషంగా ఇస్తుండేవాడు. శివభక్తులు ఎదురైతే వారికి భక్తితో నమస్కరిస్తూ,

శైవధర్మాలను పాటిస్తూ జీవికను సాగించి చివరగా పరమేశ్వరుని తిరుచరణాల సన్నిధికి చేరుకున్నాడు.

## 59. కోచ్చెంగ చోళ నాయనారు

**కా**వేరి నది ప్రవహించే చోళ దేశంలో చంద్ర తీర్థానికి సమీపంలో ఒక అరణ్యముంది. అక్కడున్న ఒక వెణ్ణవల వృక్షం కింద పూర్వ మొకప్పుడు శివుడు లింగరూపంలో వెలశాడు. ఆ అడవిలో ఒక ఏనుగు ఉంది. పూర్వజన్మలో చేసిన తపః ఫలితంగా ఆ ఏనుగుకు శివలింగాన్ని చూడగానే దైవభక్తి పెల్లుబుకింది. ఆ ఏనుగు తన తొండంతో నదిలోని నీటిని తీసుకు వచ్చి శివలింగానికి అభిషేకం చేసింది. పూలగుత్తులను కోసుకువచ్చి స్వామికి అలంకరణచేసి నమస్కరించింది. ఈవిధంగా క్రమం తప్పకుండా ఆ ఏనుగు రోజూ స్వామికి పూజచేస్తూ వచ్చింది. ఏనుగు పూజించడం వలన ఆ ప్రదేశానికి 'తిరువానైక్కా' అనే పేరు వచ్చింది.

ఒకరోజు ఒక సాలెపురుగు అక్కడికి వచ్చి శివలింగాన్ని చూసింది. పూర్వజన్మలో అది శివగణాలలో ఒకరుగా ఉండేది. అందువలన పూర్వజన్మలోని శివభక్తి దానికి మళ్లీ ఉదయించింది. పరమేశ్వరునిపై ఎండ, దుమ్ము పడకుండా తన నోటినుండి తీసిన వలతో ఒక వితానాన్ని అల్లింది. మరురోజు యధాప్రకారం ఏనుగు శివపూజ నిమిత్తం అక్కడికి వచ్చింది. శివలింగంపైనున్న సాలెగూడును చూసింది "ఈ అనుచితమైన పని ఎవరు చేశారు?" అంటూ ఆ వలను చెరిపివేసి రోజూ చేసే పద్ధతిలో భక్తితో అభిషేక పూజాదులు నిర్వహించింది.

"ఏనుగు కారణంగానే తాను కట్టిన వితానం చెదరిపోయింది" అని సాలేపురుగు భావించి మళ్లీ శివలింగంపైన వితానాన్ని నిర్మించింది. ఏనుగు మళ్లీ అక్కడికి వచ్చి సాలెగూడునుచెరిపివేసింది. సాలెపురుగుకు మిక్కుటమైన కోపం వచ్చింది. "ఈ దుష్ట ఏనుగు ఒక పర్యాయం కాదు. రెండు పర్యాయాలు ఈ విధంగా గూడును చెదరగొట్టి శివాపరాధం చేసింది" అని కోపంతో సాలెపురుగు ఏనుగు తొండంగుండా లోపలికి వెళ్లి దానిని తీవ్రంగా బాధపెట్టింది. ఏనుగు నొప్పిని సహించలేకపోయింది. అది తన తొండాన్ని నేలమీద గట్టిగా మోదింది. అందువలన ఆ ఏనుగు స్పృహతప్పి కిందపడి మరణించింది. ఏనుగు కొట్టిన వేగం వలన తొండంలోపల ఉన్న సాలెపురుగు కూడ మరణించింది. మరణించిన ఏనుగునకు కైలాసంలో పరమేశ్వరుని సన్నిధిలో ఉండే భాగ్యం కలిగింది. చనిపోయిన సాలెపురుగు చోళ చక్రవర్తిగా జన్మించింది.

చోళ వంశోద్ధవుడైన కోచ్చెంగ చోళుడు సింహాసన మధిష్టించి రాజ్యాధికారాన్ని స్వీకరించాడు. తిరువానైక్కాలో అతను పూర్వజన్మలో సాలెపురుగుగా ఉండి పరమేశ్వరుని పూజించిన జ్ఞాపకాలు పరమేశ్వరుని అనుగ్రహంతో అతనికి కలిగింది. అతడు తిరువానైక్కాలో వెణ్ణావల్ వృక్షంతో సహా ఒక అందమైన దేవాలయాన్ని నిర్మించాడు. చివరగా తిల్లై నటరాజస్వామి తిరుచరణాల సన్నిధికి చేరుకున్నాడు.

## 60. తిరు నీలకంఠ యాళ్‌ప్పాణ నాయనారు

**తి**రువెరుక్కత్తం పులియూరులో పాణర్ వంశంలో తిరు నీలకంఠ యాళ్ ప్పాణర్ జన్మించాడు. అతడు తన కులోచిత వృత్తి ప్రకారం యాళ్ వాయిద్యాన్ని మీటి సంగీతాన్ని వినిపిస్తూ ఉండేవాడు. ఆ విధంగా చోళదేశంలోని ప్రసిద్ధ శివాలయాలు దర్శించుకుంటూ అక్కడి స్వామివారిని యాళ్ వాయిద్య సంగీతంలో స్తుతిస్తూ మదురై చేరుకున్నాడు. పరమేశ్వరుడు

సంతోషించి ఆరోజు రాత్రి ఆ ఊరిభక్తుల కలలో కనిపించి "యాళ్ ప్పాణరును మీరు ఆహ్వానించి గుడికి తీసుకురండి" అని ఆజ్ఞాపించాడు. మరురోజు భక్తులందరూ పాణరును పిలుచుకొని దేవాలయానికి వెళ్లారు. తిరు నీలకంఠ యాళ్ ప్పాణరు భక్తి పరవశంతో సంగీతాన్ని ఆలపించాడు.

ఈ విధంగా స్వామిపై స్తుతి గీతాలను రాస్తూ నాయనారు తిరువారూరు చేరుకున్నాడు. గుడి ముందు నిలబడి భగవంతుని స్తుతించడం ప్రారంభించాడు. భగవంతుడు సంతోషించి పాణరుడు గుడిలోపలికి రావడానికి ఉత్తరదిక్కులో వేరొక ద్వారాన్ని సృష్టించాడు. ఆ ద్వారంగుండా యాళ్ ప్పాణరు గుడి లోపలికి వెళ్లి భగవంతునికి ప్రణామాలర్పించాడు.

తిరుజ్ఞాన సంబంధరు వెళ్లే ప్రతిచోటికీ వెళ్లి వారు పాడే స్తోత్ర పద్యాలను యాళ్ వాయిద్యంతో ఇతడు పాడుతూ ఉండేవాడు. తిరునల్లూరులో తిరుజ్ఞాన సంబంధరుతో కలిసి యాళ్ ప్పాణరు పుట్టుకయే లేని వరాన్ని పొంది ధన్యజీవుడయ్యాడు.

## 61. శడైయ నాయనారు

**శ**డయ నాయనారు తిరునావలూరు గ్రామంలోని ఒక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. గొప్ప శివభక్తుడు. నాలుగు వేదాలను క్షుణ్ణంగా అభ్యసించాడు. లోకాలను పావనం చేసిన, శైవ మతాన్ని ఉద్ధరించిన, ప్రజలనందరినీ పునీతులను గావించిన సుందరమూర్తిని కన్నతండ్రి ఇతడే.

## 62. ఇసై జ్ఞానియర్

**ఈ**మె శివభక్తుడైన శడయ నాయనారు ధర్మపత్ని. సుందరమూర్తి నాయనారు కన్నతల్లి అయిన ఈమె శివభక్తి తత్పరతను వర్ణించడానికి



ఎవరికైనా సాధ్యమా! బాల్యంనుండే సుందరమూర్తిని శైవాచార పరాయణునిగా ఈమె తీర్చి దిద్దింది. ఈమె సంగీతంలో కూడ నిష్ణాతురాలు.

## 63. సుందర మూర్తి నాయనారు

**సు**ందరమూర్తి నాయనారు తిరువారూరులో భక్తితో త్యాగరాజ స్వామిని సేవిస్తుండేవాడు. ఒక పర్యాయం వారికి చేర చక్రవర్తి అయిన చేరమాన్ పెరుమాళ్‌ను చూడాలనే కోరిక కలిగి వెంటనే స్వామి అనుమతి తీసుకొని అక్కడి నుండి బయలు దేరాడు.

అతను త్రోవలో శివాలయాలను దర్శిస్తూ, స్తోత్ర పద్యాలైన పదిగములను రచిస్తూ చేర దేశమైన తిరుప్పుక్కొళియూరు చేరుకున్నాడు. ఆ గ్రామంలో బ్రాహ్మణ అగ్రహారంలోని మాడవీథిలో వెళ్తుండగా ఎదురెదురుగా ఉన్న రెండు ఇండ్ల నుండి ఒక ఇంట్లో మంగళవాయిద్యాలు మరొక ఇంట్లో శోకాలాపాలు వినిపించాయి. సుందరమూర్తికి ఆశ్చర్యం కలిగింది. అక్కడున్న వారిని చూసి "ఒకే సమయంలో రెండు ఇండ్లలో ఈ విధంగా భిన్న ధ్వనులు రావడానికి కారణమేమి?" అని అడిగారు. అక్కడి బ్రాహ్మణులు సుందరమూర్తిని చూసి "స్వామీ! ఇద్దరు బాలురు మడుగులో స్నానం చేయడానికి వెళ్లారు. అందులో ఒక బాలుని మొసలి మింగి వేసింది. వేరొక బాలుడు ప్రాణాలతో తప్పించుకున్నాడు. అతనికి ఈరోజు ఉపనయనం చేస్తున్నారు. అందువల్ల వారింట్లో మంగళ వాయిద్యాలు మోగుతున్నాయి. అదుగో అక్కడున్నది కొడుకును పోగొట్టుకొన్న వారి ఇల్లు. అందువల్ల అక్కడ శోకాలాపాలు వినిపిస్తున్నాయి" అన్నారు.

కుమారుని పోగొట్టుకొన్న వాళ్లు చాలాకాలం నుండి సుందరమూర్తి నాయనారును దర్శించి నమస్కరించాలని ఎదురు చూస్తున్నారు.

సుందరమూర్తి అక్కడికి వెళ్లగానే వాళ్లు తమ దుఃఖాన్ని మరిచి వారికి ప్రణతులర్పించి నిలబడ్డారు. సుందర మూర్తి వాళ్లను చూసి "ప్రియమైన కుమారుని పోగొట్టుకొన్న వారు మీరేనా?" అని ప్రశ్నించాడు. ఆ పిల్లవాడిని కన్నవారము మేమే. మా పిల్లవాడిని మొసలి మింగివేసింది. మీ దర్శనం కోసం మేము చాలాకాలంగా కాచుకోనున్నాము. మా కోరిక ఇన్నాళ్లకు నెరవేరింది" అన్నారు.

సుందరమూర్తి మొసలి ఉన్న మడుగు దగ్గరికి వెళ్లి "ఏట్రాన్ మఱక్కేన్... అని ప్రారంభమయ్యే తిరుప్పదిగం(స్తోత్ర దశకం) గానం చేశారు. ఆ దశకంలో నాలుగో పద్యం పూర్తి కావడానికి పూర్వమే యముడు మొసలి నోటినుండి ఆ పిల్లవాడిని వెలుపలికి తీసుకువచ్చాడు. బయటకు వచ్చిన ఆ పిల్లవాడు గడిచిన రెండు సంవత్సరాల వయసును కూడ పొంది ఆరోగ్యంగా నిలబడ్డాడు.

సుందర మూర్తి నాయనారు అక్కడి నుండి చేర దేశానికి ప్రయాణమై వెళ్లాడు. సుందరమూర్తి నాయనారు మొసలినోటి నుండి బాలుని వెలుపలికి తీసిన వృత్తాంతం అక్కడి శివభక్తులు రాజైన చేరమాన్ పెరుమాళ్ నాయనారుకు తెలియజేశారు. వారు కూడ సుందరమూర్తి నాయనారు దివ్య చరిత్రను విని "గొప్ప శివభక్తుడూ, మహానుభావుడూ, అయిన సుందరమూర్తి నాయనారు నన్ను ఉద్ధరించడానికి వస్తున్నారు. ఈ సంతోషకరమైన వార్తను ఊరంతా నగారా మ్రోయించి వినిపించండి. నగరాన్ని అందంగా అలంకరించండి" అని చెప్పి సుందరులను సాదరంగా ఆహ్వానించడానికి మంత్రులను పంపించారు. వాళ్లుకూడ ఏనుగు మీద సుందరులను ఆసీనులను గావించి మంగళతూర్య రావాలు మ్రోగుతుండగా సగౌరవంగా పిలుచుకు వచ్చారు. చేరమాన్ చక్రవర్తి సుందరమూర్తి



నాయనారుకు ఎదురుగా వెళ్లి వారికి వినమ్రులై నమస్కరించాడు. సుందరమూర్తి కూడ రాజుగారికి నమస్కరించాడు. ఇరువురూ సంతోషం పొంగులు వారుతుండగా రాజ ప్రాసాదాన్ని చేరుకున్నారు. రాజుగారు నాయనారును సముచితాసీనులను గావించి వారిని పుష్పాలతో అర్చించారు. నాయనారు సంతోషంతో చేర రాజ్యంలో కొన్ని రోజులుండి అక్కడి శివాలయాలన్నింటినీ దర్శించాడు.

ఒకరోజు చేరమాన్ పెరుమాళ్ స్నానం చేయడానికి సుందరమూర్తిని వదలి వెళ్లారు. సుందరమూర్తి నాయనారుకు తాను వదలి వచ్చిన కైలాసాన్ని తిరిగి చేరుకునే సమయం ఆసన్నమైంది. పరమేశ్వరుడు బ్రహ్మాది దేవతలను చూసి "మీరు తెల్ల ఏనుగుతో వెళ్లి సుందర మూర్తిని దానిపై ఎక్కించి కైలాసానికి పిలుచుకురండి" అని ఆజ్ఞాపించాడు. వారు కూడ అదే ప్రకారం తిరువంజి కళత్తి గ్రామం చేరుకుని సుందరమూర్తి కోసం ఎదురుచూస్తూ నిలబడ్డారు. సుందరమూర్తి తిరుప్పదిగం గానం పూర్తి చేసుకొని గుడి వెలుపలికి వచ్చాడు. దేవతలందరూ ఆ శివ భక్తునికి నమస్కరించి శివాజ్ఞను అతనికి తెలియజేశారు. సుందరమూర్తి కూడ సంతోషంతో ఏనుగును అధిరోహించి కైలాసానికి చేరుకున్నాడు. కాని అతను హృదయంలో చేరమాన్ పెరుమాళ్ నాయనారును తలచుకుంటూనే ఉన్నాడు.

సుందరులు కైలాసానికి వెళ్తున్నారనే మంగళకరమైన వార్త చేరమాన్ పెరుమాళ్‌కు తెలిసింది. వారు గుర్రాన్ని అధిరోహించి దాన్ని చెవిలో వేగంగా వెళ్లమని చెప్పగా అది వాయువేగంతో వెళ్లి సుందరమూర్తి నాయనారు ఎక్కి ఉన్న ఏనుగుకు ప్రదక్షిణంగా వచ్చి నిలిచింది. చేరమాన్ పెరుమాళ్ ఆకాశంలో వెళ్లడం చూసిన అతని సైనికులు తమ ఏలికను విడిచి ఉండలేక ప్రాణాహుతి చేసుకున్నారు. వాళ్లు సూక్ష్మ రూపాలు ధరించి సుందరమూర్తిని

 నాయన్మారులు

చేరుకుని వారికి నమస్కరించి వారి అనుమతితో కైలాసం చేరుకున్నారు. సుందరమూర్తి పరమేశ్వరుని సమీపించి భక్తితో సాష్టాంగ నమస్కారం చేసి మృదు మధుర స్వరంతో "స్వామీ! చేరమాన్ పెరుమాళ్ నాయనారు ద్వారం వద్దనే ఉన్నారు" అని చెప్పాడు. పరమేశ్వరుడు నందీశ్వరుని పిలిచి "నీవు వేగంగా వెళ్లి చేరమాన్ నాయనారును ఇక్కడికి సాదరంగా పిలుచుకురా!" అని ఆజ్ఞాపించారు. నంది దేవుడు వేగంగా వెళ్లి చేరమాన్ నాయనారును చూసి "మిమ్మల్ని లోపలికి పిలుచుకు రమ్మని పరమేశ్వరుడు ఆజ్ఞాపించాడు" అని చెప్పాడు. చేరమాన్ శివుని పాదపద్మాలకు భక్తితో నమస్కరించగా వారు మందహాసం చేస్తూ "మేము నిన్ను పిలవకనే నీవు ఇక్కడికి వచ్చావే?" అని ప్రశ్నించారు. "ఓ దయానిధీ! నేను సుందరమూర్తి తిరు చరణాలను సేవిస్తూ వచ్చాను. మీ కరుణా ప్రవాహం నన్ను ఇక్కడికి తోసుకుంటూ వచ్చింది. మీమీద నేను "తిరుకైలాయ ఉలా" అనే లఘు కావ్యాన్ని రచించాను. దానిని మీరు ఆకర్ణించాలి" అని ప్రార్థించగా పరమేశ్వరుడు దానికి సమ్మతించి నాయనారు రచించిన కావ్యాన్ని విని ఆనందించాడు. "మీరిరువురూ కలసి శివగణాలకు నాయకత్వ బాధ్యతను వహించి కైలాసంలోనే ఉండండి" అని పరమేశ్వరుడు వారిరువురికీ శాశ్వతంగా కైలాసంలో ఉండే వరాన్ని అనుగ్రహించాడు.

❊ ❊ ❊